తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

నిజామాబాద్ : fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-9-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 223 పేజీలు: 10+4 వెల: 6.50




SHOWROOM: TELANGANA: RENAULT NIZAMABAD Ph: 9311700672.



కొలంబోలో గురువారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు స్వాగతం పలుకుతున్న శ్రీలంక మాజీ క్రికెటర్ సనత్ జయసూర్య

## మరో పదేళ్లలో భారత్ 'స్పేస్ స్టేషన్'

>> ప్రయోజనాలు కేవలం ఒక దేశానికే పరిమితం కాకుండా మానవాళి మొత్తానికి చేరాలని తమ మార్గదర్శక సూత్రం అని మోడీ పేర్కొన్నారు. ఇస్రోతో పాటు భారత్‌లోని ప్రైవేట్ అంతరిక్ష రంగం కూడా వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని తెలిపారు. ప్రైవేట్ సంస్థల వ్యాపార సామర్థ్యం, ఇస్రో శాస్త్రీయ నైపుణ్యంతో కలిసి భారత అంతరిక్ష రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్తున్నాయని చెప్పారు. భారత అంతరిక్ష కార్యక్రమం ప్రారంభమైన 1960ల నుంచే ఫ్రాన్స్ విశ్వసనీయ భాగస్వామిగా కొనసాగుతోందని మోడీ తెలిపారు. ప్రస్తుతం ఇరు దేశాల సహకారం భూ పరిశీలన నుంచి అత్యాధునిక సాంకేతికతల వరకు విస్తరించిందన్నారు. భారత్ అంతరిక్ష రంగంలో ప్రారంభించబోయే తదుపరి దశ ప్రయాణంలో ఫ్రాన్స్‌తో పాటు ప్రపంచ దేశాలు కూడా భాగస్వాములు కావాలని మోడీ ఆహ్వానించారు. పారిస్‌లో జరుగుతున్న స్పేస్ సమ్మిట్ ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్ని ఇవ్వాలని మోడీ ఆకాంక్షించారు. అంతరిక్షాన్ని కలిసి అన్వేషించడం, కలిసి కొత్త ఆవిష్కరణలు చేయడం, భవిష్యత్ తరాల కోసం అంతరిక్షాన్ని కలిసి రక్షించడం లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు, అంతరిక్ష సంస్థలు, ప్రైవేట్ కంపెనీలు, శాస్త్రవేత్తలు ఈ సమ్మిట్‌లో పాల్గొంటున్నారు. సమాజ అభివృద్ధికి అంతరిక్ష కార్యకలాపాలను దీర్ఘకాలికంగా కీలకమైన శక్తిగా మార్చే దిశగా ఈ సమావేశంలో చర్చలు జరుగుతున్నాయి.

## ఉద్యోగులకు కోటి బీమా

>> తదితర సిబ్బంది ఉన్నారు. 2,72,600 మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు ఉన్నారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్న బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరిపి ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగుల జీతాలు తమ బ్యాంకుల ద్వారా జమ అవుతున్నందున, బ్యాంకులకు వ్యాపార పరంగా ప్రయోజనం కలుగుతున్న నేపథ్యంలో బీమా పథకానికి బ్యాంకులే సహకరించేలా ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. దీంతో ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ప్రీమియం భారం లేకుండా పథకం అమలవుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఇప్పటివరకు 33 క్లెయిమ్‌లు వచ్చాయన్నారు. అందులో 24 క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు ప్రకటించారు. విద్యుత్ శాఖకు చెందిన ఎస్పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్, టీజీ జెన్‌కో, ట్రాన్స్‌కో పరిధిలో 15 క్లెయిమ్‌లు రాగా, అన్నింటినీ పరిష్కరించినట్లు చెప్పారు. ఈ విభాగంలో రూ.15 కోట్లకు పైగా చెల్లింపులు జరిగినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా సింగరేణి కాలరీస్‌లో 50 క్లెయిమ్‌లు రాగా అన్నింటిని పరిష్కరించినట్లు తెలిపారు ఉద్యోగుల హెల్త్‌కార్డులతో క్యాష్‌లెస్ వైద్యం, సీజీహెచ్‌ఎస్ ప్యాకేజీ వంటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆయన చెప్పారు. హెల్త్‌కార్డు పథకం కోసం ఇప్పటికే సుమారు రూ.240 కోట్ల నిధులు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి బీమా, ఆరోగ్య భద్రతకు హెల్త్‌కార్డు, రెండు పథకాలూ ఉద్యోగ కుటుంబాలకు ఆర్థిక, వైద్య భరోసా కల్పించేలా రూపొందించామని డి.సిఎం భట్టి శాసనసభకు చెప్పారు.

## సిఎంపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు

>> తెలిపారు. పవిత్రమైన చట్ట సభలో అవాస్తవాలతో సిఎం నకిలీ పత్రాలను ప్రదర్శించడం సభా హక్కు ఉల్లంఘనే అని పేర్కొన్నారు. వాస్తవ విరుద్ధమైన, తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేసినందుకు గానూ, సిఎం రేవంత్‌పై శాసనసభా నియమావళి సెక్షన్ 168 కింద సభా హక్కుల ఉల్లంఘన నోటీను ఇస్తున్నామని తెలిపారు. తక్షణమే తమ విజ్ఞప్తిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## కౌన్సిల్ నుంచి బిఆర్ఎస్ వాకౌట్

>> తాతా మధు, నవీన్ సస్పెన్షన్ ఎత్తివేయాలని పోడియం వద్ద పేపర్లు చింపి పైకి ఎగురవేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులను తక్షణమే తీసేయాలని మార్షల్స్‌ను మండలి ఛైర్మన్ ఆదేశించారు. దీంతో మార్షల్స్ ద్వారా సభ్యుల గౌరవానికి భంగం కలిగిస్తున్నారని మధుసూదనాచారి ఆరోపించారు. తర్వాత 22ఏ అంశంపై చర్చించాలని పట్టుబట్టి ఎల్‌వోపి మధుసూధనాచారి వాయిదా తీర్మాణం ఇవ్వడంతో దాన్ని ఛైర్మన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి తిరస్కరించారు. దీంతో తమకు మాట్లాడే అవకాశం కల్పించడం లేదంటూ సభనుంచి వాకౌట్ చేశారు. ఈసందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ భూ అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేస్తున్నారని భూముల అంశంలో బీఆర్ఎస్ నేతలు పేర్కొంటున్న పేరు ఆ వివాదంలో లేదని స్పష్టతనిచ్చారు. ప్రతిపక్ష పార్టీ సభ్యుల ప్రస్తావన సరైన మార్గంలో వస్తే చర్చకు ప్రభుత్వం సిద్ధమని మంత్రి ప్రకటించారు.

## నేడు అసెంబ్లీలో 22ఎ నిషేధిత భూముల జాబితా అంశంపై చర్చ

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** శుక్రవారంసభలో 22ఏ నిషేధిత భూముల జాబితాఅంశంపై చర్చ జరగనుంది. వీటితోపాటు జనగణనలో బీసీ కులాలు ఆప్షన్ చేర్చాలనే అంశంపై చర్చించి, తీర్మానం చేయనున్నారు. అసెంబ్లీ సమావేశాలు శనివారం ముగియనున్నాయి.

## ఢిల్లీకి వెళ్లిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మీ ్మ, జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వ ర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వాణిదేవి గురువారం సాయంత్రం ఢిల్లీకి వెళ్లారు. శుక్రవారం జాతీయ మహిళా కమిషన్, ఎన్‌హెచ్‌ఆర్‌సీని కలవనున్నారు. అసెంబ్లీ వద్ద జరిగిన దాడిపై ఫిర్యాదు చేయనున్నారు.

## కెటిఆర్ నివాసంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేల బ్రేక్‌ఫాస్ట్ సమావేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** గురువారం ఉదయం కేటీఆర్ నివాసంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బ్రేక్‌ఫాస్ట్ సమావేశం అయ్యారు. సస్పెన్షన్ నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై చర్చించారు. సీఎంపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. సైబర్ క్రైమ్‌లో కూడా ఫిర్యాదు చేసేందుకు, ఢిల్లీలో జాతీయ మానవ హక్కుల కమిషన్, మహిళా కమిషన్‌కు ఆ పార్టీ నేతలు ఫిర్యాదు అందించేందుకు నిర్ణయం తీసుకున్నారు.

## రియల్టర్ రాంరెడ్డి ఆత్మహత్య

### వ్యాపారంలో ఒడిదుడుకులే కారణం

**కందుకూరు. అక్టోబరు 10. ప్రభాతవార్త:** అనుమానాస్పద పరిస్థితుల్లో రియల్టర్ తన వ్యవసాయ పొలం వద్ద ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. సంఘటన వివరాలు పోలీసుల బాధితుల కథనం ప్రకారం ఈ విధంగా ఉంది.



మండల పరిధిలోని నేదునూరు గ్రామానికి చెందిన బాణాల రాంరెడ్డి తండ్రి నరసింహారెడ్డి (48) బుధవారం వ్యవసాయ క్షేత్రంలోని గెస్ట్ హౌస్ లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పెద్ద మొత్తంలో రియల్ వ్యాపారం చేసే బాణాల రాం రెడ్డి ఇటీవల పటాన్చెరువు ప్రాంతంలో 250 ఎకరాల భూమిని తీసుకొని ప్లాటుగా చేస్తున్నట్టు తెలిపారు. ఈ వ్యాపారంలో జరిగిన ఒడిదుడుకుల ప్రభావం వలన తీవ్ర మనస్థాపానికి గురైన రాంరెడ్డి గత కొంతకాలంగా మానసిక వేదనలను అనుభవిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ గచ్చిబౌలి ప్రాంతంలో నివాసం ఉండి రాంరెడ్డి బుధవారం ఉదయం తన స్వగ్రామం నేదునూరు గ్రామానికి వచ్చి వ్యవసాయ పొలానికి చేరుకున్నట్లు తెలిపారు. ఇతను పొలానికి వచ్చే సమయంలో కొత్త తాడును వెంట తెచ్చుకొని వ్యవసాయ పొలంలోని కిచెన్ షెడ్డు వద్ద రాడుకు ఉరి వేసుకున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన కారు డ్రైవర్ శ్యాం ఈ విషయాన్ని మృతుడు రాం రెడ్డి బంధువులకు సమాచారం ఇవ్వగా బంధువులు అక్కడికి చేరుకొని విషయాన్ని స్థానిక పోలీసులకు తెలియజేశారు. మృతుని బావ కోడూరు ప్రవీణ్ రెడ్డి (62) నివాసం ఫిలింనగర్ హైదరాబాద్ ఫిర్యాదు మేరకు కందుకూరు సిఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మాని ఆస్పత్రికి తరలించారు. మృతుని కి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. యూకేలో చదువుకునే కూతురు వచ్చిన తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలియజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఈ మరణం ఆర్థిక సమస్యలతో జరిగిందా మరేదైనా కారణంతో జరిగిందా అనే విధంగా వివిధ కోణాలను దర్యాప్తు చేస్తున్నట్లు కందుకూరు పోలీసులు తెలిపారు.

## వారం - వర్జ్యం

11-09-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె,
తి. అమావాస్య ఉ.8.58. న. పూర్వఫల్గుణి మ.1.19
వ.రా.8.25 - రా.9.59
దు.ఉ.8.23 - ఉ.9.12
2) మ.12.29 - మ.1.18
రాహు. ఉ.10.30-12.00. శుభ స. లేదు.

## వార్తాఫలం

**మేషం :** వృత్తి, ఉద్యోగాల పరంగా అదనపు బాధ్యతలను స్వీకరిస్తారు. మీ భావజాలంలో మార్పులు చోటు చేసుకుంటాయి.

**వృషభం :** అధిక ధనవ్యయాన్ని కలిగి ఉంటారు. కొత్త వర్గం ఆత్మీయ వర్గంగా పరిణమిస్తుంది.

**మిథునం :** చిరు పరిచయాలు మరింతగా బలపడతాయి. అవరోధాలను అవలీలగా అధిగమించగలుగుతారు.

**కర్కాటకం :** ఆర్థికంగా మెరుగైన ఫలితాలను సాధించగలుగుతారు. మీ ఆంతర్యం అర్థం చేసుకోవడం కష్టం.

**సింహం :** అభిరుచి కలిగిన పనులను పూర్తి చేయగలుగుతారు. ఋణాలు లభిస్తాయి. వ్యక్తిగత గౌరవం పెంపొందుతుంది.

**కన్య :** శక్తి సామర్థ్యాలు, పట్టుదల, ఓర్పు నేర్పు కలిగి ఉంటారు. జీర్ణసంబంధమైన ఇబ్బందులు ఏర్పడవచ్చు.

**తుల :** వ్యక్తిగత గౌరవం పెంపొందుతుంది. పొగడ్తలకు ఏమాత్రం లొంగరు. సొంత నిర్ణయాలనే అమలు చేస్తారు.

**వృశ్చికం :** ఇతరుల నుండి సలహాలను ఎక్కువగా తీసుకుంటారు. స్థిరాస్తి విషయమై అభిప్రాయ భేదాలు చోటు చేసుకుంటాయి.

**ధనుస్సు :** దైనందిన కార్యక్రమాలతో హడావుడిగా కాలాన్ని గడుపుతారు. స్పెక్యులేషన్లు దూరంగా ఉండటం మంచిది.

**మకరం :** జీవితం ఒకే చట్రంలో సాగుతున్నట్టుగా భావిస్తారు. కోర్టు వ్యవహారాలు వాయిదాలలో ఉంటాయి.

**కుంభం:** మీ ఆలోచనలకు విలువనిచ్చే టటువంటి ఆత్మీయవర్గం యొక్క సహాయ సహకారాలు నేడు అందుకోగలుగుతారు.

**మీనం :** ఎదుటివారు చెప్పేది ఆసాంతం విని ప్రత్యుత్తరం ఇవ్వండి. దురభ్యాసాలకు దూరంగా ఉంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# బిఆర్ఎస్ గ్రాఫ్ డౌన్

>> ఎర్రవల్లిలో చోటుచేసుకున్న శుద్ధీకరణ కార్యక్రమం వంటి అంశాలను సీఎం రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో ప్రస్తావించారు. ఈ ఘటనలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను కూడా ఎమ్మెల్యేలకు వివరించినట్లు సమాచారం. పోలీసు సిబ్బందిపై జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ.. కేటీఆర్‌కు పోలీసు అధికారుల్లో రేవంత్‌రెడ్డి కనిపించినట్లుగా ఉందని, అందుకే వారిపై అంత ఆగ్రహంతో వ్యవహరించారని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేసినట్లు తెలుస్తోంది. మొదటిసారి ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుందని.. వ్యక్తిగత పనితీరే గెలుపు, ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి శాసన సభ్యులకు సూచించారు. కాంగ్రెస్ నుంచి రాజకీయంగా ఎదిగి ప్రస్తుతం ఆ పార్టీపై విమర్శలు చేస్తున్న కొందరు నేతల వ్యవహారశైలిని కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి వంటి నేతలు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎదిగి కాంగ్రెస్‌కు నష్టం చేకూర్చాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ అసెంబ్లీ కార్యకలాపాలను సజావుగా సాగనివ్వకుండా కుట్ర చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఫామ్‌హౌస్‌లో సమావేశమై సభను అడ్డుకునే వ్యూహాన్ని రూపొందించారని ఆయన విమర్శించినట్లు తెలుస్తోంది. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు తమ అహంకార వైఖరిని మార్చుకోలేదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. మహిళా పోలీసు అధికారుల ఎదుట టీషర్టులు విప్పడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని, అలాగే శాసనసభాపతిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీఎం పేర్కొన్నట్లు సమాచారం. అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాలను ఎదుర్కొని ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రేవంత్‌రెడ్డి అభినందించారు. 22ఏ నిషేధిత భూముల జాబితా అంశంపై ప్రతిపక్షాలు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నాయని సిఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. పేద ప్రజలకు, రైతంగానికి మేలు చేసేలా ప్రభుత్వం అడుగులు వేస్తుంటే దాన్ని తప్పుదోవ పట్టించేలా బిఆర్ఎస్ నేతలు యత్నిస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ధరణి పోర్టల్ ద్వారా అక్రమంగా రాయించుకున్న భూముల చిట్టా అంతా తమ వద్ద సిద్దంగా ఉందని హెచ్చరించారు. త్వరలోనే బిఆర్ఎస్ నేతల అక్రమాలు, అవినీతికి సంబంధించిన పూర్తి చిట్టాను బయట పెడతానని, ప్రతిపక్షనేతల బండారం ప్రజల ముందు బట్టబయలు చేస్తామని, ఎవరినీ వదిలే ప్రసక్తే లేదని వార్నింగ్ ఇచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల పనితీరుపైనా సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంలో దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ప్రజలు అప్పగించిన పదవిని బాధ్యతగా నిర్వహించాలని, అసెంబ్లీ జరిగే అన్ని రోజుల్లో సభ్యులు పూర్తి స్థాయిలో హాజరై చర్చల్లో పాల్గొనాలని సూచించారు. తమ తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభలో ప్రస్తావించాలని ఎమ్మెల్యేలకు సూచించినట్లు సమాచారం. ఎమ్మెల్యేల వ్యక్తిగత పనితీరు, ప్రవర్తన భవిష్యత్ రాజకీయ విజయాలపై ప్రభావం చూపుతుందని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించినట్లు తెలుస్తోంది. తెలంగాణలో నిర్వహించిన కులగణన దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ నమూనాలో దేశవ్యాప్తంగా కులగణన చేపట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సూచించారు. రాష్ట్రంలో కులగణన ద్వారా వచ్చిన అంశాలను జాతీయ స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. దీనిపై పార్టీ ప్రజాప్రతినిధులు విస్తృతంగా మాట్లాడాలని సీఎం సూచించినట్లు సమాచారం. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించినట్లు సమాచారం. మరోసారి ఎమ్మెల్యేగా గెలవాలని భావించే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పరిరక్షణ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. దేశంలో వయోజనుల జనాభా, ఓటర్ల జాబితాలో నమోదైన ఓట్ల మధ్య వ్యత్యాసాన్ని ప్రస్తావిస్తూ సీఎం రేవంత్ రెడ్డి పలు ప్రశ్నలు లేవనెత్తినట్లు సమాచారం. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లు గా తేల్చారు, కానీ ఓటర్ల జాబితా మాత్రం 88 కోట్లుగా చూపుతున్నారు, దేశంలో 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయి, ఎక్కడో ఏదో ప్రమాదం పొంచి ఉందని స్పష్టం చేశారు. అధికారం పోయినా అహంకారం వీడకుండా పోలీసు అధికారులను, ప్రజా ప్రతినిధులను దూషించి, మూడు రోజులు సభను సజావుగా జరగకుండా చేశారు. అధికారులపై అనుచితంగా వ్యవహరించడం, మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించడం చేశారు, శాసన సభాపతిని అత్యంత అభ్యంతరకరంగా దూషించారు, నిరసన తెలిపేందుకు ఎస్సీ సెల్ కార్యక్రమం చేపడితే దళితులు నడిచిన నేలను శుద్ధి చేసి అవమానించారు, ప్రతిపక్ష కుట్రను బలంగా తిప్పి కొట్టి, ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజలకు తెలియజేసినందుకు ఎమ్మెల్యేలను అభినందించారు. జరిగిన సంఘటనలపై విచారణ చేపట్టామన్నారు. సభ్యులు తప్పనిసరిగా సభలో చర్చల్లో పాల్గొనండి, సభలో హాజరు శాతం తగ్గకుండా చూసుకోవాలి, ప్రజలు ఇచ్చిన హోదాను సరైన విధంగా ఉపయోగించుకోకపోతే భవిష్యత్ లో రాజకీయంగా రాణించలేరని చెప్పారు. అందరికీ వెసులుబాటుగా ఉండాలని అత్యంత చారిత్రక భవనంలో శాసన మండలి నిర్వహిస్తున్నాం, అసెంబ్లీలో సెంట్రల్ హాల్ ను ప్రారంభించుకుని దుద్దిళ్ల శ్రీపాదరావు గారి పేరు పెట్టుకున్నామని చెప్పారు. సభలో నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలు ప్రస్తావించాలి, అసెంబ్లీ జరిగినన్ని రోజులు సభ్యుల హాజరు సంపూర్ణంగా ఉండాలని చెప్పారు.

## గ్రామ పంచాయతీల ఆదాయం ఇక నేషనల్ బ్యాంకుల్లో జమ

### పంచాయతీరాజ్ చట్టం సవరణ బిల్లు ఉభయసభల్లో ఆమోదం

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** పంచాయతీరాజ్ చట్టం-2018 సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. గురువారం సభలో చర్చ అనంతరం సవరణ బిల్లుకు సభ్యులు ఆమోదం తెలిపారు. బిల్లును బుధవారం మంత్రి సీతక్క సభలో ప్రవేశపెట్టారు. కొత్త సవరణ ప్రకారం గ్రామ పంచాయతీలు సొంత ఆదాయాన్ని సమీపంలోని నేషనల్ బ్యాంకులో జమ చేసుకునేలా చట్ట సవరణ చేశారు. ప్రస్తుతం గ్రామపంచాయతీల సొంత ఆదాయం ట్రెజరీలో జమ చేస్తున్నారు. స్థానిక సంస్థలు కొంత సంక్షోభంలో పడ్డాయి.

పంచాయతీ రాజ్ చట్ట సవరణపై మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. రెండేళ్లుగా 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయన్న మంత్రి సీతక్క ఎన్నికల తర్వాత పెండింగ్ నిధులు ఇప్పుడిప్పుడే విడుదల అవుతున్నాయని తెలిపారు. కేంద్రం నుంచి దాదాపు రూ.700 కోట్ల పెండింగ్ నిధులు రావాల్సి ఉందని, స్టాంపు డ్యూటీని 2018లోనే తొలగించటం స్థానిక సంస్థలు కొంత సంక్షోభంలో పడ్డాయని చెప్పారు. గ్రామ పంచాయతీలకు ప్రతినెలా రూ.54 కోట్లు విడుదల చేస్తున్నామన్న మంత్రి సర్పంచ్‌లకు పెండింగ్ ఉన్న నిధుల్లో పంచాయతీరాజ్ శాఖ నుంచి ఏమీ లేవని స్పష్టం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేల ఫండ్స్ పనులు చేసి పంచాయతీరాజ్‌శాఖను అడుగుతున్నారని తెలిపారు. వివాదాల వల్ల ఎన్నికలు జరగని గ్రామాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే నిధులు ఇస్తోందని సభకు వివరించారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 70 లోని సబ్ సెక్షన్ 3 కు సవరణ చేస్తూ బిల్లును ప్రవేశ పెట్టామని పేర్కొన్నారు.

గ్రామ పంచాయతీకి వచ్చే డబ్బు గ్రామ అభివృద్ధికే ఉపయోగపడాలి. గ్రామ పంచాయతీకి వచ్చే ఆదాయం గ్రామ అవసరాలకు అందుబాటులో ఉండాలి. నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలి. ప్రజలకు జవాబుదారీతనం ఉండాలి. ఇదే మా ప్రజా ప్రభుత్వ విధానం అని ప్రకటించారు. మన దేశంలో గ్రామీణ స్థానిక సంస్థలను బలోపేతం చేయడం కోసం 73వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చారు. గ్రామ పంచాయతీలు కేవలం ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేసే సంస్థలుగా కాకుండా.. ప్రజలకు దగ్గరగా ఉండే స్వయం పాలనా సంస్థలుగా పనిచేయాలన్నదే దాని ప్రధాన ఉద్దేశం అని వివరించారు. స్థానిక సంస్థలకు అధికారాలు, బాధ్యతలతో పాటు వాటికి అవసరమైన ఆర్థిక వనరులు కూడా ఉండాలి. అందుకే పంచాయతీలకు కొన్ని పన్నులు, సుంకాలు, ఫీజులు వసూలు చేసుకునే అధికారాలను కూడా కల్పించారని చెప్పారు. గ్రామ పంచాయతీలకు రోడ్లు నిర్మించడం, డ్రైనేజీలు ఏర్పాటు చేయడం, పారిశుధ్యం నిర్వహించడం, వీధి దీపాలు ఏర్పాటు చేయడం, తాగునీటి సరఫరా వంటి అనేక ప్రాథమిక పౌర సేవల బాధ్యతలు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకునే అధికారం ఇచ్చి, ఆ ఆదాయాన్ని అవసరమైన సమయంలో వినియోగించుకునే స్వేచ్ఛ లేకపోతే స్థానిక స్వపరిపాలన ఎలా బలపడుతుంది? ఇదే ప్రశ్నకు సమాధానంగా ఈ సవరణను తీసుకొచ్చామని పేర్కొన్నారు.



గురువారం ముంబయిలో పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ చేపట్టిన 'మహా గణేశమూర్తి వర్క్‌షాప్ 2026' కార్యక్రమంలో తయారు చేసిన మట్టి విగ్రహాలతో విద్యార్థులు

## ఆ భూములు ఎలా ఇచ్చారు?

>> ప్రభుత్వం స్పష్టం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. టెస్సెరాక్ట్ కంపెనీకి భూముల కేటాయింపుపై అనేక సందేహాలు ఉన్నాయని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను కేటాయించే విషయంలో అనుసరించిన విధానం ఏమిటి? కంపెనీకి ఏ హోదాలో భూములు ఇచ్చారు? ఏ నిబంధనల ప్రకారం కేటాయింపు జరిగింది? కేటాయింపులకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు ఏమిటి? భూముల విలువ ఎం? వంటి అంశాలపై ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులని, వాటి కేటాయింపుల్లో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేటు సంస్థలకు కేటాయించే విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా అన్ని వివరాలను బహిర్గతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు.

**కొండల్‌రెడ్డి వ్యవహారంపైనా నిలదీత....**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డికి సంబంధించిన వ్యవహారంలో ప్రభుత్వ భూముల కేటాయింపులపై ఆరోపణలు వస్తున్నాయని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంబంధిత వ్యక్తులకు, సంస్థలకు ప్రభుత్వ భూముల కేటాయింపుల్లో ఎలాంటి సంబంధాలు ఉన్నాయో ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రభుత్వం తీరును ప్రశ్నిస్తూ.. టెస్సెరాక్ట్ సంస్థకు ఏ హోదాలో, ఏ నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూములు కేటాయించారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తుల విషయంలో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. భూముల కేటాయింపులపై తలెత్తుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం వాస్తవాలతో సమాధానం ఇవ్వాలని అన్నారు.

**టెస్సెరాక్ట్ ప్రాంతాన్ని పరిశీలించిన నేతలు....**

ధర్నా అనంతరం బీఆర్ఎస్ నాయకులు టెస్సెరాక్ట్ సంస్థ పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రభుత్వ భూముల కేటాయింపుకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను తెలియజేశారు. ప్రభుత్వ భూముల కేటాయింపులపై పూర్తి వివరాలు వెల్లడించే వరకు ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో పాటు పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బంటి)తో పాటు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. టెస్సెరాక్ట్ సంస్థకు ప్రభుత్వ భూముల కేటాయింపుపై ప్రభుత్వం సమగ్ర వివరాలను వెల్లడించి, ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లి, ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెడతామని వారు ప్రకటించారు.

## హోటళ్లపై టిజి సేఫ్ భారీగా దాడులు

>> చోట్ల అధికారులు తనిఖీ చేశారు. ఓఆర్ఆర్ పరిధిని దాటి ఈ తనిఖీలు జరిగాయి. మాంసాహార వంటకాల తయారీలో నాణ్యతలేని మాంసం వాడుతుండడం గుర్తించారు. ఎక్కడా సరైన రికార్డులు కనిపించలేదు. అంతటా అపరిశుభ్ర పరిస్థితులు కనిపించాయి. కాలం చెల్లిన ఆహార వస్తువులను వంటల తయారీకి వాడడం కనిపి ంచింది. వంటలు చేసేవారు. వడ్డించేవారు అపరిశుభ్రంగా వుండడం టిజి సేఫ్ అధికారులు గుర్తించా రు. ఈ సందర్భంగా 22 చోట్ల ఆహార శాంపుల్స్ సేకరించారు. కుళ్లిపోయిన కూరగాయలు కనిపించగా వాటిని జప్తు చేశారు. ఈ నేపథ్యంలో 23 సంస్థలకు ఆహార కల్తీకి సంబంధిం చి నోటీసులు ఇచ్చారు. మరో 23 సంస్థలకు నాణ్యత ప్రమాణాలు పాటించాలని నోటీసులు ఇచ్చారు. దీంతో పాటు సరిగ్గాలేని ఆహార వస్తువు లను అమ్ముతున్న స్టేషన్ ఘన్‌పూర్‌లోని మహేంద్ర మీల్స్, బిర్యాని, కర్రీ పాయింట్, కరీంనగర్‌లోని బావ్‌పేట్‌లో గల బాలాజి మాజిక్ మితా యి, చౌటుప్పల్‌లోని చాచ ఫ్యామిలీ దాబాలకు సంబంధించిన లైసెన్స్‌లను సస్పెండ్ చేశారు. అడ్డగోలుగా ఆహార వస్తువులను తయారు చేయ డం, అమ్మడం చేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్‌లను రద్దు చేస్తామని ఈ సందర్భంగా టిజి సేఫ్ డైరక్టర్ అవినాష్ మోహంతి తెలిపారు.

## పుతిన్- మోడీ నేడు భేటీ

>> చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కూడా భారత్‌కు వస్తున్నారు. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు వస్తున్న జిన్‌పింగ్ రెండురోజులపాటు భారత్‌లోనే ఉంటారు. ఈనెల 12,13 తేదీల్లో ఆయన భారత్‌పర్యటన ఖరారయింది. అలాగే ప్రధానిమోడీతో ఒక గంటపాటు ద్వైపాక్షిక సమావేశం కూడా జరుపుతారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అదేవిధంగా ప్రస్తుతం యుద్ధభూమిగా మారిన మధ్యప్రాచ్యదేశం ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌కూడా భారత్‌కు రానున్నారు. ఈసారి బ్రిక్స్ సమావేశాలకు భారత్ అధ్యక్షత వహిస్తుండటం అందులోనూ ఢిల్లీ వేదికకావడంతో సదస్సు భారత్‌కు ప్రతిష్టాత్మకం కానున్నది. పెజెష్కియాన్‌కూడా భారత ప్రధానితో సమావేశం అవుతారని అంచనా. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, ఇరాన్ అమెరికా యుద్ధం వంటి అంశాలు ఈ సమావేశంలోప్రస్తావనకు రావచ్చని చెపుతున్నారు. రష్యా, చైనాభారత్‌లు ఇపుడు బ్రిక్స్ సదస్సులో కీలకం అవుతున్నాయి. ఇపుడిపుడే భారత్‌చైనాలమధ్య సరిహద్దు సమస్యలు చర్చలుజరుగుతున్నందున జిన్‌పింగ్ ఫర్యటన అత్యంత కీలకంగా మారింది. అలాగే రష్యాతో భారత్‌కు దశాబ్దాలుగా స్నేహసంబంధాలు కొనసాగుతున్నాయి. మోడీ, పుతిన్ హయాంలో మరింత పటిష్టం అయ్యాయి. రష్యా భారత్‌మధ్య పలు రక్షణ ఒప్పందాలు, టెక్నాలజీ, కరెన్సీ మార్పిడికి సంబంధించిన ఒప్పందాలు జరుగుతాయి.

## కర్నూలు జిల్లాలో భూప్రకంపనలు

**ఆదోని, సెప్టెంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** కర్నూలు జిల్లా పరిధిలో గురువారం రాత్రి స్వల్ప భూకంపం సంభవించింది. జాతీయ భూకంప శాస్త్ర కేంద్రం నివేదిక ప్రకారం, రాత్రి సుమారు 7:50 గంటల సమయంలో భూమి కంపించింది.

తెలంగాణ ప్రభుత్వం
పురపాలక సంఘం కార్యాలయము నర్సంపేట, వరంగల్ జిల్లా
E.O.I (ఆసక్తి వ్యక్తీకరణ)
ఆర్.ఓ.సి.నెం.ఇ1/222/2026, తేది: 10.09.2026
నర్సంపేట మున్సిపల్ పట్టణ పరిధిలో వినాయక నిమజ్జనం కొరకు ఈ క్రింద తెలిపిన పనుల అంచనాలు తయారు చేయుటకు గాను రేట్లు అవసరం ఉన్నవి. కావున తయారుదారులు/అధీకృత డీలర్లు, సప్లైయర్లు, కాంట్రాక్టర్లు మరియు ఏజెన్సీల నుండి సీల్డ్ కొటేషన్లు కోరబడుతున్నవి. 1. లైటింగ్, 2. మైక్ అరేంజ్‌మెంట్స్ మరియు సౌండ్, 3. స్టేజీ ఏర్పాట్లు, 4. కుర్చీలు, 5. క్రేన్ మరియు ఇటాచి వెహికల్, 6. జనరేటర్ 25 కె.వి. సామర్థ్యం. పైన తెలిపిన వివరములకు రేట్ల సీల్డ్ కొటేషన్లు తేది: 16.09.2026 సా.4.00 గంటలలోపు కమిషనర్, నర్సంపేట మున్సిపాలిటీ వరంగల్ జిల్లా గారికి పంపించగలరు. (7306506961/7680096877).
సం/-. కమిషనర్, పురపాలక సంఘం, నర్సంపేట.
DIPR.NO. 9699-PP/CL/ADVT/1/2026-27 తేది: 10.09.2026

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM


తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

నిజామాబాద్
: fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-9-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 223 పేజీలు: 10+4 వెల: 6.50

భూత్పూర్ వద్ద ఘోర ప్రమాదం: 270 మేకలు, క్లీనర్ సజీవ దహనం 5
మహిళల ఆసియా కప్‌లో ఫైనల్స్‌కు భారత్ 7




## మరో పదేళ్లలో భారత్ 'స్పేస్ స్టేషన్'

2040 నాటికి చంద్రునిపైకి భారతీయుడు
సూర్యుని రహస్యాలనూ కనుగొంటున్నాం..
పారిస్ అంతర్జాతీయ అంతరిక్ష సదస్సు వర్చువల్ ప్రసంగంలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 10:** భారత్ అంతరిక్ష రంగంలో మరో కీలక మైలురాయిని చేరుకునే దిశగా అడుగులు వేస్తోందని ప్రధాని మోడీ తెలిపారు. పారిస్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ స్పేస్ సమ్మిట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మోడీ కీలక ప్రసంగం చేశారు. 2035 నాటికి భారతీయ అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకు న్నామని అలాగే 2040 నాటికి ఒక భారతీయుడిని చంద్రుడిపైకి పంపాలని లక్ష్యంగా కొనసాగుతున్నట్లు వెల్లడిం చారు. చంద్రయాన్3తో చరిత్ర సృష్టించిన భారత్ భారత అంతరిక్ష ప్రయాణంలో సాధించిన విజయాలను ప్రధాని మోడీ ప్రస్తావించారు. చంద్రయాన్3 మిషన్ ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతానికి సమీపంలో సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందన్నారు. అలాగే ఆదిత్య ఎల్1 మిషన్ ద్వారా సూర్యుడి రహస్యాలను తెలుసుకునే దిశగా కీలక పరిశోధనలు జరుగుతున్నాయని చెప్పారు. గత ఏడాది ఒక భారతీయుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించిన విషయాన్ని కూడా మోడీ గుర్తుచేశారు. భవిష్యత్ అంతరిక్ష ప్రణాళికలను వెల్లడిస్తూ మోడీ కీలక ప్రకటన చేశారు. 2035 నాటికి భారత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, 2040 నాటికి ఒక భారతీయుడిని చంద్రుడిపైకి పంపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అంతరిక్ష రంగంలో భారత్ చేపడుతున్న ప్రతి కార్యక్రమం ద్వారా లభించే

>>2

## సిఎంపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు

అసెంబ్లీ కార్యదర్శికి అందజేసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు



అసెంబ్లీ కార్యదర్శికి నోటీసు అందజేస్తున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా బిఆర్ఎస్ ఎంఎల్ఎలు సభాహక్కుల ఉల్లంఘన (ప్రివిలేజ్ మోషన్) నోటీస్ ఇచ్చారు. ఈ మేరకు గురువారం అసెంబ్లీ కార్యదర్శి తిరుపతికి ఎంఎల్ఎలు గూడెం మహిపాల్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి పిటిషన్ సమర్పించారు. సిఎం రేవంత్ రెడ్డి సంధ్యారాణి పేరిట ఉన్న నకిలీ ట్విట్టర్ అకౌంట్‌తో మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్ రావు ప్రతిష్టకు భంగం కలిగించి సభను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. శాసనసభలో ఈనెల 9న చర్చ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి అనేక సత్యదూరమైన విషయాలతో నిరాధార ఆరోపణలతో మాజీ సిఎం కెసిఆర్ ప్రతిష్టకు భంగం కలిగించడమే కాకుండా పవిత్ర శాసనసభను తప్పుదోవ పట్టించారని నోటీసులో పేర్కొన్నారు. బిఆర్ఎస్ అంతర్జాతీయ కార్యదర్శి సంధ్యారావు పేరిట ఉన్న నకిలీ ఎక్స్ ఖాతాలో కెసిఆర్ ఆదేశాలతో శుద్ధీకరణ కార్యక్రమం చేశామని ఉ పోస్ట్‌ను సిఎం రేవంత్‌రెడ్డి సభలో చదివి వినిపించారని అన్నారు. బిఆర్ఎస్‌కు లేని అంతర్జాతీయ కార్యదర్శి పోస్టు సృష్టించి సంధ్యారావు పేరిట కాంగ్రెస్ ఐటి సెల్ వంటి వార్చిన నకిలీ ఎక్స్ ఖాతాలోని పోస్టును అసెంబ్లీలో సిఎం అసెంబ్లీంలో చదివి వినిపించడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయం అని

>>2

# బిఆర్ఎస్ గ్రాఫ్ డౌన్

అసెంబ్లీ ఘటనల తర్వాత మరింత క్షీణించిన విపక్షం
సిఎల్‌పి భేటీలో ఫ్లాష్ సర్వే ఫలితాలు వెల్లడించిన ముఖ్యమంత్రి రేవంత్
22ఎపై ప్రతిపక్షం తప్పుడు ప్రచారం
దేశంలో 15 కోట్ల ఓట్లు గల్లంతు.. 'సర్'పై అప్రమత్తం: సిఎం ఆసక్తికర వ్యాఖ్యలు




గురువారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగిన సిఎల్‌పి భేటీలో మాట్లాడుతున్న సిఎం రేవంత్. చిత్రంలో డి.సిఎం భట్టి, మంత్రి ఉత్తమ్, పిసిసి చీఫ్ మహేష్ గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు10:** ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని సభను నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సభను సజావుగా జరగకుండా కుట్ర చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ భేటీలో డిప్యూటీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఇటీవల అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, ప్రతిపక్షాల వ్యవహారశైలి, ప్రభుత్వ భవిష్యత్ వ్యూహంపై కీలకంగా చర్చించారు. ఈ సందర్భంగా గత మూడు రోజులుగారాష్ట్రవ్యాప్తంగా జరిగిన పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించినట్లు చెబుతున్న ఓ ఫ్లాష్ సర్వే ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేల ముందు ప్రస్తావించారు. ఆ సర్వేలో రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకత కనిపించలేదని, బదులుగా బీఆర్ఎస్ నేతల వ్యవహారశైలినే ప్రజలు తప్పుబట్టినట్లు తేలిందని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ ఘటన తర్వాత బిఆర్ఎస్ గ్రాఫ్ చాలా పడిపోయిందని, ఈ నెల 7వ తేదీన అసెంబ్లీ గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వివాదం..

>>2

# ఉద్యోగులకు కోటి బీమా

ప్రభుత్వం, ఉద్యోగులపై భారంలేని విధానం
హెల్త్‌కార్డుల కోసం రూ.240 కోట్లు
12.91 లక్షల మందికి వర్తింపు: డి.సిఎం భట్టి



**హైదరాబాద్,సెప్టెంబరు 10,ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్లకు అందిస్తున్న రూ.కోటి బీమా పథకం దేశంలోనే తొలిసారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రకటించారు. ఉద్యోగి దురదృష్టవశాత్తూ మరణించినా అతడి కుటుంబం ఆర్థికంగా రోడ్డున పడకుండా భద్రత కల్పించాలనే మానవీయ ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా బ్యాంకుల సహకారంతో పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన సభకు చెప్పారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద బీమా, హెల్త్ కార్డుల గురించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వివరణాత్మకంగా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 16 బ్యాంకులతో ఒప్పందం చేసుకుని రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి బీమా కవరేజీ కల్పిస్తోందన్నారు. ఉద్యోగుల కోసం రూ.కోటి బీమా పథకానికి తొలుత సింగరేణి కాలరీస్‌లో శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యుత్‌శాఖ పరిధిలోని డిస్కమ్‌లు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పథకాన్ని విస్తరిస్తూ 2024 జూన్ 26న ఆర్థిక శాఖ 77వ జీవో సర్క్యులర్ జారీ చేసింది. ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.కోటి బీమాతో పాటు ఇతర ప్రయోజనాలు కలిపి రూ.1.20 కోట్ల వరకు ప్రయోజనం అందేలా చర్యలు తీసుకున్నట్లు డిప్యూటీ సిఎం చెప్పారు. విమాన ప్రయాణ సమయంలో ప్రమాదం జరిగితే రూ.2 కోట్ల వరకు బీమా ప్రయోజనం కల్పిస్తున్నట్లు వెల్లడించించారు. సహజ మరణానికి రూ.10 లక్షల వరకు ప్రయోజనం కల్పించే వెసులుబాటు కూడా ఉన్నట్లు చెప్పారు. పథకం అమలు విధానం, అర్హతలు, బీమా కవరేజీ, నిబంధనలు, షరతులను అందులో పేర్కొందని వివరించారు. రాష్ట్రంలో మొత్తం 12,91,056 మంది ఈ పథకం పరిధిలో ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. వీరిలో 5,18,293 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. ఇంకా 5,00,158 మంది తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్, మల్టీపర్పస్ వర్కర్లు, కాంట్రాక్ట్, డైలీవేజ్, ఎన్ఆర్ఈజీఎస్, ఎంటీఎస్, సెర్ప్

>>2



వాకౌట్ అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు

## కౌన్సిల్ నుంచి బిఆర్ఎస్ వాకౌట్

22ఎపై చర్చకు పట్టు
వాయిదా తీర్మానం తిరస్కరించిన చైర్మన్

**హైదరాబాద్, సెప్టెంబరు 10,ప్రభాతవార్త:** శాసనమండలిలో గురువారం బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన కొనసాగించారు. మొదట ఎమ్మెల్సీలు

>>2

# త్వరలో 6 డిఎలు

పిఆర్‌సి నివేదిక వెంటనే అందేలా చర్యలు: ఉద్యోగులకు సిఎం హామీ



**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వ ఆహ్వానం మేరకు సీఎంను కలిసి తమ సమస్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న పని ఒత్తిడిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులకు జరుగుతున్న ఆర్థిక నష్టాన్ని వివరించారు. పిఆర్‌సీ కమిటీ నివేదిక ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను కూడా జేఏసీ నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ సంఘాల నాయకులపై పెరుగుతున్న ఒత్తిడి గురించి కూడా వివరించారు. సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన సీఎం.. తాను ఎప్పుడూ ఉద్యోగుల పక్షానే ఉంటానని హామీ ఇచ్చినట్లు 'తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్'(టీఆర్ఈఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి తెలిపారు. ఆరు డీఏలపై త్వరలోనే ప్రకటన చేస్తామని సీఎం చెప్పినట్లు వారు వెల్లడించారు. పీఆర్‌సీ కమిటీ నివేదిక కూడా వెంటనే తనకు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని సీఎం స్పష్టం చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. పిఎం సానుకూలంగా స్పందించి హామీలు ఇవ్వడంపై టీఆర్ఈఎస్ఏ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని నేతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో టీఆర్ఈఎస్ఏ గౌరవాధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి ఉన్నారు.

## ధాబాలు, హోటళ్లపై టిజి సేఫ్ భారీగా దాడులు

మూడు లైసెన్స్‌లు సస్పెన్షన్

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** కల్తీ ఆహార వస్తువులపై ఉక్కుపాదం మోపేందుకు సర్కారు కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్) గురువారం నాడు రాష్ట్రంలోని పలుచోట్ల జాతీయ రహదారుల పక్కనగల దాబాలు, మిఠాయి దుకాణాలు, హాస్టళ్లు, హోటళ్లపై దాడులు నిర్వహించింది. ఈ సందర్భగా అపరిశుభ్రంగా వున్న వంటశాలలు, బొద్దింకలు, ఈగలు ముసురుతుండగా ఆహారం తయారవుతుండడాన్ని అధికారులు గుర్తించారు. మొత్తం 46

>>2




గురువారం తుక్కుగూడలో ఆందోళన చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు కెటిఆర్, హరీష్ తదితరులు

# ఆ భూములు ఎలా ఇచ్చారు?

టెస్లరాక్ట్‌కు వందల కోట్ల విలువైన భూకేటాయింపులపై బిఆర్ఎస్ తీవ్ర నిరసన
ప్రభుత్వం సమాధానం చెప్పాలన్న కెటిఆర్

**రంగారెడ్డిఅర్బన్, సెప్టెంబరు 10,ప్రభాతవార్త:** ఫోర్త్ సిటీలో టెస్సెరాక్ట్ సంస్థకు ప్రభుత్వ భూముల కేటాయింపు వ్యవహారం రాజకీయంగా వేడెక్కింది. వందల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను టెస్సెరాక్ట్ కంపెనీకి ఏ ప్రాతిపదికన కేటాయించారంటూ బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని నిలదీసింది. ఈ వ్యవహారంపై సమగ్ర వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం తుక్కుగూడలోని టెస్సెరాక్ట్ సంస్థ వద్ద బీఆర్ఎస్ నాయకులు భారీస్థాయిలో ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నేతృత్వంలో జరిగిన ఈ ఆందోళనకు రంగారెడ్డి జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ప్రభుత్వ భూముల కేటాయింపుల్లో పారదర్శకత పాటించాలని, ప్రజలకు సంబంధించిన ఆస్తులను ఏనిబంధనల ప్రకారం ప్రైవేటు సంస్థలకు కేటాయించారో

>>2



## పుతిన్- మోడీ నేడు భేటీ

బ్రిక్స్ సమ్మిట్ కోసం రేపు రానున్న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 10:** దేశరాజధానిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న బ్రిక్స్‌దేశాల సదస్సుకు అగ్రరాజ్యాల అధినేతల రాక ఖరారయింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ శుక్రవారం మధ్యాహ్నానికి దేశరాజధానికి చేరుకుంటారు. ప్రధానిమోడీతో కలిసి ద్వైపాక్షిక భేటీ జరుగుతుంది. అటుగా బ్రిక్స్‌దేశాల శిఖరాగ్రసమావేశంలో పాల్గొంటరని క్రెమ్లిన్‌ప్రకటించింది. అదేవిధంగా ఏడేళ్ల తర్వాత

>>2

వార్త

మనుషుల్ని యథాతథంగా అంగీకరించాలి. ఫలానా రకంగా ఉంటేనే అంగీకరించాలి అనేలా ఉండకూడదు.

- ఫ్రాంజ్ స్యూబర్ట్

# సన్నగిల్లుతున్న శిక్షల భయం!

కుల,మత, వర్గ, లింగ, బేధాలు లేకుండా అందరికీ సమానంగా వర్తించే విధంగా మన పెద్దలు శాసనాలను రూపొందించారు. అవి నిస్పక్షపాతంగా అమలు చేస్తారని ఆశించారు. కానీ అమలు చేయాల్సిన కొందరు అధికారులు రాజకీయ ఒత్తిడిలకు లొంగో, లేదా దక్షిణలకు ప్రలోబపడో చట్టాన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటారని రాజ్యాంగ నిర్మాతలు ఊహించలేకపోయారేమోననిపిస్తున్నది. ఫలితంగా వందలాది కరుడుగట్టిన నేరస్తులు ప్రజలను వంచించి కోట్లాది రూపాయలు దోచుకుంటూ తప్పించుకోగలుగుతున్నారు. ప్రధానంగా వైట్ కాలర్ నేరాలు అంతకంతకు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. సమర్థవంతంగా దర్యాప్తు జరిపి పటిష్టంగా రికార్డులు తయారు చేసి అవసరమైన సాక్ష్యాలను కోర్టు ముందు నిలబెట్టి నేరాలను రుజువు చేయడంలో విఫలమవుతున్నారు. కొన్నిసార్లు పరిస్థితుల ప్రభావం వల్ల దర్యాప్తు సక్రమంగా ముందుకు నడవకపోతే మరికొన్ని సందర్భాల్లో అధికారులే కేసులు వీగిపోయేలా రికార్డులు తయారు చేస్తున్నారనే ఆరోపణలు ఎంతోకాలంగా వినిపిస్తున్నాయి. అయితే గతంలో కంటే ఇప్పుడు పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షల శాతం కొంత పెరిగినా లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. ఇంకొన్ని సందర్భాల్లో అధికారులు సకల అవస్థలుపడి కోర్టులముందురుజువుకు సర్వం సిద్ధం చేసినప్పుడు కొందరు రాజకీయ నేతలే మోకాలొడ్డుతుండడంతో దర్యాప్తు చేసే అధికారుల్లో నిస్పృహ పెంచుతుంది. దీంతోపాటు ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా తయారు చేసిన సిఆర్‌పిసి, ఐపిసి నిబంధనలు కాలానుగుణంగా సవరించాలనే పోలీసు అధికారుల వాదన కూడా సమంజసమే. కేంద్రప్రభుత్వం ఇటీవల కొన్ని సంస్కరణలు చేసింది. మరికొన్నింటిని ప్రవేశపెట్టేందుకు సిద్ధం చేస్తున్నది. అయితే ఆ విషయాన్ని అలా ఉంచితే ఉన్న నిబంధనలను, చట్టాలను ఏ మేరకు నిస్పక్షపాతంగా అమలు చేస్తున్నారన్నదే ప్రశ్న. ధనిక, పేద అని తేడాలు లేకుండా ఎంత చిత్తశుద్ధితో వ్యవహరించగలుగుతున్నారనేదే ముఖ్యం. ఏ అండలేని నిరుపేదలు పోలీసుస్టేషన్‌కు వస్తే ఎలా వ్యవహరిస్తున్నారో ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరం లేదు. దేశంలో బోగస్ ఫైనాన్స్ కంపెనీలు పెట్టి కోట్లాది మంది అమాయకుల కష్టార్జితాన్ని కోట్లల్లో కొల్లగొట్టి బోర్డులు తిప్పేస్తే జీవితకాలం సంపాదించుకున్న డబ్బు పోగొట్టుకొని న్యాయం చేసేవారు లేక బాధితుల వేదన అరణ్యరోదనగా మారి కొందరు ఆత్మహత్య చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో గత పదేళ్లలో దాదాపు యాభై, అరవై కోట్ల రూపాయలకుపైగాఫైనాన్స్ కంపెనీలు ప్రజలను మోసం చేసి దోచుకున్నట్లు అనధికార లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఇందులో కొన్ని మాత్రమే పోలీసుల దృష్టికి వస్తున్నాయి. రికవరీ మాట ఎలా ఉన్నా నిందితుల్లో పది శాతం మందిపైకూడాపటిష్టమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇరవైఐదు లక్షలు మొదలు రెండువందల యాభై కోట్లవరకు మోసం చేసిన ఫైనాన్స్ కంపెనీలు యజమానులపై చర్యలుతీసుకోవడం లో నిందితులను పట్టుకొని బాధితులకు న్యాయం చేయడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలను కొట్టివేయలేం. రోజురోజుకు గ్రామస్థాయిలో కూడా చీటీలు పెట్టడం, కోట్లాది రూపాయలు కూడబెట్టుకొని తెల్లవారేసరికి బోర్డులు తిప్పేస్తున్నారు. ఇక ఇళ్లస్థలాలు, అపార్ట్‌మెంట్ల అమ్మకాల్లో ఘరానా మోసం చేసిన పెద్దలెందరో నిర్భయంగా తిరుగుతున్నారు. అందుకే ఒకరిని చూసి ఒకరు పోటీ పడి ప్రజలను మోసం చేసి కోటీశ్వరులు అవుతున్నారు. ఈ విషయంలో బాధితులు కొందరు పోలీసు స్టేషన్‌కు వెళ్లితే న్యాయం సంగతి ఎలాఉన్నా కేసు నమోదు చేసుకోవడానికి ఇష్టపడడం లేదు. మమ్మల్ని అడిగి ఇచ్చావా? ఇచ్చేటప్పుడు తెలివి లేదా? లాభం వస్తే మా వద్దకు వచ్చేవాడివా?అంటూ మళ్లీ పోలీసుస్టేషన్ మెట్లెక్కకుండా చేసి పంపుతున్నారు. అంతేకాదు కొన్ని సందర్భాల్లో ఇది పూర్తిగా సివిల్ తగాదా అని జోక్యం చేసుకోవడానికి వీల్లేదని కోర్టుకువెళ్లి కేసులుపెట్టి వసూలు చేసుకోమనిసలహా ఇస్తున్నారు. ఒకవేళ ఏదైనా కారణాలతో కేసు నమోదు చేయాల్సి వస్తే సాక్ష్యాధారాలున్నాయా? లేవా? రికార్డులు, రసీదులు అన్నీ పరిశీలించి సంతృప్తి చెందితేనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. ఇలాంటి ఫిర్యాదులన్నీ నమోదు చేస్తే పోలీసులు వేరే పని చేయలేరనే వాదనను తోసిపుచ్చలేం. పెరిగిన నేరాలతోపాటు పోలీసుల బాధ్యతలు కూడా పెరిగిపోయాయనడంలో సందేహం లేదు. ముఖ్యంగా విఐపిల బందోబస్తులో ఎక్కువ సమయం గడుపుతున్నారు. ఆయా ప్రాంతాల్లో దోపిడీలు జరుగుతున్నా, అరాచక శక్తులు విజృంభించడంతో శాంతి భద్రతలు క్షీణించినా పర్వాలేదు కానీ, ఒక్క విఐపి పర్యటనలో ఏమాత్రం పొరపాటు జరిగినా తమ ఉద్యోగానికి ముప్పు తప్పదన్న భావనతో ప్రజాసమస్యలను విస్మరించి నేతల వైపు మొగ్గుచూపుతున్నారు. అందుకే సాధ్యమైనంతవరకు ఇలాంటి ఫిర్యాదులను నమోదు చేసుకోవడానికి ఇష్టపడడంలేదు. నేరగాళ్లలో పోలీసులన్న భయభక్తులు సన్నగిల్లిపోతున్నాయి. నిరుద్యోగులను మోసం చేసే దళారులు ఎక్కువైపోతున్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షలాది రూపాయలు వసూలు చేసుకుంటూ పరారు అవుతున్న దగాకోరులు పెరిగిపోతున్నారు. మానవజాతికి ముప్పుగా పరిణమిస్తున్న మాదకద్రవ్యాల వ్యాపారం,వినియోగం కేసుల్లో అధికశాతం వీగిపోయి నిందితులుబయటపడి మళ్లీ మళ్లీ అదే వ్యాపారంలో కొనసాగుతున్నారు. ఒకటని కాదు ఎన్నో నేరాలకు సంబంధించిన కేసుల్లో వీగిపోవడానికి కారణాలేమిటో, కారకులెవరో సమగ్రంగా పరిశీలించి నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలి.

ప్రపంచం మొత్తం మన నుండి తొలగినప్పుడు, మన ప్రపంచంలోకి అడుగుపెట్టినవాడే నిజమైన మిత్రుడు.



నేతాజి

గొప్ప మేధ నలుగురు నడచిన దారిలో నడవదు. అది ఇంతవరకూ ఆవిష్కరించని మార్గాలను అన్వేషిస్తుంది.



అబ్రహాంలింకన్

## ప్రజావాక్కు



### హక్కుల రక్షణతోనే ఆదివాసీల అభివృద్ధి

**భారత** రాజ్యాంగం పూచీపడిన మేరకు ఆదివాసీలకు ప్రత్యేక రక్షణలు, హక్కులు చట్టాల రూపంలో అమలౌతున్నాయి.వాటి అమలుపై ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం ద్వారానే వారి ప్రగతి సాధ్యం. అయితే ఆ చట్టాల స్ఫూర్తి ఏమిటన్నది చూడాల్సిన ప్రభుత్వం, బదులుగా అందులో తనబాధ్యత తప్పించుకోగల మార్గాలేమిటన్నవి వెతుకుతూ ఉంటే మాత్రం కష్టం. దేశంలో ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు మందగించడానికి ఏకైక కారణం అక్కడి చట్టాలే అని ఒక దురభిప్రాయం. అటవీ హక్కుల చట్టం నిబంధనల మేరకు ఒక ప్రాజెక్ట్ కోసం భూమిని సేకరించాల్సి వస్తే, ఆ ప్రాజెక్ట్ పరిధిలోని అన్ని గ్రామాలగ్రామసభలూ అంగీకరించాలి.ఈమధ్య పార్లమెంటరీ కమిటీ ఒకసూచన చేసింది.అలాంటి స్థితిలో వందకి 75శాతం గ్రామసభలు సరేనంటేసరిపోతుంది. అందరూ అక్కర్లేదని. ఈ విషయమై కేంద్ర గిరిజన శాఖని కేంద్ర విద్యుత్‌శాఖ వివరణ కోరగా గ్రామసభల నుండి నిరభ్యంతర పత్రాలు తీసుకోవాలనే ఎలాంటి నిబంధనా లేదు.

- డా.డి.వి.జి.శంకరరావు, విజయనగరం

### ఏసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పిచ్చి ఆలోచన

ఈ రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు గారు కోనసీమ సభలో మాట్లాడుతూ మహిళలకు ఏసీ బస్సులలో ఉచిత ప్రయాణం' అన్నారు.. ఎవరి సొమ్ము...అసలు మహిళలకు ఫ్రీ బస్ కాకుండా ఛార్జీలో 50శాతం రాయితీ ఇస్తే బాగుండేది. అవసరం ఉన్నవాళ్లు ప్రయాణం చేస్తారు. ఇప్పుడు నేరుగా ఏసీ బస్సులు? పిచ్చి ఆలోచన. ఫ్రీ బస్సువలన పనిలేకపోయినా మహిళలు ప్రయాణం చేస్తున్నారు. ఇదంతా ఎవరు భరించాలి?పైగా ఏసీ బస్సులా! గతంలో లాగాపురుషులు బస్సులు ఎక్కలేకపోతున్నారు. పల్లె వెలుగు బస్సులు వేకుజమున నాలుగు గంటలకే ఫుల్ రష్ అవుతున్నాయి. సూపర్ లగ్జరీ బస్సులో పోవాలంటే చాలా ఎక్కువ ఛార్జీ.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఆడంబరాలకు పోవద్దు

**మధ్యతరగతి** జీవితంలో ఒక్కొక్కసారి విపత్కర పరిస్థితులు ఎదురుకావచ్చు.జీవితంలో పక్కవాళ్లతో పోల్చుకొని ఆడంబరాలకు పోవద్దు. వాళ్లఆర్థిక పరిస్థితుల ఆధారంగా వాళ్ళు జీవించవచ్చు. మన ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా మనం ముందుకుసాగాలి కాని ఆడంబరాలకు పోవద్దు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం అవసరం

**భారత** అంతరిక్ష రంగంవేగంగా కొత్తదశలోకి అడుగుపెడుతోంది. ప్రైవేటు రంగానికి మరిన్ని అవకాశాలు కల్పించడం ద్వారా పెట్టుబడులు, సాంకేతిక ఆవిష్కరణలు, పరిశోధన, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశంఉంది.అయితే ఈ మార్పు దేశ అంతరిక్ష కార్యక్రమాన్ని దశాబ్దాలుగా నిర్మించిన శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సిబ్బందిలో అనిశ్చితికి దారితీయకుండా స్పష్టమైన విధాన సమాచారంతో ముందుకు సాగాలి.భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ సాధించిన విజయాల వెనుక దశాబ్దాల ప్రజాపెట్టుబడి,శాస్త్రీయనైపుణ్యం,సంస్థాగత అనుభవం ఉన్నాయి. అందువల్ల ప్రైవేటు రంగం విస్తరణను ప్రభుత్వ రంగానికి ప్రత్యామ్నాయంగా కాకుండా,దేశఅంతరిక్ష సామర్థ్యాన్ని విస్తరించే భాగస్వామ్యంగా చూడాలి. ప్రైవేటు సంస్థల ప్రవేశంతో ప్రయోగ వాహనాల తయారీ,ఉపగ్రహ నిర్మాణం, అంతరిక్ష ఆధారిత సేవలు వంటి రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడవచ్చు. అయితే సంస్థ భవిష్యత్ బాధ్యతలు, ప్రభుత్వ రంగ సంస్థల పాత్ర, ప్రైవేటు సంస్థలతో బాధ్యతల విభజన, ఉద్యోగుల భవిష్యత్ అవకాశాలపై స్పష్టత అవసరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### నిజమైన పూజ

మనలోని అహంకారం, కోపం, అసూయవంటి చెడు గుణాలను దేవుని పాదాల చెంత వదిలేసి,నిర్మలమైన మనస్సుతో ఉండటమే నిజమైనభక్తి. పూజచేయడం ద్వారా మన మనస్సు చెల్లాచెదురు కాకుండా ఒకే అంశంపై లగ్నం అవుతుంది. ఇది మానసిక ప్రశాంతతను, క్రమశిక్షణను పెంచుతుంది. కేవలం దేవుడి ముందు కూర్చుంటేనే పూజకాదు. ఎదుటి వారిని గౌరవించడం, మూగజీవుల పట్ల దయచూపడం, ప్రకృతిని కాపాడటం కూడా పూజతో సమానమే!అలా కాకుండా మన సంతా విషం నింపుకొని ఎన్నిపూజలు చేసినా వృధానే. భగవంతుడిని హృదయంలో నింపుకొని పూజించాలి. అంతేకాని తమ కోరికలు నెరవేరాలని ఆడంబరం చేయకూడదు.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

### కొత్త మార్కెట్ల వైపుగా అడుగులు వేయాలి

సెప్టెంబర్ రెండోవారంలో ఢిల్లీలో జరగబోయే సదస్సు పలు విధాలుగా ప్రత్యేకమైంది. మనకున్న భౌగోళిక ప్రాధాన్యత, వ్యూహాత్మక పరిణామాలవల్ల భారత్ విదేశాంగ విధానం అవలంబిస్తుంది.అలాగే ఫ్రీ ట్రేడ్‌దిశగా అన్ని దేశాలతో సాయోధ్య కుదిరేలా చూడాలి. బ్రిక్స్ విస్తరణ దిశలో ఉన్న నేపథ్యంలో చిన్న దేశాలు లేక ఆఫ్రికా దేశాలకు మన నిపుణులను పంపి కొత్త మార్కెట్స్ వైపుగా అడుగులు వేయాలి.

- భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# చుట్టూ పర్యావరణ దీపాలు వెలిగిద్దాం

**వాతావరణ మార్పులు పెనుభూతమై ప్రపంచాన్ని వణికిస్తున్న నేటి తరుణంలో అడవుల సంరక్షణ మానవ మనుగడకు జీవన్మరణ సమస్యగా మారింది. అడవిని కాపాడటం అనేది అటవీశాఖ అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ఈ నేలపై జన్మించిన ప్రతి పౌరుడి పవిత్ర ధర్మమని సమాజం గుర్తించాలి. మన ఇంటి ప్రాంగణంలో నాటే ప్రతి మొక్క, కాపాడే ప్రతి వృక్షం, నిలిపే ప్రతి నీటిబొట్టు ప్రకృతి సమ తుల్యతకు తోడ్పడతాయి. అమృతాదేవి, 363 మంది బిష్ణోయీ వీరులు తమప్రాణాలను పణంగా పెట్టి వెలిగించిన పర్యావరణ దీపం తరతరాల గుండెల్లో నిరంతరం ప్రజ్వరిల్లాలి.**



రామ కిష్టయ్య సంగన భట్ల

వృక్షో రక్షతి రక్షితః' అన్నది కేవలం ఒక సూక్తి కాదు మానవాళి మనుగడకు ప్రాణాధారమైన పర్యావరణ వేదవాక్యం. మన సంస్కృతిలో చెట్టు ఒక దేవత, అడవి ఒక జీవధాత్రి, ప్రకృతి ఒక పరమేశ్వరుడి ప్రతిరూపం.అరణ్యాలు లేనిదేమానవ జాతికి ఉనికి లేదు. భారతదేశం ప్రకృతి ప్రసాదించిన అపారమైన అరణ్య సంపదతో, అనన్యమైన జీవ వైవిధ్యంతో, సహ్యాద్రి, వింధ్య, హిమాలయ పర్వత సానువుల నుంచి నదీ పరీవాహక ప్రాంతాల వరకు పచ్చని చీర కట్టిన పుణ్యభూమిగా ప్రపంచ పటంలో విలసిల్లుతోంది. అడవి అంటే కేవలం నిశ్శబ్దంగా నిలబడే వృక్షాల సముదాయం మాత్రమే కాదు, సమస్త ప్రాణికోటికి ప్రాణవాయువును అందించే ఊపిరితిత్తులు, నేలకు జీవం పోసి ఎడారీకరణను నిలువరించే రక్షాకవచం, నదీనదాలకు జన్మనిచ్చే జలభాండాగారం, కోట్ల సంఖ్యలోని జీవరాశులకు మాతృ సమానమైన ఆశ్రయం. అలాంటి ప్రకృతి వరప్రసాదాన్ని, అపురూపమైన వన్యప్రాణులను, అమూల్యమైన అటవీ సంపదను కాపాడే పవిత్ర యజ్ఞంలో తమ రక్తమాంసాలను ధారపోసి, ప్రాణాలనే మూల్యంగా చెల్లించిన అటవీయోధుల నిరుపమాన త్యాగాలను స్మరించుకునే మహత్తర సందర్భమే సెప్టెంబర్ 11న దేశమంతటా అత్యంత భక్తిప్రపత్తులతో నిర్వహించుకునే జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం. ఈ దినోత్సవం వెనుక ఉన్ననేపథ్యం సాధారణమైనదికాదు, అది మనిషికి, ప్రకృతికి మధ్య గల విడదీయరాని ఆత్మీయ బంధాన్ని లోకానికి చాటిచెప్పిన రక్తతర్పణ గాథ. దాదాపు మూడు శతాబ్దాల క్రితం, 1730 సెప్టెంబర్ 11న రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ సమీపానగల ఖేజర్లీ అనే పల్లెసీమలో జరిగిన మహోజ్వల ఘట్టం భారత పర్యావరణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడింది. అప్పటి మార్వార్ సంస్థాన పాలకుడు మహారాజా అభయ్‌సింగ్ తన నూతన రాజప్రాసాద నిర్మాణంలో సున్నం కాల్చడానికి కలప అవసరమై, సైనికులను పచ్చని చెట్లను నరికి తీసుకురమ్మని ఆదేశించాడు. సైనికుల గొడ్డళ్లు ఖేజర్లీ గ్రామంలోని పవిత్రమైన ఖేజ్రీ (జమ్మి) చెట్లవైపు దూసుకొచ్చాయి. ప్రకృతిని ప్రాణసమానంగా ఆరాధించే బిష్ణోయీ సమాజానికి ఆ చెట్లను నరకడం దేవాలయ విధ్వంసంతో సమానం. ఆ విషమ ఘడియల్లో అమృతాదేవి అనే సాహస వనిత శిరస్సు తెగిపడినా సరే, ఒక్క చెట్టు ప్రాణమైనా దక్కితే అది చౌకైన బేరమే" (సిర్ సాంటే రూఖ్ రహేతో భీ సస్తో జాణ్) అంటూ గొడ్డలి వేటుకు ఎదురొడ్డి వృక్షాన్ని తన గుండెలకు హత్తుకుంది. క్రూరమైన సైనికుల గొడ్డలి ఆమె ప్రాణాలను బలిగొన్నప్పటికీ, ఆ త్యాగజ్వాల చల్లారలేదు. ఆమె వెంటే ఆమె ముగ్గురు కుమార్తెలు, వారిని చూసి గ్రామానికి చెందిన బిష్ణోయీ వీరులు ఒక్కొక్కరుగా పచ్చని చెట్లను తమ శరీరాలతో కౌగిలించుకుని రక్షణ కవచాలుగా నిలిచారు. అలా 363 మంది అమాయక అమరజీవులు మూగచెట్ల పరిరక్షణ కోసం తమ నిండు ప్రాణాలను నవ్వుతూ తృణప్రాయంగా అర్పించారు. ఒక చెట్టు కోసం వందలాది మానవ దేహాలు నేలకొరిగిన ఈ అపూర్వ త్యాగమే తర్వాతి కాలంలో సుందర్‌లాల్ బహుగుణ, చండీప్రసాద్ భట్ వంటి మహనీయుల నేతృత్వంలో సాగిన ప్రఖ్యాత చిప్కో ఉద్యమానికి మూలస్తంభంగా, అంతర్జాతీయ పర్యావరణ పోరాటాలకు ఆద్యంగా నిలిచింది. ఖేజర్లీ వీరుల బలిదానానికి గుర్తుగా సెప్టెంబర్



11ను జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవంగా అధికారికంగా పరిగణించడం వెనుక సరైన చారిత్రక స్పష్టత అవసరం. చాలాచోట్ల ఈ దినోత్సవాన్ని కేంద్రప్రభుత్వం 2001 నుంచే అమలులోకి తెచ్చిందన్న ప్రచారం ఉన్నప్పటికీ, భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ,వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ 2013 మే 7న జారీ చేసిన అధికారికగెజిట్ నోటిఫికేషన్ ద్వారానే సెప్టెంబర్ 11ను జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవంగా అధికారికంగా ప్రకటిస్తూ ఉత్తర్వు ఇచ్చింది. దేశవ్యాప్తంగా దుర్భరమైన అటవీ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ కలప దొంగలు, స్మగ్లర్లు, వేటగాళ్లు, నక్సలైట్లు, అడవి జంతువుల దాడుల్లో ప్రాణాలు కోల్పోతున్న అటవీ సిబ్బందికి జాతీయ స్థాయిలో అత్యున్నత గౌరవం కల్పించాలనే సమున్నత లక్ష్యంతో ఈనిర్ణయం తీసుకున్నారు. డెహ్రాడూన్‌లోని ప్రఖ్యాత అటవీ పరిశోధనా సంస్థ (ఎఫ్.ఆర్.ఐ) ప్రాంగణంలోని ఫారెస్టర్ మెమోరియల్ వద్ద ప్రతి ఏటా అమరవీరుల శిలాఫలకం ముందు రక్షణ దళాల మాదిరిగానే గాల్లోకి కాల్పులుజరిపి గౌరవ వందనంసమర్పించడం ఒక పవిత్ర సంప్రదాయంగా వస్తోంది. సరిహద్దుల్లో శత్రువుల నుంచి దేశాన్ని కాపాడే సైనికుడి త్యాగం ఎంతటి పవిత్రమైనదో, దేశ అంతర్గత సహజ సంపదను, భవిష్యత్ తరాల ప్రాణవాయువును కాపాడేందుకు రాత్రింబవళ్లుశ్రమించే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు, రేంజర్లు,వాచర్లు చేసే ప్రాణార్పణ కూడా అంతే దేశభక్తి పూరితమైనది. నిప్పులు చెరిగే దావానలాలు, విషసర్పాలు, క్రూరమృగాలు, ఏకే 47 తుపాకులతో తిరిగే ఎర్రచందనం, టేకు స్మగ్లర్ల వంటి ముఠాలను కనీస ఆయుధాలు లేకుండానే ఒట్టి చేతులతో, లాఠీలతో ఎదుర్కొంటూ విధి నిర్వహణలో నెత్తురు చిందిస్తున్న అటవీ అమరుల త్యాగనిరతి అసాధారణమైనది.ప్రస్తుత ఆధునిక యుగంలో పర్యావరణ సంక్షోభం తీవ్రతరమవుతున్న వేళ అటవీ విస్తీర్ణ గణాంకాలను నిశితంగా విశ్లేషించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. భారత అటవీ సర్వే సంస్థ విడుదల చేసిన భారత అటవీ స్థితి నివేదిక 2023 ప్రకారం దేశంలో మొత్తం అటవీ కవచం,వృక్ష కవచం కలిపి దేశ భౌగోళిక విస్తీర్ణంలో 24శాతానికి పైగా నమోదైంది. ఇందులో కేవలం అటవీ కవచం సుమారు 21.76 శాతంగా విస్తరించి ఉండగా, చెట్ల కవచం మిగిలిన భాగాన్ని ఆక్రమిస్తోంది.గత నివేదికలతో పోల్చినప్పుడు దేశవ్యాప్తంగా అటవీ కవచంలో 156.41 చదరపు కిలోమీటర్లు, వృక్ష కవచంలో 1,289.40 చదరపు కిలోమీటర్ల మేర వృద్ధి నమోదై, మొత్తంగా 1,445.81 చదరపు కిలోమీటర్ల పెరుగుదల కనిపించినట్లు కేంద్ర నివేదికలు స్పష్టంచేస్తున్నాయి.అయితేజాతీయ అటవీ విధానం నిర్దేశించిన 33శాతం లక్ష్యాన్ని చేరుకోవడానికి మనం ఇంకా ఎంతో దూరం ప్రయాణించాల్సి ఉంది. కేవలం లెక్కల్లో విస్తీర్ణం పెరిగినంత మాత్రాన సంబరపడిపోతే సరిపోదు. ఆ పెరుగుదల పచ్చని సాంఘిక అడవుల రూపంలోనో లేదా వాణిజ్య తోటల రూపంలోనో కాకుండా, సహజ సిద్ధమైన దట్టమైన అరణ్యాల రూపంలోవిస్తరిస్తోందా లేదా అన్నదే ప్రాథమిక ప్రశ్న. సహజ అరణ్యాల్లో విలసిల్లే వృక్ష, లతా,గుల్మ, పక్షి, జంతు, కీటక జాలాల సమతుల్యత ఏకజాతి వృక్ష పెంపకాల్లో లభించదు. స్థానిక వృక్షజాతులను రక్షిస్తూ, అడవుల క్షీణతను అరికట్టి, అటవీ కారిడార్లను పునరుద్ధరించినప్పుడే నిజమైన పర్యావరణ భద్రతసాధ్యమవుతుంది. వాతావరణ మార్పులు పెనుభూతమై ప్రపంచాన్ని వణికిస్తున్న నేటి తరుణంలో అడవుల సంరక్షణ మానవ మనుగడకు జీవన్మరణ సమస్యగా మారింది.అడవిని కాపాడటం అనేది అటవీశాఖ అధికారుల బాధ్యత మాత్రమేకాదని, ఈ నేలపై జన్మించిన ప్రతి పౌరుడి పవిత్ర ధర్మమని సమాజం గుర్తించాలి. మనఇంటి ప్రాంగణంలో నాటే ప్రతిమొక్క, కాపాడే ప్రతి వృక్షం, నిలిపే ప్రతి నీటిబొట్టు ప్రకృతి సమతుల్యతకు తోడ్పడతాయి. అమృతాదేవి,363మందిబిష్ణోయీ వీరులు తమప్రాణాలను పణంగా పెట్టి వెలిగించిన పర్యావరణ దీపం తరతరాలగుండెల్లో నిరంతరం ప్రజ్వరిల్లాలి. •

# ప్రభుత్వ బడుల్లో ప్రమాణాలు పెరగాలి

డాక్టర్ మోటె చిరంజీవి

ప్రభుత్వ పాఠశాలలు పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాల్సిన ప్రధాన వేదికలు. కానీ నేడు అనేక ప్రభుత్వ బడులలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో వెలవెలబోతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఒకవైపు పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, మరోవైపు ఉపాధ్యాయుల కొరత, ఇంకోవైపు ప్రైవేటు విద్యాసంస్థల ఆకర్షణ ఇవన్నీ ప్రభుత్వ విద్యావ్యవస్థకు సవాళ్లుగా మారాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోవడం ఆందోళన కలిగించే పరిణామం. కొన్ని చోట్ల తరగతి గదులు ఉన్నా విద్యార్థులు కనిపించని పరిస్థితి ఏర్పడుతోంది. పాఠశాలల్లో చేరికలు తగ్గడానికి కేవలం తల్లిదండ్రుల ప్రైవేటు విద్యపై మోజును కారణంగా చూపడం సరైంది కాదు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన బోధన, ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ విద్య, పరిశుభ్రమైన వాతావరణం, తాగునీరు, మరుగుదొడ్లు, క్రీడా సదుపాయాలు వంటి అంశాలపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ వాటి అమలులో వేగం, నాణ్యత కీలకం. పాఠశాల భవనాలు నిర్మించడం ఒక్కటే సరిపోదు. ప్రతి బడిలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల పరిస్థితిని అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలి.పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడటం అత్యంత ప్రాధాన్యమైన అంశం.




విద్యార్థుల సంఖ్య తగ్గుతున్న పాఠశాలలను మూసివేయడం లేదా విలీనం చేయడం మాత్రమే పరిష్కారం కాదు. ఎందుకు విద్యార్థులు తగ్గుతున్నారు అనే ప్రశ్నకు సమాధానం వెతకాలి. పాఠశాలపై తల్లిదండ్రులకు విశ్వాసం కల్పించాలి. స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రుల కమిటీలు,ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేయాలి. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన కేంద్ర విద్యాశాఖ ఏకీకృత జిల్లా విద్యా సమాచార వ్యవస్థ ప్లస్ గణాంకాల ప్రకారం తెలంగాణలో 2,081 ప్రభుత్వ పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ నమోదైంది. దేశవ్యాప్తంగా 5,149 ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా లేకపోగా,వాటిలో సుమారు 40 శాతం తెలంగాణలోనే ఉన్నాయి. నల్లగొండలో 315, మహబూబాబాద్‌లో 167, వరంగల్‌లో 135,రంగారెడ్డిలో 99,సూర్యాపేటలో 94,సిద్దిపేటలో 84,నాగర్‌కర్నూల్‌లో 81,ఇలా తెలంగాణలో జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలు 2,081వున్నాయి. ప్రభుత్వ విద్య బలపడితేనే సామాజిక సమానత్వం సాధ్యమవుతుంది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు ప్రైవేటు విద్య భారంగా మారకుండా ప్రభుత్వ బడులే నాణ్యమైన ప్రత్యామ్నాయంగా నిలవాలి. అందుకు 'బడికి విద్యార్థి రావాలి'అనే లక్ష్యంతోపాటుబడిపై తల్లిదండ్రులకు నమ్మకం రావాలి'అనేదిశలో ప్రభుత్వంచర్యలు చేపట్టాలి.ప్రభుత్వ పాఠశాల అనేది కేవలం ఒకభవనం కాదు,అదిసమాజ భవిష్యత్తును నిర్మించే పునాది.ఆ పునాది బలహీనపడితే దాని ప్రభావం రేపటి తరాలపైపడుతుంది. కాబట్టి సర్కారుబడులు విద్యార్థులతో కళకళలాడేలా చేయడం ప్రభుత్వంతో పాటు సమాజం మొత్తం బాధ్యత. •

# బొగ్గు గ్యాసిఫికేషన్‌పై రైతుల అభ్యంతరాలు



రుద్రరాజు శ్రీనివాసరాజు

చింతలపూడి-రేచర్ల ప్రాంతంలో భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుపై ఇప్పుడు జరుగుతున్న చర్చ కేవలం ఒక పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన విషయం కాదు. ఇది ఒక ప్రాంత భవిష్యత్తును నిర్ణయించే అంశంగా మారింది. ఒకవైపు దేశానికి ఇంధన భద్రత, పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవసరం. మరోవైపు తరతరాలుగా భూమిని నమ్ముకుని జీవిస్తున్న రైతులు, వారి భూముల్లో సాగవుతున్న పామ్ ఆయిల్ తోటలు, వాటిపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది కార్మికులు, వ్యవసాయానికి ప్రాణాధారమైన భూగర్భ జలాలు ఉన్నాయి.ఈ నేపథ్యంలో రైతులు అధికారుల అవగాహన సదస్సులో వ్యక్తం చేస్తున్న ప్రధాన అభ్యంతరాలను నిర్లక్ష్యం చేయడం సరికాదు. ఈ విషయంలో రైతుల ప్రశ్నలు చాలా సూటిగా ఉన్నాయి. మా భూముల్లో ప్రయోగం చేయడానికి ముందు, ప్రభుత్వానికి చెందిన భూముల్లో ప్రయోగాత్మకంగా గ్యాసిఫికేషన్ చేసి చూపండి. దాని వల్ల పర్యావరణానికి, భూగర్భ జలాలకు, జీవ వైవిధ్యానికి హాని లేదని నిరూపించండి. ఆ తర్వాత మా భూముల గురించి మాట్లాడమని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇది అభివృద్ధిని పూర్తిగా తిరస్కరించే డిమాండ్‌గా చూడాలా? లేక శాస్త్రీయంగా పరీక్షించదగిన, ప్రజల భయాలను నివృత్తి చేసే సహేతుకమైన సూచనగా చూడాలా? ఈ రెండింటిలో ఒక విషయం మాత్రం స్పష్టంగా ఉండాలి.ఈ ప్రాజెక్టును కేవలం ఒక ఊహగా కాకుండా, వాస్తవ విధాన ప్రక్రియలోకి వచ్చిన ప్రాజెక్టుగా చూడాలి. అయితే ఇప్పుడు అసలు చర్చ అనేది ప్రాజెక్టు ఉండాలా? వద్దా? అనే దానికంటే,'ప్రాజెక్టును ఎలా అమలు చేయాలి? ఎవరి భద్రతకు ఏ హామీలు ఉండాలి? ప్రమాదాలను ముందుగానే ఎలా నిరూపణాత్మకంగా పరీక్షించాలి?' అనే దిశగా సాగాలి.ఈ ప్రాజెక్ట్ ద్వారా భూమిని కోల్పోయే రైతుకు ఇచ్చే నష్టపరిహారం కేవలం భూమి మార్కెట్ విలువతో ముగిసిపోదు.ఒక రైతుకు భూమి అంటే ఆస్తి, ఉపాధి, కుటుంబ తరాలకు వారసత్వం, సామాజిక గుర్తింపుగా చూడాలి. ప్రత్యేకించి చింతలపూడి రేచర్ల ప్రాంతంలో పామ్ ఆయిల్ వంటి దీర్ఘకాలిక పంటల సాగు ఎక్కువగా ఉండటం వలన ఈ సమస్య మరింత సంక్లిష్టమవుతుంది. ఒక పామ్ ఆయిల్ తోటను తొలగించి, రైతుకు నగదు పరిహారం ఇచ్చి, మరో చోట భూమి కొనుగోలు చేసుకోండి అని చెప్పడంకూడా అంత సులభంకాదు. మరోచోట అదే పరిమాణంలో, అదే నాణ్యత కలిగిన, నీటి వసతిఉన్న భూమి దొరుకుతుందనే నమ్మకం లేదు. అది దొరికినా అదే సామాజిక వాతావరణం, అదే మార్కెట్, అదే రవాణా సౌకర్యం, అదే జీవన విధానం లభిస్తాయనే గ్యారంటీ లేదు. ఇవన్నీ పరిహారంలో లెక్కించాల్సిన అంశాలే. దీనితోపాటు ఈ ప్రాజెక్ట్ వలన రైతులు మాత్రమే కాదు రైతు కూలీలు రవాణా కార్మికులు, చిన్న వ్యాపారులు, ఎరువులు, పురుగుమందుల వ్యాపారులు, వ్యవసాయ యంత్రాల నిర్వాహకులు కూడా బాధితులు కావచ్చు.



అందువల్ల రైతుల భూమి స్వాధీనం ప్రభావం, భూమి యజమానుల సంఖ్యతో లెక్కించడం ఖచ్చితంగా తప్పే అవుతుంది. ఈ ప్రాజెక్ట్ వలన ప్రభావిత కుటుంబాల సంఖ్య కంటే చాలా ఎక్కువగానే ఉండవచ్చు. 'రైతులు ఈ ప్రాజెక్టు ఎప్పటికీ వద్దు'అనడం లేదు.ప్రభుత్వ భూమిలో ముందుగా ప్రయోగం చేయండి' అనే డిమాండ్‌లోని శాస్త్రీయతతో కూడిన డిమాండ్ చేస్తున్నారు. ప్రపంచంలోని యూ.సీ.జీ చరిత్రను పరిశీలిస్తే చిన్నస్థాయిప్రయోగాలు, పైలట్ మాడ్యూల్స్ ద్వారా సాంకేతికతను పరీక్షించిన ఉదాహరణలు కూడా లేకపోలేదు. ఒక సమీక్ష ప్రకారం 20వ శతాబ్దం నుంచి యూరప్, ఆస్ట్రేలియా, చైనా, మాజీ సోవియట్ ప్రాంతం, అమెరికా, దక్షిణాఫ్రికా తదితర ప్రాంతాల్లో 50కిపైగా పైలట్‌స్థాయి ఆపరేషన్లు జరిగాయి. దీనిని బట్టి రైతుల సూచనను శాస్త్రీయ ఆధారాలతో పరిశీలించదగిన ప్రతిపాదనగా తీసుకోవచ్చు.అయితే ఒక పైలట్ ప్రాజెక్టు అన్నింటినీ నిరూపించగలదా అనే సందేహం కూడా ఉంది. ఎందుకంటే ఒక ప్రభుత్వ భూమిలో చేసిన చిన్న ప్రయోగం విజయవంతమైతే, చింతలపూడి రేచర్ల మొత్తం ప్రాంతంలో ఎటువంటి ప్రమాదం ఉండదని వెంటనే నిర్ధారించలేం. ఎందుకంటే భూగర్భ నిర్మాణం ప్రతి ప్రాంతంలో ఒకేలా ఉండదు. అందువల్ల పైలట్ ప్రయోగానికి ముందు,భూగర్భ పొరల నిర్మాణం, బొగ్గు పొరల స్థానం,భూగర్భ జలాల ప్రవాహ దిశ, జలధారల మధ్య సంబంధం,రాళ్ల పగుళ్ల, పీడన పరిస్థితులు వంటి అంశాలను విపులంగా అధ్యయనం చేయాలి. అప్పుడు మాత్రమే పైలట్ ఫలితాలకు శాస్త్రీయ విలువ ఉంటుంది. రాబోయే కాలంలో భూగర్భజలాలు అనేవి ఏ విధంగా మారే అవకాశం ఉంది అనేదే రైతుల ఆందోళనల్లో అత్యంత తీవ్రమైన అంశంగా ఉంది. ఎందుకంటే ఈ ప్రక్రియలో బొగ్గు భూమి అడుగునే గ్యాసిపై అవుతుంది. దీనివలన వేడి, వాయువులు, బూడిద అవశేషాలు, వివిధ రసాయన సమ్మేళనాలు ఏర్పడతాయి. గతంలో జరిగిన వివిధ పరిశోధనలు కూడా ఈ ప్రక్రియ వలన భూగర్భ జలాల నాణ్యతలో మార్పులు సంభవించే అవకాశాన్నికూడా నమోదు చేశాయి. అదే సమయంలో ఈ అధ్యయనం పరిసర భూగర్భ నిర్మాణంలోని కొన్నిపొరలు ఈ కాలుష్య కారకాలను కొంతవరకు శోషించగలవని కూడా పేర్కొంది.దీనిని బట్టి ప్రమాదం ఉంది అని చెప్పడం ఎంత తప్పో,ప్రమాదం అసలు ఉండదు అని ముందే చెప్పడం కూడా అంతే తప్పు అవుతుందని చెప్పాలి. ఆస్ట్రేలియా ఇచ్చిన ముఖ్యమైనపాఠం యూ.సీ.జీ విషయంలో ఆస్ట్రేలియా అనుభవాన్ని చింతలపూడి చర్చకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. క్వీన్స్‌లాండ్‌లో ఒక ప్రాంతంలో నిర్వహించిన యూ.సీ.జీ ప్రాజెక్టులో భూగర్భ జలాలలో బెంజీన్ సంబంధించిన రీడింగులు నమోదయ్యాయి.ఈ కారణంగా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిలిపివేసే చర్య తీసుకుంది.ఉజ్బెకిస్తాన్ మరో రకమైన పాఠంఉజ్బెకిస్తాన్‌లో యూ.సీ.జీ ఆపరేషన్ ద్వారా ఉత్పత్తి చేసిన గ్యాస్‌ను విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగించినట్లు శాస్త్రీయ సమీక్షలు పేర్కొంటున్నాయి. అయితే అక్కడ సాధించిన విజయం చింతలపూడిలో కూడా అదే ఫలితాలు వస్తాయని హామీ ఉండకపోవచ్చు.ఎందుకంటే భూగర్భ శాస్త్రం వేరు నీటి వ్యవస్థ వేరు వ్యవసాయ పరిస్థితులు వేరు.అందుకే "అక్కడ జరిగింది కాబట్టి ఇక్కడ కూడా జరుగుతుంది" అనే వాదన కూడా శాస్త్రీయంగా సరైంది కాదు. దీనిని బట్టి చింతలపూడి యూ.సీ.జీ విషయంలో మనం పర్యావరణ ప్రమాదం నిరూపించబడిన తర్వాత స్పందించడం కంటే, ప్రమాదం సంభవించే అవకాశాన్ని ముందుగానే పర్యవేక్షించడం మంచిదని చెప్పవచ్చు. •

## 17న పబ్లిక్ గార్డెన్‌లో ఘనంగా ప్రజాపాలనా దినోత్సవం

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** ఈనెల 17వ తేదీన నాంపల్లి లోని పబ్లిక్‌గార్డెన్‌లో నిర్వహించే తెలంగాణ ప్రజా పాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ప్రజాపాలన దినోత్సవం నిర్వహణా ఏర్పాట్లపై గురువారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, క్రిస్టినా చొంగ్తూ, శిఖా గోయేల్, హైదరాబాద్ సి.పి సజ్జనార్, ఆర్టీసీ ఎండి నాగి రెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితర సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ప్రజా పాలనా దినోత్సవాన్ని పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 17న ఉదయం అసెంబ్లీ ఎదురుగా గల అమరవీరుల స్తూపం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి నివాళులు అర్పించిన అనంతరం పబ్లిక్ గార్డెన్ కు వస్తారని తెలిపారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద, పబ్లిక్ గార్డెన్‌లో సంబంధిత అధికారులు తగు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. నగరంలోని పలు ప్రధాన భవనాలకు, చారిత్రక కట్టడాలకు విద్యుత్‌దీపాల అలంకరణ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణకు ఈ నెల 15న పూర్తి డ్రెస్ రిహార్సల్స్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రజాపాలన దినోత్సవానికి వేయిమంది స్వయంసహాయక మహిళలతోపాటు 2 వేల మంది హాజరవుతారని పేర్కొన్నారు.

## బెయిల్ పొందాక ఇష్టానుసారంగా
## సిఎంసహా పలువురిపై వ్యాఖ్యలు
## కోర్టుకు క్లిప్పింగ్ సమర్పణ

# తాతామధు, నవీన్‌రెడ్డి బెయిల్ రద్దు కోరుతూ నాంపల్లి కోర్టులో సైఫాబాద్ పోలీసుల పిటిషన్

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై కులం పేరుతో అవమానకరంగా దూషించిన కేసులో నిందితులుగా వుండి, కోర్టులో బెయిల్‌పై వున్న బిఆర్ఎస్ ఎంఎల్‌సిలు తాత మధు, నవీన్ రెడ్డిలపై సైఫాబాద్ పోలీసులు గురువారం నాడు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీరిద్దరి బెయిల్ వెంటనే రద్దు చేయాలని ఈ పిటిషన్‌లో పోలీసులు కోరారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్య లు చేసినందుకు వీరిపై సోమవారం నాడు కేసు నమోదవడం తెలిసిందే. మంగళవారం ఉదయం వీరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయస్థానం బెయిల్ ఇవ్వడం విదితమే. బెయిల్ పొందిన తరువాత మధు, నవీన్ రెడ్డిలు ఇష్టానుసారం సిఎం రేవంత్ రెడ్డితో పాటు ఇతరులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని పోలీసులు కోర్టుకు వివరించారు. వీరిద్దరు బెయిల్ నిబంధనలు ఉల్లంఘించినందున వెంటనే బెయిల్‌ను రద్దు చేయాలని పోలీసులు కోర్టును కోరారు. ఇద్దరు ఎంఎల్‌సిలు చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన క్లిప్పింగులను సైఫాబాద్ పోలీసులు కోర్టుకు సమ ర్పించారు. దీంతోపాటు ఈ కేసును ఎస్‌సి, ఎస్‌టి కోర్టుకు బదిలీ చేయాలని పోలీసులు కోరారు.

### సైఫాబాద్ పోలీసుస్టేషన్‌లో బిఆర్ఎస్ మహిళా నేతల ఫిర్యాదు

ఇదిలావుండగా అసెంబ్లీ గేటు వద్ద సోమవారం ఉదయం తమ పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని, ఇందుకుగానూ వారిపై చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ మహిళా నేతలు సైఫాబాద్ పోలీసులను కోరారు. ఈ మేరకు వారు ఒక ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో మహిళా ఎం ఎల్ఎలు సునితా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిలతో పాటు మరో ఇద్దరు గాయపడ్డారని ఆ ఫిర్యాదులో తెలిపారు.
ఎంఎల్ఎలకే రక్షణ లేకుంటే సామాన్య ప్రజలకు ఎలాంటి రక్షణ వుంటుందని బిఆర్ఎస్ మహిళా నేతలు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, సునీతా లక్ష్మారెడ్డి ఉన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు ఫుల్.. తెలంగాణకు నిల్

## మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** కాలం తెచ్చిన కరువు కాదని.. సిఎం రేవంత్ రెడ్డి పాలన తెచ్చిన కరువు ఇది అని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. తెలంగాణ పంట పొలాలు ఎండుతుంటే.. కృష్ణా జలాలు ఎపికి వదిలిపెడుతున్నారని అన్నారు. గురువారం తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ కు నీళ్లు ఫుల్ అయితే..తెలంగాణకు నీళ్లు నిల్ అని.. ఇది సిఎం రేవంత్ రెడ్డి పాలన అని విమర్శించారు. కొండారెడ్డిపల్లిలో రైతులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారని.. వారికి తమరిచ్చే సమాధానమేంటి? అని హరీష్ రావు ప్రశ్నించారు.
నీళ్లు ఎత్తిపోసి భద్రపరచాల్సిన సమయంలో అలా చేయట్లేదని, కల్వకుర్తి ఎత్తిపోతలలోని ఎల్లూరు పంప్‌హౌస్‌లో 5 మోటార్లు ఉంటే..రెండే నడిపిస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. రెండు మోటార్లను పగటి సమయంలో..11గంటలే నడిపిస్తున్నారని, నీళ్ల విషయంలో సొంత జిల్లానే సిఎం రేవంత్ రెడ్డి నిరక్ష్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎపి సిఎం చంద్రబాబు నాయుడుకు గురుదక్షిణ చెల్లిస్తూ..తెలంగాణ రైతులకు అన్యాయం చేస్తున్నారని, భీమా ప్రాజెక్టులో 3 మోటార్లు ఉంటే..ఒక్కటే నడుపుతున్నారని, కోయిల్ సాగర్‌లో 3 మోటార్లుంటే..ఒక్కటే నడుపుతున్నారని మండిపడ్డారు. ఎపిలో చంద్రబాబు వెలిగొండకు నీళ్లు ఇచ్చేందుకు ఇలా సహకరిస్తున్నారా? అని ప్రశ్నించారు. ఎపి ప్రభుత్వం నీళ్లు తరలించకుండా ఆపాల్సిందిపోయి.. సొంత రాష్ట్రానికి నీళ్లు ఆపుతున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.



జూబ్లీహిల్స్ ఠాణాలో సుమంత్

## పోలీసుల ముందు హాజరైన మాజీ ఓఎస్డీ సుమంత్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్న మాజీమంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ నార్ల సుమంత్ గురువారం జూబ్లీహిల్స్ ఠాణాలో ప్రత్యక్షమయ్యారు. దాదాపు 20 రోజులకుపైగా పోలీసుల నుంచి తప్పించుకొని తిరుగుతున్న ఆయనకు కోర్టు ముందస్తు బెయిలు మంజూరు చేసింది. ఇందుకోసం రూ. 25వేల తో కూడిన రెండు ష్యూరిటీలను సమర్పించాలని కోర్టు సూచించింది. ఈ మేరకు ఆయన జూబ్లీహిల్స్ ఠాణాలో డిఐ సత్యనారాయణ ముందు తన న్యాయవాదులతో కలిసి హాజరయ్యారు.

## 15 టిఎంసిలకు పెరిగిన గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సామర్థ్యం

**హైదరాబాద్,సెప్టెంబరు 10,ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలోని జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన గుడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అలియాస్ రేలంపాడు రిజర్వాయర్ సామర్థ్యం 15టిఎంసిలకు పెంచి అభివృద్ధి పరిచేందుకు తెలంగాణ ప్రభుత్వం ఉత్వర్వులు జారీచేసింది. నీటిపారుదలశాఖ ప్రభుత్వ కార్యదర్శి ఇ శ్రీధర్ జివో ఆర్‌టినెంబరు 467ను, బుధవారం ఆమోదం తెలిపి విడుదల చేశారు. రేలంపాడు జలశయం మొదట 1.19 టిఎంసిలతో నిర్మించాలని ప్రతిపాదించారు. ఐతే కృష్ణాజలాలను గరిష్టంగా వినియోగించుకోవాలని 15 టిఎంసికి రిజర్వాయర్ సామర్థం పెంపునకు నిర్ణయం తీసుకుంది. పిఎస్‌పి మోడల్‌లో, సోలార్ పవర్ జనరేషన్‌తో అనుసంధానం చేసి ప్రాజెక్టు చేపట్టేందుకు ఆమోదం తెలిపింది. సర్వేలుఅధ్యయనాల కోసం రూ.15 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. అదనంగా 1,100 ఎకరాల భూసేకరణకు రూ.165 కోట్ల నిధుల మంజూరు చేసింది.



సబ్‌స్టేషన్ ముందు నిరసన తెలుపుతున్న రైతులు

## కరెంట్ కోతలతో ఎండుతున్న పంటలు
### ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో రైతుల ధర్నాలు
### విద్యుత్ ఉపకేంద్రాల ముట్టడి.. హైవేపై బైఠాయింపు

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** వ్యవసాయానికి సరైన విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోతున్నాయంటూ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా రైతులు మంగళవారం రోడ్డెక్కారు. విద్యుత్ కోతలను నిరసిస్తూ జాతీయ రహదారిపై బైఠాయించి, విద్యుత్ ఉప కేంద్రాలను ముట్టడించి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

**కోదాడ-రాయచూర్ జాతీయ రహదారి దిగ్బంధం**

నారాయణపేట జిల్లా మక్తల్ మండలం గుడిగండ్ల వద్ద రైతులు జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. వరి, పత్తి పంటలకు నీళ్లు పెట్టే సమయంలో కరెంట్ కోత విధించడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గంటపాటు రహదారిని దిగ్బంధించడంతో వాహనాలు నిలిచి పోయాయి. గద్వాల జిల్లా రాజోలి మండలం మాన్ దొడ్డి విద్యుత్ ఉప కేంద్రం వద్ద రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. 24 గంటల్లో 3 గంటలు కూడా కరెంట్ రావడం లేదని, వచ్చినా లో వోల్టేజీతో మోటార్లు కాలిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో రైతులు విద్యుత్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. విద్యుత్ కోతలతో బోర్లు, మోటార్లు పనిచేయక పంటలకు సాగునీరు అందక ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామం పెద్దగూడెం రైతులు ఆందోళనకు దిగారు. కడుకుంట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట కడుకుంట్ల-వనపర్తి ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు.

# భూత్పూర్ వద్ద ఘోరప్రమాదం

### హైవే పక్కనే సూచిక బోర్డును ఢీకొట్టిన డిసిఎం
### ఆయిల్‌ట్యాంక్ పగిలి ఒక్కసారిగా ఎగిసిన మంటలు
### 270 మేకలు, డిసిఎం క్లీనరు సజీవ దహనం..
### తీవ్రగాయాలతో అపస్మారకస్థితిలో డ్రైవర్
### ప్రమాదం నుంచి బయటపడిన 24 జీవాలు, ఇద్దరు వ్యక్తులు

**భూత్పూర్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** మేకల లోడ్‌తో కాన్పూర్ నుంచి బెంగళూర్ వెళ్తున్న డీసీఎం ట్యాంకరు పేలడంతో మంటలు చెలరేగి డిసిఎంలో ఉన్న మేకలతో సహా, డీసీఎం క్లీనర్ చనిపోయిన సంఘటన భూత్పూర్ జాతీయ రహదారి-44పై చోటు చేసుకుంది.. వివరాల్లోకి వెళితే..యుపి రాష్ట్రంలో కాన్పూర్ జిల్లా దౌలత్‌పూర్‌కు చెందిన డ్రైవర్ రషీద్ యూపి 77-బీఎన్-7458నెంబర్ గల డీసీఎంలో 294మేకల లోడ్‌తో క్లీనర్ అమిత్‌కుమార్(32) మరో ఇద్దరు అబ్దుల్ బారి,ఇస్థికర్‌లతో కలిసి ఈ నెల 8న యూపిలోని కాన్పూర్ నుంచి బయలు దేరారు.ఇందులో డ్రైవర్ రషీద్‌తో మరో ఇద్దరు బారి, ఇస్థికర్‌లు క్యాబిన్‌లో ఉండగా,క్లీనర్ అమిత్ కుమార్(32) డీసీఎంలో మేకలతో పాటు ఉన్నాడు.
డీసీఎం గురువారం తెల్లవారు జామున నాలుగున్నర గంటలకు భూత్పూర్‌కు సమీపంలోని కేవీఎన్ పంక్షన్ హాల్ వద్ద జాతీయ రహదారి-44పై ఉన్న సూచిక బోర్డును ఢీకొట్టడంతో ఆయిల్ ట్యాంక్ పగిలి పోయి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో డీసీఎంలో ఉన్న 294 మేకలలో 270 మేకలతో పాటు మధ్యన ఉన్న అమిత్‌కుమార్ కాలి బూడిదయ్యారు. కాగా, 24 మేకలు బతికి బయట పడ్డాయి, డ్రైవర్ రషీద్‌కు తీవ్రగాయాలై అపస్మారక స్థితికి చేరుకోగా ఇతన్ని పోలీసులు జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. క్యాబిన్‌లో మిగిలిన ఇరువురు బారి, ఇస్థికర్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. మంటలు ఎగిసి పడుతుండడంతో జిల్లా అగ్ని మాపక కేంద్రానికి సమాచారమందించగా, రంగం లోకి దిగిన అగ్నిమాపక సిబ్బంధి మంటలను అదుపులోకి తెచ్చారు. మృతుడు అమిత్‌కుమార్ సమీప బంధువు దయశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నాగన్న తెలిపారు.
ప్రమాదవార్త తెలియగానే జిల్లా ఎస్పీ డి జానకి, ఐపిఎస్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఇతర పోలీస్ అధికారులతో కలిసి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద సంఘటనను పరిశీలించారు. ప్రమాద కారణాలను భూత్పూర్ సీఐ శివరాత్రి రామకృష్ణ,ఎస్సై నాగన్నలను అడిగి తెల్సుకున్నారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ పోలీస్ ఎస్సై2 దివ్య,మూసాపేట ఎస్సై వేణు, టూటౌన్ ఎస్సై ఇజాజొద్దిన్ ఇతర అగ్ని మాపక సిబ్బంధి పాల్గొన్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

## కృష్ణా జలాల వివాదం అక్టోబరు 13కు వాయిదా

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** కృష్ణా జలాలపై ఆంధ్రప్రదేశ్ సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ అక్టోబరు 13కు వాయిదా పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ అనంతరం ఏర్పడిన విభజిత ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీపై వివాదాలు మొదలైనాయి. ఆంధ్రప్రదేశ్ 50శాతం నీటిని తెలంగాణతో పంచుకోవాలనే ప్రతిపాదన విభేస్తున్నది. తెలంగాణ ప్రస్తుతం 50:50 పద్ధతిలో పుంచుకొని బ్రిజేష్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం క్యాచ్‌మెంట్ ఏరియా బేసిన్ బట్టి వాటాల పంపిణీ జరుగాలని డిమాండ్‌చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ కృష్ణాబేసిన్‌దాటి నీటిని తీసుకొని వెళ్ళుతున్న వైనం తెలంగాణ నుంచి ప్రతిఘటన రావడంతో దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ వాయిదా వేసింది. గతంలో కృష్ణా పరివాహక ప్రాంత పరిధి రాష్ట్రాలకు నీటి పంపకాలు చేస్తూ బ్రిజేష్ ట్రైబ్యునల్ ఉత్తర్వులు జారీచేసింది. విభజన తర్వాత ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన నీటిని రెండురాష్ట్రాలకు పంచాల్సి ఉందని ఆంధ్రప్రదేశ్ పేర్కొంది. దీనిపై త్వరితగతిన విచారణను పూర్తి చేయాలని సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది. ఈ పిటిషన్‌పై అక్టోబర్ 13న విచారణ జరుపుతామని జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం తెలిపింది.

## బిఆర్ఎస్ నాయకులపై హెచ్‌ఆర్‌సిలో కాంగ్రెస్ ఫిర్యాదు

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** అసెంబ్లీ వర్షాకాలం సమావేశాల సందర్భంగా సోమవారం శాసనసభ వద్ద బందోబస్తులో వు న్న పోలీసులపై దాడులకు పాల్పడి, మహిళా పోలీసులతో అసభ్యంగా ప్రవర్తించిన బిఆర్ఎస్ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రె స్ నాయకులు రాష్ట్ర మానవ హక్కుల సంఘంలో గురువారం ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ఇందిరా శోభన్ నేతృత్వంలో పలువురు నాయకులు హెచ్‌ఆర్‌సి ఛైర్మన్‌కు ఈ మేరకు ఒక వినతి పత్రం సమర్పించారు. విధి నిర్వహణలో వున్న పోలీసుల కాలర్లు పట్టుకోవడ ం, మహిళా పోలీసుల ఎదుట అర్థ నగ్నంగా నిలబడడం, వారితో వెకిలి చేష్టలు వేయడం వంటి చర్యలకు పాల్పడిన బిఆర్ఎస్ నాయకులపై చ ట్టపరంగా చర్యలు తీసుకునేందుకుగానూ ఇప్పటికే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దీనిపై కేసులు నమోదయ్యాయని ఆమె తెలిపారు. దీం తో పాటు దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు కూడా వారిపై చర్యలు తీసుకోవాలని హెచ్‌ఆర్‌సి ఛైర్మన్‌ను ఆమె కోరారు. ఇందుకు గానూ బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ సహా ఆ పార్టీ నాయకులు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. మరోవైపు సిఎం రేవంత్ రెడ్డిని నేరుగా ఎదు ర్కొనే దమ్ములేకనే కెటిఆర్ చిల్లర చేష్టలు, కరెంటు డ్రామా ఆడుతున్నారని ఇందిరా శోభన్ విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ అబద్ధపు పునాదుల మీద ఏర్పడిందని ఆమె విమర్శించారు. ఈ సమావేశంలో వాల్మీకి బోయ కార్పొరేషన్ ఛైర్మన్ నగేష్, యువజన కాంగ్రెస్ నేత మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులు ఆత్మహత్యలు చేసుకోవద్దు : డిజిపి
### ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక సందేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** సెప్టెంబరు 10న ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా పోలీసులకు డిజిపి సి.వి ఆనంద్ ప్రత్యేక సందేశం ఇచ్చారు. పోలీసులు ఆత్మహత్యలు చేసుకోవద్దని, బెట్టింగ్. గేమింగ్ ఉచ్చులో చిక్కుకుని అప్పుల ఊబీలో పడవద్దని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ మేరకు గురువారం డిజిపి ఆనంద్ ప్రకటన విడుదల చేస్తూ పోలీసులు విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటారని మరెన్నో ఒత్తిళ్లను చవిచూస్తారని తెలిపారు. పోలీసులు ఆర్థిక పరమైన అంశాలను కుటుంబ సభ్యులతో పంచుకోవాలని, ఇబ్బ ందులు వుంటే అధికారులకు చెప్పాలని, ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని, కుటుంబ సభ్యులకు ఇబ్బంది కలిగించవద్దని ఆయన కోరా రు. గడచిన నాలుగు నెలల్లో ఇద్దరు పోలీసులు ఆత్మహత్య చేసుకున్నారని, ఈ ఘటనలు తనను కలచి వేసిందని ఆయన తెలిపారు.
యువ, మధ్య వయస్సు కలిగిన కానిస్టేబుళ్లు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని డిజిపి వెల్లడించారు. ఈ ఘటనలకు ఆన్‌లైన్ బెట్టింగ్ కారణమని ఆయన తెలిపారు. పోలీసు శాఖలో కొందరు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడి భూములు, ఆస్తులు అమ్ముకున్నారని. అప్పుల పాలయ్యారని డిజిపి తెలిపారు. పోలీసులు వ్యసనాలకు దూరంగా వుండాలని ఆయన సూచించారు.
పోలీసు శాఖలో 93 వేల మంది సిబ్బంది వున్నారని, అందరు ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌కు దూరంగా వుండాలని, కుటుంబాలతో కలిసి వుండాలని ఆయన కోరారు. పోలీసుల సమస్యలపై తాను ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని ఆయన వెల్లడించారు.

## మంత్రి పదవి ఇచ్చేది అధిష్ఠానం.. రేవంత్‌రెడ్డి కాదు: కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** సీఎం, తాను ఎప్పుడూ తిట్టుకోవాలని కొందరి చూస్తున్నారని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. సీఎంతో తనకు భిన్నాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయన్నారు. మంచి జరిగితే మంచి, చెడు జరిగితే చెడు అని చెప్పడం తన నైజమని వివరించారు. గురువారం సాయంత్రం అసెంబ్లీలో సీఎల్పీ సమావేశం అనంతరం ఆయన మీడియా చిట్‌చాట్ నిర్వహించారు. మంత్రి పదవి కోసం రాజీపడినట్లు ప్రచారం చేస్తున్నారని, కానీ కలిస్తే కాంప్రమైజ్, కలవకపోతె గ్యాప్ పెరిగిందని ప్రచారం చేయడం సరికాదన్నారు. మంత్రి పదవి ఇచ్చేది అధిష్ఠానం కానీ రేవంత్‌రెడ్డి కాదని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు.

## పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు
## పలు వాహనాలు ధ్వంసం
### ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్న జనం

**హైదరాబాద్ (అబ్దుల్లాపూర్‌మెట్), సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** ఆర్టీసీడ్రైవర్ నిరక్ష్యం కారణంగా నగర శివారులో ఘోర ప్రమాదం తప్పింది. విజయవాడ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై వెళ్తున్న ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కనే ఉన్న పెట్రోల్ బంక్‌లో డిజిల్ పోసుకునేందుకు లైన్ నిలబడిన రెండు వాహనాలపై దూసుకుపోవడంతో ఒక కారు... మరో ట్రాలీ ఆటో



పెట్రోల్ బంక్‌లోకి దూసుకొచ్చి వాహనాలను ఢీకొట్టిన బస్సు

పాటు పెట్రోల్ బంక్ లోని పలు యం త్రాలు ధ్వంసం కాగా ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చో టుచేసుకున్న సం ఘటనకు సంబం ధించి పోలీసులు తెలి పిన వివరాల వివ రాల ప్రకారం.. బాట సింగారం గ్రామం లోని భారత్ పెట్రోల్ బంక్‌లో గురువారం ఉదయం 10.45 గంటల సమయంలో డిజిల్ పోసుకునేందుకు ఒక కారు...ఒక ఆటోతో పాటు పలు వాహనాలు బంక్‌లోకి వచ్చి లైన్‌లో నిలిపాయి. ఇదే సమయం లో దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు (టీఎస్11యుఏ-1188) దిల్‌సుఖ్‌నగర్ నుంచి చౌటుప్పల్‌కు వెళ్తుండగా పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే బస్సు డ్రైవర్ అతి వేగంగా వచ్చి పెట్రోల్ బంక్‌లో ఉన్న వాహనాలపైకి దూసుకువెళ్లింది. ఈ ఘట నలో ఓ స్విట్‌కారుతో పాటు ట్రాలీ ఆటో, ఆయిల్ డిస్‌ప్లే, పెట్రోల్ గన్, పిల్లర్, విద్యుత్‌తీగలు ధ్వంసం అయ్యాయి.
కాగా బస్సు పెట్రోల్ బంక్ లోకి దూసుకొస్తున్న విషయాన్ని గమనించిన ప్రజలు అక్కడినుంచి పరు గులు తీయడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పెట్రోల్‌బంక్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బస్సుడ్రైవర్ ప్రతాప్‌రెడ్డిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రూ.2 లక్షల సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుకు లక్ష లంచం
### ఎసిబికి చిక్కిన టిఎస్‌ఐడిసి సీనియర్ అసిస్టెంట్, సచివాలయ ఉద్యోగి

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్ (టిఎస్‌ఐడిసి)లో పనిచేసే ఓ ఉద్యోగికి సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రెండు లక్షల రూపాయల చెక్కును ఇచ్చేందుకు ఇదే సంస్థకు చెందిన సీనియర్ అసిస్టంట్‌తో పాటు సచివాలయానికి చెందిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగి లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ ఎసిబికి దొరికిపోయిన వైనం ఇది. బషీర్‌బాగ్‌లోని టిఎస్‌ఐడిసి కార్యాలయంలో లంచం తీసుకోగా ఈ సంస్థతో పాటు సచివాలయంలో ఈ సందర్భంగా సోదాలు నిర్వహించారు. ఎసిబి డిజి చారు సిన్హా దీనికి సంబంధించిన వివరాలను గురువారం మీడియాకు వెల్లడించారు. టిఎస్‌ఐ డిసికి చెందిన ఓ ఉద్యోగి అనారోగ్యంతో బాధపడగా సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆయనకు రెండు లక్షల రూపాయలు మంజూరయ్యింది. దీనికి సంబంధించిన చెక్కును సదరు ఉద్యోగికి ఇచ్చేందుకు టిఎస్‌ఐడిసికి చెందిన సీనియర్ అసిస్టెంట్ మేడి వినోద్ లక్ష రూపాయలు లంచం అడిగాడు. ఇదే సమయంలో సచివాల యంలో సిఎం రిలీఫ్ ఫండ్ విభాగంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి అనందేశి రాఘవేందర్ కూడా లంచం ఇవ్వాల్సిందేనని ఖరాఖండిగా చెప్పాడు. ఈ క్రమంలో రాఘవేందర్ బాధితుడి నుంచి ఐదు వేల రూపాయలు ఫోన్ పే ద్వారా తీసుకున్నాడు. తాను లక్ష రూపాయలు ఇవ్వలేనని బాధితుడు చెప్పినా ఇద్దరు వినిపించుకోలేదు. దీంతో బాధితుడు నేరుగా ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు రంగంలో దిగిన ఎసిబి అధికారులు పక్కాగా వ్యవహరించి గురువారం మధ్యాహ్నం బషీర్‌బాగ్‌లోని టిఎస్ ఐడిసి కార్యాలయం వద్ద కాపుకాశారు. బాధితుడు లక్ష రూపాయలను రాఘవేందర్‌కు ఇవ్వగానే పక్కనే వున్న ఎసిబి అధికారులు అతన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టు కున్నారు.



ఎసిబికి పట్టుబడిన లంచావతారులు

అనంతరం అతన్ని విచారించగా ఈ గోల్‌మాల్‌లో సీనియర్ అసిస్టం ట్ వినోద్ హస్తం వెలుగు చూసింది. దీంతో రాఘవేందర్‌తో పాటు వినోద్‌ను అరెస్టు చేసి లంచం డబ్బులు లక్ష రూపా యలను జప్తు చేశారు. అనంతరం ఎసిబి అధికారులు టిఎస్‌ఐడిసి కార్యా లయంతో పాటు సచివాలయంలోని సిఎం రిలీఫ్ ఫండ్ కార్యాలయంలో సోదాలు నిర్వహించి కీలక పత్రాలు జప్తు చేశారు. అనంతరం ఇద్దరిని నాంపల్లి ఎసిబి కోర్టులో హాజరు పరిచి రిమాండుకు తరలించారు. కాగా సర్కారీ విభాగాల్లో లంచావతారుల గురించి ధైర్యంగా ముందుకు వచ్చి 1064కు ఫిర్యాదు చేయాలని ఎసిబి డిజి చారు సిన్హా కోరారు.

## తెలంగాణ అభివృద్ధికి మోడీ ప్రభుత్వం
### మరో చరిత్రాత్మక నిర్ణయం: ఎంపి లక్ష్మణ్

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ సమావేశంలో తెలంగాణకు అత్యంత ప్రయోజనకరమైన సికింద్రాబాద్ (ఘట్‌కేసర్)-కాజీపేట బహుళ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టుకు ఆమోదం లభించడం పట్ల హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నట్లు ఎంపి డా.లక్ష్మణ్ అన్నారు. దేశవ్యాప్తంగా ఎనిమిది రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు రూ.20,804 కోట్లతో ఆమోదం తెలిపిందని, ఇందులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సంబంధించిన ఐదు కీలక ప్రాజెక్టులకు రూ.10,021 కోట్ల పెట్టుబడితో ఆమోదం లభించిందన్నారు.
ఈ ప్రాజెక్టులు మొత్తం 540 కిలోమీటర్ల రైల్వే మార్గాన్ని అభివృద్ధి చేయనున్నాయన్నారు. సికిందరాబాద్- ఘట్‌కేసర్-కాజీపేట మార్గం తెలంగాణ రైల్వే వ్యవస్థకు జీవనాడి వంటిదన్నారు.
సరుకు రవాణా వేగవంతమై, తెలంగాణ పరిశ్రమలు, రైతులు, వ్యాపారులు, యువతకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ నిర్ణయం ప్రధాని మోడీ వికసిత భారత్-వికసిత తెలంగాణ సంకల్పానికి నిదర్శనం అన్నారు.


आईआरईएल (इंडिया) लिमिटेड IREL (ఇండియా) లిమిటెడ్
పూర్వపు ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్
(भारत सरकार का उपक्रम)
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
CIN : U15100MH1950GOI008187 Website : www.irel.co.in
ISO 9001: 2015, ISO 14001: 2015 & ISO 45001 : 2018 Company
आज़ादी का अमृत महोत्सव

రిఫరెన్స్: ADVT. No. 26-27/13 టెండర్ ప్రకటన తేదీ: 05.09.2026 IREL (ఇండియా) లిమిటెడ్, చవారా క్రింది ఐటమ్‌లు/పని వివరణల కొరకు బిడ్ ఆహ్వానిస్తోంది.

| ఈవెంట్ నం. (GeM) | పని/ఐటమ్ వివరణ |
| --- | --- |
| GEM/2026/B/7999969 | పుతెన్‌తురా ప్రాంతం నుండి HUP మినరల్ ఇసుక యార్డ్‌కు, ఇసుక ఖనిజం యొక్క తవ్వకం, సేకరణ, గుట్ట వేయటం, లోడింగ్ మరియు రవాణా మరియు HUP/MSP టైల్స్ యార్డ్ IREL చవారా నుండి పుతెన్‌తురా ప్రాంతం వద్ద తవ్వబడిన పిట్స్‌కు టైలింగ్ ఇసుక యొక్క మెకానికల్ లోడింగ్, రవాణా మరియు లెవెలింగ్ పని. |

http://irel.co.in లేదా http://gem.gov.in వెబ్‌సైట్ నుండి బిడ్డర్, టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. పై టెండర్‌లకు సంబంధించిన ఏవైనా సవరణ/పొడిగింపు పై వెబ్‌సైట్స్‌లో మాత్రమే ఉంచబడును.
సం/-హెడ్, చవారా.
CBC 48139/11/0014/2627

# ఆర్టీసి గుర్తింపు సంఘాల ఎన్నికలు త్వరలోనే

## దేశంలోనే ఆదర్శ ప్రజారవాణా సంస్థగా ఆర్టీసీని తీర్చిదిద్దుతాం

## మహాలక్ష్మి పథకంతో సంస్థకు కొత్త జీవం

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 10,ప్రభాతవార్త:** ఆర్టీసి గుర్తింపు సంఘం ఎన్నికలు త్వరలో పండుగ ముగియగానే నిర్వహిస్తామని ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయడానికి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన తీరుఫలితాలపై ఒకసారి గుర్తింపుసంఘం ఆలోచనలు తీసుకొని ఏలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రకటించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలు కె.శంకరయ్య,చిక్కుడు వంశీకృష్ణ కూచుకుల్ల రాజేశ్‌రెడ్డిలు అడిగిన ప్రశ్నకు గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభాకర్‌గౌడ్ సమాధానం ఇచ్చారు. తెలంగాణ ఆర్టీసీ బస్సులు సుమారు 30 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ 65 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయని తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థలో డ్రైవర్లు, కండక్టర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని, వారి సేవలను ఈ సభ అభినందించాలని కోరారు. 2023 డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం, డిసెంబర్ 9న మహాలక్ష్మీ పథకాన్ని ప్రారంభించి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని మంత్రి తెలిపారు.మహాలక్ష్మి పథకం వల్ల మహిళల ఆర్థిక భారం తగ్గడంతో పాటు ఆర్టీసీకి కూడా కొత్త ఊపు వచ్చిందన్నారు. పథకం అమల్లోకి వచ్చిన తర్వాత బస్సుల్లో ఆక్యుపెన్సీ, బస్ స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరిగిందని తెలిపారు. తెలంగాణ మహిళలు ఇప్పటి వరకు 347.47 కోట్ల ఉచిత ప్రయా ణాలు చేసి రూ. 12,171 కోట్లు ఆదా చేసు కున్నారని మంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు 2,932 కొత్త బస్సులను కొనుగోలు చేశామని, 15 సంవత్సరాలు దాటిన బస్సులను కొనసాగించకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఇప్పటికే 340 డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా రెట్రోఫిట్ చేశామని వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో పిఎంఇ -డ్రైవ్ కింద 2,200 ఎలక్ట్రిక్ బస్సులు తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రయాణికుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రీమియం కేటగిరీ బస్సులతో పాటు ఆర్టీసీ పరిధిలో నడుస్తున్న ఎలక్ట్రిక్ బస్సుల్లో ఇప్పటికే క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాలు ఏర్పాటు చేశామని చెప్పారు.ఆదిలాబాద్ జిల్లాలో జిల్లా ఎస్పీ సహకారంతో బస్సుల్లో సిసి కెమెరాల ఏర్పాటు చేపట్టామని, భవిష్యత్‌లో అవసరమైన అన్ని బస్సుల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. హైదరాబాద్‌లో లాస్ట్ మైల్ కనెక్టివిటీని మరింత మెరుగుపరుస్తున్నామని మంత్రి తెలిపారు. మెట్రో, ఎంఎంటీఎస్ స్టేషన్ల నుంచి ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకునేలా అదనపు బస్సు రూట్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.ప్రస్తుతం హైదరాబాద్‌లో 370 కొత్త రూట్లలో బస్సులు నడుపుతున్నామని, అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సులు చేరేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని మంత్రి వెల్లడించారు.గతంలో 97 డిపోలు ఉండగా ప్రస్తుతం 99 డిపోలకు పెంచామని మంత్రి తెలిపారు. పెద్దపల్లి, ములుగు డిపోలను ఏర్పాటు చేశామని, ప్రజల నుంచి వస్తున్న డిమాండ్లను పరిశీలించి అవసరమైన చోట కొత్త డిపోలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. మహాలక్ష్మి పథకం అందుకు అనుగుణంగా బస్ స్టేషన్లలో మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని చెప్పారు.అవసరమైన చోట సిఎస్ఆర్, ఇతర నిధుల సహకారంతో కూడా బస్ స్టేషన్ల అభివృద్ధి చేపడతామని తెలిపారు. యాదాద్రి ఆలయానికి వెళ్లే ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు వంగర వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలిపేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే విధానం తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు. ఆర్టీసీ ఆస్తులను పరిరక్షిస్తూ సంస్థ అభివృద్ధికి వినియోగిస్తామని తెలిపారు.గాజులరామారం, శంషాబాద్, ఫ్యూచర్ సిటీ ప్రాంతాల్లో బస్ టెర్మినల్స్ అభివృద్ధికి అవసరమైన స్థలాలను తీసుకున్నామని చెప్పారు. పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్టీసీ స్థలాలు తీసుకుంటే, ఆర్టీసీ అభివృద్ధికి అవసరమైన ప్రభుత్వ స్థలాలను కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కార్మికులు 60 రోజుల పాటు సమ్మె చేసినా పట్టించుకోలేదని విమర్శించారు.పూర్తిస్థాయి సర్వీసు నుంచి తొలగించబడిన 244 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకున్నామని, 1,430 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించామని తెలిపారు.ఇటీవల ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ కుటుంబానికి ఉద్యోగం, ఇల్లు అందించే చర్యలు చేపట్టామని మంత్రి వెల్లడించారు.ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత గెలిచిన సంఘం ప్రతినిధులను అధికారుల కమిటీలో చేర్చి విలీన ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.ఇతర రాష్ట్రాల్లో ఆర్టీసీ విలీనం తర్వాత ఎదురైన ఇబ్బందులు తెలంగాణలో పునరావృతం కాకుండా జాగ్రత్తగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.మహిళా సాధికారతలో భాగంగా 600 బస్సులకు మహిళలను యజమానులుగా చేసే కార్యక్రమాన్ని చేపట్టామని మంత్రి తెలిపారు. మహిళలకు ఆర్థికంగా, సామాజికంగా మరింత సాధికారత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.గతంలో ఆపరేషనల్ లాస్‌లతో ఇబ్బందులు ఎదుర్కొన్న ఆర్టీసీ ప్రస్తుతం క్రమంగా నష్టాల నుంచి లాభాల దిశగా పయనిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఆర్టీసీని కాపాడటం అంటే తెలంగాణ ప్రజల జీవనాడిని కాపాడటం. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో పాటు ఆర్టీసీకి కొత్త జీవం పోశాం. కొత్త బస్సులు, ఎలక్ట్రిక్ బస్సులు, సిసి కెమెరాలు, కొత్త రూట్లు, ఆధునిక బస్ స్టేషన్లు, కార్మిక సంక్షేమం ద్వారా తెలంగాణ ఆర్టీసీని దేశంలోనే ఆదర్శ ప్రజా రవాణా సంస్థగా తీర్చిదిద్దుతాం" అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## మీడియా పాయింట్



మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

### ఫ్యూచర్ సిటీ పూర్తయితే కెటిఆర్ టీమ్‌కు పుట్టగతులుండవు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** అసెంబ్లీ నుండి సస్పెండ్ అయిన కేటీఆర్ టీమ్ ఫ్యూచర్ సిటీ పూర్తి అయితే పుట్టగతులు ఉండవని అక్కడికి వెళ్లి కొత్త కుట్రలకు తెరతీశారు. పచ్చిఅబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలు క్షమించరు. పక్క రాష్ట్రంలో కొత్త నగరం నిర్మాణం అడ్డుకున్న పార్టీ పరిస్థితి ఏమయ్యిందో గమనించాలి. ఫ్యూచర్ సిటీ కట్టి తీరుతాం. సభ బయట బిఆర్ఎస్, సభ లోపల బీజేపీ సభ జరుగకుండా అల జడులు సృష్టిస్తున్నాయి. 22-ఎపై చర్చ జరుపుతామన్నా సభ జరుగకుండా సభా సమయాన్ని రెండు పార్టీలు వృథా చేస్తున్నాయి. మహిళా నేతలను ముందు పెట్టి శిఖండి రాజకీయాలు చేస్తున్నారు. బీజేపీ పార్టీ సభలో చర్చకు సహకరించాలి.

### రేవంత్‌రెడ్డిని బద్నాం చేయడానికి ఎఐ ఫొటోలతో తప్పుడు ప్రచారం : ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

అసెంబ్లీ ముందు పొలిటికల్ డ్రామాలు చేయడానికి ప్రయత్నించిన కేసీఆర్ అండ్ కో, కేటీఆర్ అండ్ కో ఎఐతో విడియోలు చేసి వైరల్ చేస్తున్నారు. అబద్ధాలు ప్రచారం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. రేవంత్‌రెడ్డిని బద్నాం చేయడానికి చూస్తున్నారు. బి.ఆర్.ఎస్ పార్టీ అంటరాని పార్టీ. మహిళలను పోలీసులపై తోసివేసింది వాళే. కాంగ్రెస్ పార్టీ చర్చ కోసం అసెంబ్లీ పెడితే కావాలని రచ్చ చేసి అసెంబ్లీ నుండి సస్పెండ్ అయ్యారు. ప్రజల సమస్యలపై చర్చలు జరగడం వారికి ఇష్టం లేదు. రేవంత్ రెడ్డి సీఎం కావడం ఇష్టం లేదు. ఎవరు రేవంత్‌రెడ్డిని ఎదుర్కోవడానికి ముందుకు వస్తారో చెప్పండి. కేసీఆర్ వారసుడు ఎవరో చెప్పండి.

### ఫామ్‌హౌస్ ఆదేశాలకు పోటీపడుతున్న కెటిఆర్, హారీశ్‌రావు: విప్ బల్మూరి వెంకట్

అసెంబ్లీలో ప్రతి అంశంపై చర్చ జరపాలని నిర్వహిస్తే కావాలని గందరగోళం సృష్టిస్తున్నారు. ఫామ్‌హౌస్‌లో ఇచ్చిన ఆదేశాలతో పోటీపడి కేటీఆర్, హారీష్‌రావు గందరగోళం సృష్టిస్తున్నారు. స్పీకర్‌కి క్షమాపణ చెప్పకుండా, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. దళితుల మనోభావాలు దెబ్బతినే విధంగా శుద్ధి చేశారు.

### భూబాగోతం బట్టబయలవుతుందని 22-ఎ చర్చ చేయకుండా పారిపోయారు: ఎమ్మెల్యే వేముల వీరేశం

బిఆర్ఎస్ పార్టీ అంటేనే అబద్ధాల రాష్ట్ర సమితి. అసత్యాల పునాదిపై ఏర్పడ్డ పార్టీ బిఆర్ఎస్ పార్టీ. ఆ పార్టీకి ఎఐ నాయకుడు కేటీఆర్. మీడియాలో వచ్చిన వార్తలను కూడా ఎఐ వీడియోలు అని ప్రచారం చేస్తూ, నేరాన్ని ఒప్పుకోకనే ఒప్పుకున్నారు. 22ఏ మీద చర్చలో పాల్గొనకుండా ఎందుకు పారి పోతున్నారు? వారి భూభాగోతం బట్టబయలు అవుతుందని 22ఏ మీద చర్చ చేయకుండా పారిపోతున్నారు. వాస్తవాలు ముఖ్యమంత్రి చూపిస్తున్నారని సభకు రాకుండా కుట్రలు చేస్తున్నారు.

### నేల శుద్ధిచేసి కుల దురహంకారం చాటుకున్నారు: ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

మనుషులను మనుషులుగా చూడలేని బి.ఆర్.ఎస్ నాయకులను చూస్తుంటే బాధ, సిగ్గుగా అనిపిస్తున్నది. దళితుడు స్పీకర్‌గా ఉన్నారని కేసీఆర్ సభకు రావడం లేదు. దళితులు నడిచిన నేల శుది చేసి కుల దురహంకారం చాటుకున్నారు. కేసీఆర్ సభకు ఎందుకు రావడం లేదో కూడా విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలి గవర్నర్‌కు విజ్ఞప్తి. డీజీపీ కూడా బి.ఆర్.ఎస్ నేతలు చేసిన పనులపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి.

### కొండల్‌రెడ్డికి ఫ్యూచర్‌సిటీలో భూమిస్తే తప్పేమిటి? : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అసెంబ్లీలో మొఖం లేక బిఆర్ఎస్ సభ్యులు ఫ్యూచర్‌సిటీకి వెళ్లి చిల్లర కార్యక్రమాలు చేస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలి అనుకునేవారు చిల్లర వేషాలు వెయ్యరు. ఫ్యూచర్ సిటీ, ఫార్మా సిటీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాజకీయ నాయకుడు వ్యాపారం చెయ్యద్దా? కొండల్‌రెడ్డికి ఫ్యూచర్ సిటీలో భూమి ఇస్తే తప్పు ఏమిటి?

### శాసనసభను తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు : బిజెపి ఎమ్మెల్యే పాయల్‌శంకర్



ప్రజాసమస్యలపై చర్చ జరగాల్సిన సభను తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. భారత దేశంలో తక్కువ కాలం జరుగుతున్న శాసన సభ ఏదైనా ఉన్నదా అంటే అది రాష్ట్ర శాసనసభ. ఫీజు రీయింబర్స్‌మెంట్, 22ఏ, ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల బకాయిలపై, రైతుల సమస్యలపై సభలో చర్చ జరగాలని పట్టుబడుతున్నా పట్టించుకోరు. ఈ రకంగా సభ జరిగితే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయి? ప్రధాన ప్రతిపక్షం అయినా బి.ఆర్.ఎస్ పార్టీ వారి గత పదేళ్ల అవినీతి బయటపడుతుందని రాద్ధాంతం చేస్తున్నారు.మిగిలిన రెండు రోజులైనా సభలో ప్రజాసమస్యలపై చర్చ జరగాలని బీజేపీ డిమాండ్ చేస్తున్నది.

# వచ్చే యేడాది జూన్ నాటికి ఉప్పల్-నారపల్లి ఫ్లైఓవర్ పూర్తి


### మండలిలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటన



**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** ఉప్పల్ -నారాపల్లి ఫ్లైఓవర్ నిర్మాణాన్ని వచ్చే యేడాది జూన్ నాటికి పూర్తి చేసి ప్రజలకు అందు బాటు లోకి తెస్తామని మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల పురోగతిపై సభ్యులు తీన్మార్ మల్లన్న, పింగిలి శ్రీపాల్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి కోమటి రెడ్డి సమాధానం ఇచ్చారు. ఉప్పల్-నారపల్లి ఫ్లైఓవర్ పనులు 2017-18లో ప్రారంభమై అనేక సమస్యలతో నిలిచిపోయాయని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. కాంట్రాక్టర్ సంస్థ ఎన్‌సిఎల్‌టికి వెళ్లడంతో పనుల్లో జాప్యం జరిగిందని మధ్యలో మరో కంపెనీని తీసుకొచ్చి పనులు చేయించినా అది కూడా కొనసాగించలేకపోయిందన్నారు. ప్రస్తుతం గాయత్రి కన్‌స్ట్రక్షన్స్‌తో మాట్లాడి అదే సంస్థతో పనులు మళ్లీ వేగంగా చేయిస్తున్నామన్నారు. ఫ్లైఓవర్ కింద బిటి, కొత్త రోడ్డు పనులు కూడా పూర్తి చేశామని ప్రస్తుతం డే అండ్ నైట్ పనులు జరుగుతున్నాయన్నారు. దసరా నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, రెండు కంపెనీలను మార్చాల్సి రావడంతో ఆలస్యం జరిగిందన్నారు.ఇది సాధారణ ఫ్లైఓవర్ కాదని ఎలివేటెడ్ కారిడార్‌లోని భారీ ఫ్లైఓవర్ అన్నారు. ఉప్పల్-నారపల్లి హైవే ద్వారా భువనగిరి, బీబీనగర్ ఎయిమ్స్, జనగామ, వరంగల్ ప్రాంతాలకు రాకపోకలు సాగుతాయి. హైదరాబాద్ తర్వాత తెలంగాణలో అతిపెద్ద నగరమైన వరంగల్‌కు ఇది ప్రధాన రహదారి అన్నారు.గతంలో ఎంపీగా ఉన్న సమయంలో ఈ రహదారిపై ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూశానన్నారు. మూడు రోజుల క్రితం సంబంధిత సిఈ, నేషనల్ హైవేస్ అధికారులతో ప్రత్యేకంగా రివ్యూ చేశామన్నారు వచ్చే జూన్ నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.

# ఎమ్మెల్సీ తాతామధును వెంటనే అరెస్టు చేయాలి

### పిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కిగౌడ్



అసెంబ్లీలో స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కలిసిన మాజీ ఎంపి మధుయాష్కిగౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 10,ప్రభాతవార్త:** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను అసభ్యపదజాలంతో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు దూషించడం అత్యంత హేయమైనవని పిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్ ఆవేదన చెందారు.అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్‌పర్సన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ గురువారం అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాలు, స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో ప్రసాద్ కుమార్ కి తన సంఘీభావం తెలిపారు. మధు యాష్కి మాట్లాడుతూ ప్రసాద్ కుమార్ సౌమ్యుడు, అందరి పట్ల ఎంతో గౌరవమర్యాదలతో వ్యవ హరించే వారని కొనియాడారు. అసభ్య, అనుచిత పదాలతో దూషించడం ఎవరు నేర్పిన సంస్కృతి.? అని ప్రశ్నించారు. వారి తల్లిని కూడా ఉద్దేశించి దూషించడం దుర్మార్గమని, అహంకారంతో మాట్లాడాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుడైన స్పీకర్‌పై ఇంతటి వివక్ష, అసభ్య పదజాలం వాడు తారా? అని ప్రశ్నించారు. దళితులంటే కెసిఆర్ కు, ఆయన పరివారానికి మొదటి నుంచీ చిన్న చూపేనన్నారు. దళిత ముఖ్యమంత్రి అని మోసం చేసిండని, దళితుడిని ఉపముఖ్యమంత్రి గా నియమించి.. ఓర్వలేక తొలగించాడని ఆరోపించారు. దళితులు ఉన్నత స్థానంలో ఉంటే ఓర్వలేనితనం కెసిఆర్ ఆయన పరివారంది అన్నారు. ఒకప్పుడు కారంచేడు లాంటి దుర్మార్గలకు కారణమైన వారసుడే ఈ తాతా మధు అని అభివర్ణించారు. ఎంఎల్‌సి తాతా మధుపై వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేసి జైలుకు పంపలని డిమాండ్ చేశారు. అతని సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. స్పీకర్‌ని దూషించినందుకు కనీసం కెసిఆర్, ఆయన పార్టీ క్షమాపణ కూడా చెప్పక పోవడం దుర్మార్గమన్నారు. ఇది వారి అహంకారానికి నిదర్శనమన్నారు.

# అసెంబ్లీ గేటు వద్ద పోలీసులతో బిఆర్ఎస్ ఎమ్మెల్యేల గొడవ

### కెటిఆర్ పిఆర్‌ఓ, పిఎలపై సైఫాబాద్ పోలీసుస్టేషన్‌లో కేసు

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** అసెంబ్లీ గేటు వద్ద సోమవారం నాడు బిఆర్ఎస్ ఎంఎల్ఎలు పోలీసులతో గొడవ పడిన ఘటనకు సంబంధించి కెటిఆర్ పిఆర్‌ఓ, పిఎలపై సైఫాబాద్ పోలీసు స్టేషన్‌లో తాజాగా మరో కేసు నమోదయ్యింది. ఈ ఘటనపై ఇప్పటికే బిఆర్ఎస్ ఎంఎల్ఎలు కెటిఆర్, హరీష్ రావు, జగదీష్ రెడ్డి, సుధీర్ రెడ్డి, సబితా ఇంద్రా రెడ్డి, సునితా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మీ, గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి సంజయ్, విజయుడు, ఎంఎల్‌సి లు శంబీపూర్ రాజు, తాత మధు, నవీన్ రెడ్డిలతో పాటు ఇతర శాసనసభ్యులపై బిఎన్ఎస్ సెక్షన్ 121 (1), 132, 74, 79, 351, 352, 353, రెడ్‌విత్ 3 (5) కింద కేసులు నమోదవడం తెలిసిందే.
పోలీసుల విధులకు అడ్డు తగిలారనే అభియోగాపై ఈ కేసు నమోదు చేవారు. దీని తరువాత మహిళా కానిస్టేబుల్ చేసిన ఫిర్యాదు మేరకు కెటిఆర్, హరీష్ రావు, నవీన్ రెడ్డిలపై లైంగిక వేధింపులు, మహిళా పోలీసుల ఎదుట అసభ్య ప్రవర్తన కింద మరో కేసు నమోదయ్యింది. ఇక తాజాగా ఈ ఘటనలో కెటిఆర్ పిఆర్‌ఓ మహేష్‌తో పాటు పిఎ మహేందర్‌లు పాల్గొని పోలీసులపై దౌర్జన్యం చేసినట్లు నిర్ధారణ అవడంతో వీరిపై బిఎన్ఎస్ 132, 351 (2), రెడ్‌విత్ 3(5)బి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆ సమయంలో బందోబస్తులో వున్న సాయుధ బలగం ఎస్ఐ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమో దయ్యింది.


# మరో తొమ్మిది ఆస్పత్రుల్లో ఎంఆర్ఐ

## 8 హాస్పిటల్లలో సిటిస్కాన్ సేవలు

## అదనంగా 485 వెంటిలేటర్ల ఏర్పాటు

## వైద్య పరికరాల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థ

### మండలిలో మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి



**హైదరాబాద్, సెప్టెంబరు 10,ప్రభాతవార్త:** ప్రభుత్వ హాస్పిటళ్లలో ఎంఆర్ఐ, సీటీ స్కాన్ సేవలను మరింత విస్తరిస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. కొత్తగా 9 ఎంఆర్ఐ యంత్రాలు, 8 సీటీ స్కాన్ యంత్రాలను ప్రభుత్వ హాస్పిటళ్లలో ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అదనంగా 485 వెంటిలేటర్లను కూడా కొనుగోలు చేసి అవసరమైన హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గురువారం శాసన మండలిలో ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వ హాస్పిటల్స్‌లో 9 ఎంఆర్ఐలు, 50 సీటీ స్కాన్ యంత్రాలు, 1,770 వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం గాంధీ, ఉస్మానియా, నిమ్స్, వరంగల్ ఎంజీఎం, ఆదిలాబాద్ రిమ్స్, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్, ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్‌లో ఎంఆర్ఐ సేవలు అందుబాటులో ఉన్నాయని కొత్తగా నిజామాబాద్ జీజీహెచ్, సిద్దిపేట జీజీహెచ్, సూర్యాపేట జీజీహెచ్, నల్గొండ జీజీహెచ్, మహబూబ్‌నగర్ జీజీహెచ్, నీలోఫర్ తదితర హాస్పిటల్స్‌లో ఎంఆర్ఐ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నామని చెప్పారు. గాంధీ, ఉస్మానియా హాస్పిటళ్లలో మెరుగైన వైద్య సేవలు అందిస్తుండడంతో, అక్కడికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ అదనపు ఎంఆర్ఐ యంత్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొత్తంగా 9 అత్యాధునిక టెక్నాలజీతో కూడిన 3టెస్లా ఎంఆర్ఐ యంత్రాలను కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం 50 ప్రభుత్వ హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ సేవలు అందుబాటులో ఉన్నాయని,కొత్తగా మరో 8 హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ యంత్రాలను ఏర్పాటు చేయనున్నామని మంత్రి తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ప్రస్తుతం 1,770 వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన చోట అదనంగా 485 వెంటిలేటర్లను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. వైద్య పరికరాల కొనుగోలు, సరఫరా, నిర్వహణకు సంబంధించిన వివరాలను పర్యవేక్షించేందుకు ఈఉపకరణ్ అనే వెబ్ ఆధారిత పరికరాల జాబితా, నిర్వహణ వ్యవస్థను వినియోగిస్తున్నామని తెలిపారు. వైద్య పరికరాల పనితీరు, వర్కింగ్ కండీషన్, నిర్వహణ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు టీజీఎంఎస్ఐడీసీలో ప్రత్యేక ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ (పీఎంయూ) ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. పీఎంయూ ద్వారా పరికరాలను క్రమం తప్పకుండా ఆడిట్ చేసి, వాటి పనితీరు, వర్కింగ్ కండీషన్, నిర్వహణ పరిస్థితిని పర్యవేక్షిస్తూ, అవసరమైన సమయంలో సర్వీసింగ్, రిపేర్లు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రిపేర్లు తక్షణమే జరిగేలా. బయోమెడికల్ ఇంజనీర్లను నియమిస్తున్నామని మంత్రి తెలిపారు. 1,500 మందికి పైగా టెక్నీషియన్ల నియామకంవైద్య పరికరాలు నిరంతరం పనిచేయాలంటే శిక్షణ పొందిన టెక్నీషియన్లు కీలకమని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో గత రెండున్న రేళ్లలో 1,500 మందికి పైగా టెక్నీషియన్లను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించామని వెల్లడించారు.


# గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణ

## కేంద్ర అనుమతికై 11.57 లక్షల ఇళ్లు

## ఇందిరమ్మ ఇళ్లకు రూ.40 వేల కోట్ల ఖర్చు

### శాసనసభలో గృహనిర్మాణ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా చేయను న్నట్లు గృహ నిర్మాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 59 వేల గుడిసెలు ఉన్నాయన్నారు. అసెంబ్లీలో గృహ నిర్మాణంపై సభ్యులు బి మనోహర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మేడిపల్లి సత్యం, అక్బరు ద్దీన్ ఓవైసీ, కె వెంకట రమణారెడ్డి అడిగిన ప్రశ్నలకు జవాబిస్తూ ఆవాస్ యాప్ సర్వే ద్వారా గుర్తించిన 11,56,929 ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరినట్లు చెప్పారు. అయితే దీనికి ఇంకా ఆమోదం లభించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో రెండు దశల్లో ఎనిమిది లక్షల గృహాలను ఇప్పటికే మంజూరు చేయడం జరిగిందన్నారు. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.40 వేల కోట్ల మేర ఆర్థిక కేటాయింపులు చేసిందని వివరించారు. ఇందులో భాగంగా మొదటి దశ కింద రాష్ట్రంలో రూ.22,500 కోట్ల వ్యయంతో 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. రెండవ దశలో భాగంగా సుమారు రూ.11 వేల కోట్ల వ్యయంతో 2.5 లక్షల ఇళ్లను కవర్ చేయడం జరుగుతుందని వెల్లడించారు. అదేవిధంగా పట్టణ కేటాయింపునకు సంబంధించి లక్ష పట్టణ గృహాల కోసం మరో రూ.5,500 కోట్లు కేటాయించినట్లు తెలియచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇందిరమ్మ గృహ పథకం ఇంటికి రూ.5 లక్షలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణను పూరి గుడిసెల రహితంగా మార్చాలనే లక్ష్యంతో, ప్రతి ఇందిరమ్మ ఇంటికి ప్రభుత్వం నిధులు ఉచితంగా ఇస్తోందన్నారు. రెండవ దశ కింద పూరి గుడిసెల్లో నివసిస్తున్న సుమారు 59,000 కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. పైలట్ పద్ధతిలో, హైదరాబాద్‌లోని 20 నియోజకవర్గాల్లో, ఒక్కో నియోజకవర్గంలో 480 గృహ యూనిట్లతో ఇందిరమ్మ టవర్స్‌ను నిర్మించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు 16 నియోజకవర్గాల్లో లబ్ధిదారుల ఎంపిక పూర్తయిందని, ధృవీకరణ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. మార్కెట్ ధర రూ.310320 ఉండగా, 50 కేజీల సిమెంట్ బస్తాను రూ. 230కే నేరుగా గ్రామాలకు సరఫరా చేస్తామని, స్టీల్ విషయంలో కూడా ఇలాంటి చర్యలే ప్రణాళిక చేస్తున్నామని ఆయన ప్రకటించారు. అర్హులైన పేద లబ్ధిదారులకు అందుబాటులో ఉన్న ఇంటి స్థలాలను నెలలోగా కేటాయిస్తామని తెలిపారు. అలాగే అసంపూర్తిగా ఉన్న 2 బిహెచ్‌కె గృహ నిర్మాణ ప్రాజెక్టుల మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం రూ.600 కోట్లకు పైగా ఖర్చు చేసిందని తెలియచేశారు. అంతేకాకుండా గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన రూ.750 కోట్ల బకాయి బిల్లులను క్లియర్ చేసిందన్నారు.



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

# కనీస వేతనాల అమలులో దేశానికి రోల్‌మోడల్‌గా తెలంగాణ

## రాష్ట్ర విధానాన్ని ప్రశంసించిన ఐఎల్‌ఓ

## కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కార్పొరేషన్ ఏర్పాటుపై సర్కారు సానుకూలం

### సిర్పూర్ పేపర్‌మిల్లు సమస్యపై కోర్టు నిర్ణయం తర్వాతే చర్యలు: మంత్రి వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్, సెప్టెంబరు 10,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న కనీస వేతనాల విధానాన్ని అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రశంసించిందని శక్తి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. కనీస వేతనాల అమలులో దేశంలోని ఇతర రాష్ట్రాలకు తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందని చెప్పారు. కార్మికులకు న్యాయమైన వేతనాలు, మెరుగైన ఆర్థిక భద్రత కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్య మని, కార్మికుల సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. అసెంబ్లీలో మక్కాన్‌సింగ్, ఎం రంగారెడ్డి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. తెలం గాణలో వివిధ పరిశ్రమలు, సంస్థల్లో 1.10 కోట్లకు పైగా కార్మికులు పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. వారి ఆర్థిక పరిస్థితిని మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలను సవరించి అమలు చేస్తోందన్నారు. 2026 జూన్ 1 నుంచి సవరించిన కనీస వేతనాలు అమల్లోకి వచ్చినట్లు చెప్పారు. జీవో నంబర్ 6 ద్వారా వేతనాల సవరణ చేపట్టినట్లు వివరించారు. రామగుండం బి కేటగిరి అని అక్కడ అదే స్థాయిలో ఎన్‌టిపిసి సింగరేణి తదితర సంస్థల్లో కనీస వేతనాలు అమలు కావడం లేదన్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాకూర్ ప్రశ్నపై మంత్రి స్పందించారు. ఈ అంశంపై విచారణ చేయిస్తామని, నిబంధనల ప్రకారం కనీస వేతనాలు 100 శాతం అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కనీసవేతన చట్టం కారణంగా గ్రామపంచాయతీ వర్కర్ల వేతనాలు తగ్గినాయని కూనంనేని సాంబశివరావు ఆవేదన చెందగా స్పందించిన మంత్రి గ్రామ పంచాయతీల్లో కనీస వేతనాల అమలుపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తామని మంత్రి తెలిపారు. మున్సిపల్ కార్మికులకు ఇప్పటికే కనీస వేతనం కంటే ఎక్కువ వేతనం అందుతున్న చోట దాన్ని తగ్గించే అవకాశం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసే అంశంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి తెలిపారు. సభ్యుల సూచనల మేరకు త్వరలో సమావేశం నిర్వహించి కార్పొరేషన్ ఏర్పాటుపై చర్చిస్తామని చెప్పారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అహ్మద్ నదీమ్ చైర్మన్‌గా ఉన్న కమిటీ సిఫార్సుల ఆధారంగా తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు.సిర్పూర్ పేపర్ మిల్లులో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యపై మంత్రి స్పందించారు. ఈ అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని, కేసు పెండింగ్‌లో ఉన్నందున కోర్టు నిర్ణయం వచ్చే వరకు ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేని పరిస్థితి ఉందని తెలిపారు.

## గవర్నర్ శివప్రతాప్‌శుక్లాతో అడ్వొకేట్ జనరల్, పద్మశ్రీ అవార్డు గ్రహీతల భేటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** రాష్ట్ర అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్‌రెడ్డి గురువారం లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిశారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీత, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబొరేటరీ (డీఆర్‌డీఎల్) మాజీ శాస్త్రవేత్త డా. జి. చంద్రమౌళి గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ వారితో వివిధ అంశాలపై చర్చించారు.



## సిఎం రేవంత్‌రెడ్డికి గణపతి నవరాత్రి ఉత్సవాల ఆహ్వానం

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాలకు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఎమ్మెల్యే శ్రీగణేష్, సికింద్రాబాద్ శ్రీ గణేష్ దేవాలయ కమిటీ, అర్చకులు ఆహ్వానించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, డాక్టర్ సంజయ్ తదితరులు ఉన్నారు.

## మధుయాష్కీగౌడ్‌కు సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** :ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్ పర్సన్ గా నియమితులైన మధు యాష్కీ గౌడ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం సాయంత్రం అసెంబ్లీలో సిఎం రేవంత్‌రెడ్డిని మధుయాష్కీవచ్చి కలిశారు. మధు యాష్కీ గౌడ్‌కు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శుభాకాంక్షలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షలు సరిపోవట్లేదు

### రూ.15 లక్షలు కావాల్సి వస్తోంది: రాజగోపాల్‌రెడ్డి

### ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు కేటాయింపుపై స్పష్టత ఇవ్వండి: అక్బరుద్దీన్



**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** ప్రస్తుతం ఇల్లు నిర్మించడానికి అవసరం అయ్యే ఖర్చుతో పోలిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.5 లక్షల సాయం సరిపోవడం లేదని ఆయన సమస్యను లేవనెత్తారు. ఇంటి నిర్మాణానికి ఉపయోగించే సామగ్రి ధరలతోపాటు.. కూలీల ఖర్చులు కూడా భారీగా పెరిగిపోయిన నేపథ్యంలో ఒక్కో ఇంటికి సర్కార్ ఇచ్చే సాయాన్ని పెంచాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అర్హులైన పేదలకు రూ.5 లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తోందని గుర్తు చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి.. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఆ మొత్తంతో ఇల్లు పూర్తి చేయడం చాలా కష్టంగా మారిందని పేర్కొన్నారు. నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో ఇల్లు కట్టేందుకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతోందని వెల్లడించారు.

ఇంటి నిర్మాణంలో కూలీలు, మేస్త్రీల కోసమే రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతోందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వివరించారు. దీనికి సిమెంట్, ఇసుక, స్టీల్, ఇటుకలు, ఇతర నిర్మాణ సామగ్రి ఖర్చులు అదనంగా ఉంటాయని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనప్పటికీ కొంతమంది లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా నిర్మాణాన్ని ప్రారంభించలేకపోతున్నారని ఎమ్మెల్యే కోమటిరెడ్డి తెలిపారు. మరికొందరు ఇల్లు నిర్మించుకునేందుకు అవసరమైన డబ్బు సమకూర్చుకునే క్రమంలో బంగారాన్ని కుదువ పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. పేదలకు ఇల్లు నిర్మించుకోవడం భారంగా మారకుండా రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందించాలని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఒక్కో ఇంటికి ఇచ్చే మొత్తాన్ని పెంచే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల సంఖ్యను కొంత తగ్గించినా పర్వాలేదని.. కానీ ఆర్థిక సాయాన్ని మాత్రం పెంచాలని రాజగోపాల్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఉన్న నిర్మాణ వ్యయాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కొత్తగా బడ్జెట్‌ను సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన పేద కుటుంబాలకు ఇల్లు మంజూరైన తర్వాత కూడా డబ్బుల కొరత కారణంగా నిర్మాణం మధ్యలో ఆగిపోకుండా తగిన ఆర్థిక సహాయం అందించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఇదిలా ఉండగా.. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో సామాజిక వర్గాల వారీగా ఉన్న వాటాపై ఎంఐఎం ఎల్పీనేత అక్బరుద్దీన్ ఓవైసీ ప్రశ్నలు లేవనెత్తారు. గతంలో వైఎస్సార్ ప్రభుత్వం మైనార్టీలకు ప్రత్యేకంగా ఇళ్ల కేటాయింపునకు సంబంధించి జీవో ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెబుతోందని.. ఆ ఇళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎంత శాతం కేటాయిస్తున్నారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని అక్బరుద్దీన్ డిమాండ్ చేశారు.

# రిజర్వాయర్లపై తేలియాడే సౌరశక్తి ఉత్పాదక కేంద్రాల ఏర్పాటుకు కృషి

### 15వేల నుంచి 18,543 మెగావాట్లకు పెరిగిన విద్యుత్ డిమాండ్

### యేడాదికి రూ.19 వేల కోట్ల సబ్సిడీ: డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్,సెప్టెంబరు10,ప్రభాతవార్త:** రాష్ట్రంలో బుధవారం 19వేల మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకొందని ఇలా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని సౌర, జలాశయాల్లో తేలియాడే సౌరశక్తి ఉత్పాదక కేంద్రాల ఏర్పాటు, పవన తదితర సంప్రదాయేతర ఇంధన వనరులను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో తెలిపారు. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుపై విద్యుత్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నాయని అన్నారు. దీనిపై త్వరలో స్పష్టమైన ప్రకటన చేస్తామని ఆయన చెప్పారు. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులకు సంబంధించి గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉపముఖ్యమంత్రి సోదాహరణంగా చెప్పారు. రాష్ట్రంలోని ప్రధాన, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టుల రిజర్వాయర్లలో ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, పులిచింతల, శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల, కొమురంభీం, పాలేరు, వైరా, మల్లన్నసాగర్, ఎల్ఎండి, మిడ్‌మానేరు, పోచారం వంటి జలాశయాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద మెగావాట్‌కు రూ.కోటి వరకు సహాయం అందించే పథకాన్ని ప్రకటించినప్పటికీ సోలార్ విద్యుత్ కంటే జలాశయాల్లో తేలియాడే సౌరశక్తి ఏర్పాటు ఖర్చుతో కూడినదని తెలిపారు. గరిష్ఠ విద్యుత్ డిమాండ్ సుమారు 15 వేల మెగావాట్లు ఉండగా సెప్టెంబర్ 9 నాటికి అది 18,543 మెగావాట్లకు చేరిందని చెప్పారు. వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ.14 వేల కోట్ల సబ్సిడీ భరిస్తోందని ఉపముఖ్యమంత్రి భట్టి చెప్పారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం ద్వారా సుమారు 55 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కల్పిస్తున్నామన్నారు. దీనికి మరో రూ.5 వేల కోట్ల వరకు వ్యయం అవుతోందన్నారు. మొత్తంగా దాదాపు రూ.19 వేల కోట్లను ఏటా విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం వెచ్చిస్తోందని ఆయన సభకు తెలిపారు. భవిష్యత్తులో ఈ భారాన్ని తగ్గించుకుంటూనే ప్రజలకు ఉచిత విద్యుత్ అందించే విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం సోలార్ విద్యుత్, పంప్ స్టోరేజ్ వంటి ప్రత్యామ్నాయాలపై దృష్టి సారిస్తున్నామన్నారు. అమ్రాబాద్ గిరిజన ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని భట్టి విక్రమార్క వెల్లడించారు. సుమారు 80 గ్రామాలను పూర్తిగా సోలరైజ్ చేసి, అక్కడ మైక్రో గ్రిడ్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఇళ్లపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసి, మైక్రో గ్రిడ్ ద్వారా విద్యుత్ వినియోగించే విధానాన్ని అమలు చేయాలని యోచిస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో భూమి లేని నిరుపేద కుటుంబాలకు ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ కింద గతంలో పంపిణీ చేసిన సుమారు 6.70 లక్షల ఎకరాలను కూడా సౌర విద్యుత్ ప్రోత్సాహానికి వినియోగించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సాధ్యమైనంత మేరకు ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు రైతులు గృహవినియోగదారులు ముందుకు ఎమ్మెల్యేలు ప్రోత్సహించాలని ఉప ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.



## పంచాయతీ విద్యుత్ బిల్లులు మాఫీ చేయాలి

### మాజీ సర్పంచ్‌ల బకాయిలు చెల్లించాలి

### రాష్ట్రం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వడం లేదు

### అసెంబ్లీలో బిజెపి ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గ్రామ పంచాయితీలకు సంబంధించిన విద్యుత్ బిల్లులను పూర్తిగా మాఫీ చేయాలని పాల్వాయి హరీశ్‌బాబు విజ్ఞప్తి చేశారు. అలాగే మాజీ సర్పంచ్‌లకు ప్రభుత్వం నుంచి అందాల్సిన బకాయిలను కూడా చెల్లించాలని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం పంచాయతీ రాజ్ సవరణ బిల్లుపై మాట్లాడుతూ పంచాయితీల ఆర్థిక ఇబ్బందులు, మాజీ సర్పంచ్‌ల బకాయిలపై ప్రభుత్వం దృష్టికి కీలక సమస్యలను తీసుకు వచ్చారు. పంచాయితీల్లో పలు సమస్యలు ఉన్నాయని, కనీసం మౌలిక సదుపాయాలకు కూడా నిధులు లేని పరిస్థితి ఎదుర్కొంటున్నాయని వివరించారు. స్థానిక సంస్థల బలోపేతం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధుల సమస్యను పంచాయితీలు ఎదుర్కొంటున్నాయన్నారు. గ్రామ పంచాయితీలలో వీధి దీపాలు, తాగునీటి సరఫరా మోటార్ల వాడకం వల్ల దాదాపు 1,700 కోట్ల మేర పేరుకుపోయిన విద్యుత్ బిల్లుల భారాన్ని ప్రభుత్వం భరించి, వాటిని పూర్తిగా మాఫీ చేయాలని కోరారు. దీనివల్ల పంచాయితీలపై ఆర్థిక భారం తగ్గి, స్థానిక నిధులను గ్రామాల అభివృద్ధికి కేటాయించే అవకాశం కలుగుతుం దన్నారు. గతంలో గ్రామాల్లో సొంత నిధులు లేదా అప్పులు తెచ్చి మరీ వివిధ అభివృద్ధి పనులను (సిసి రోడ్లు, డ్రైనేజీలు, లైట్లు వంటివి) పూర్తి చేసిన మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన బిల్లుల బకాయిల కోసం రోడ్లుమీద పడుతున్నాని తెలిపారు. పంచాయతీలకు కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉందన్నారు. అలాగే రాష్ట్రం విడుదల చేయాల్సిన మ్యాచింగ్ గ్రాంట్లను కూడా ఇవ్వడం లేదని చెప్పారు. స్థానిక సంస్థలైన జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లకు ఎన్నికలు జరపకపోవడంతో కేంద్ర నిధులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. ఇక రాష్ట్రంలోని రైతు వేదికల నిర్వహణకు నిధులు లేక శిధిలావస్తలకు చేరుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయితీల్లోన మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు ఇవ్వాలని కోరారు.

## రికార్డు స్థాయికి విద్యుత్ డిమాండ్

### అత్యధికంగా 19,543 మెగావాట్ల వినియోగం

### ఇదే సమయంలో వ్యవసాయానికి కోతలు

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావం, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణలో విద్యుత్ రికార్డు స్థాయిలో డిమాండ్ ఏర్పడింది. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 10.41 గంటలకు 19,543 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. ఇది మార్చి 27న నమోదైన 19,506 మెగావాట్ల మునుపటి గరిష్ట స్థాయిని అధిగమించింది. గత సంవత్సరం అదే రోజున సెప్టెంబర్ 09, 2025) నమోదైన గరిష్ట డిమాండ్ 15,906 మెగావాట్లు కాగా, ఈ ఏడాది అది 23 శాతం పెరిగి 19,543 మెగావాట్లకు చేరుకుంది. అంతేకాకుండా, 2026 మార్చి 27న నమోదైన 19,506 మెగావాట్ల గత రికార్డును కేవలం ఆరు నెలల్లోనే అధిగమించడం విశేషం. ఇదే సమయంలో రాష్ట్రంలో విద్యుత్ సరఫరా విషయంలో విద్యుత్ పంపిణీ సంస్థలు కోతలు పెడుతున్నాయనే విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ఇందులో భాబంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వ్యవసాయ రంగానికి తరచూ విద్యుత్ కోతలు పెరుగుతుండటంతో ఇప్పటికే రైతాంగం నిరసనలు, ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తోంది. వర్షాభావ పరిస్థితులకు తోడు, గత కొన్ని రోజులుగా ప్రారంభమైన కరెంటు కోతలతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. రాష్ట్రంలోని నారాయణ్‌పేట్, సూర్యాపేట్, ఖమ్మం, సంగారెడ్డి తదితర జిల్లాల్లో రైతులు విద్యుత్ కోతలపై తీవ్ర నిరసనలు వ్యక్తం చేయగా, తాజాగా బుధవారం కామారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో రాస్తారోకో తదితర ఆందోళనలు చేశారు.

## మహిళల ఆసియాకప్‌లో ఫైనల్స్‌కు భారత్




**దుబాయి, సెప్టెంబరు 10:** మహిళల ఆసియా కప్‌లో భారత్ ఫైనల్‌కు చేరింది. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 40 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 149/6 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 109/7కే పరిమితమైంది. 149 పరుగుల లక్ష్యం భారత్ ఇన్నింగ్స్‌ను 149 పరుగుల వద్ద ముగించడంతో బంగ్లాదేశ్ ముందు పోరాడాల్సిన లక్ష్యం 150గా నిలిచింది. చేజింగ్‌లో భారత బౌలర్లు ప్రత్యర్థి బ్యాటర్లను స్వేచ్ఛగా పరుగులు చేయకుండా అడ్డుకున్నారు. చివరి వరకు వికెట్లు కోల్పోతూ సాగిన బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ విజయానికి అవసరమైన వేగాన్ని అందుకోలేకపోయింది. బంగ్లాదేశ్ తరపున ఎస్ అక్తేర్ 18 బంతుల్లో 22 పరుగులు చేసింది. ఆమె తర్వాత ఫాతిమా 14 బంతుల్లో 14 పరుగులతో ఔటైంది. అయితే మిగిలిన బ్యాటర్ల నుంచి లక్ష్యాన్ని అందుకునే స్థాయిలో పరుగులు రాకపోవడంతో బంగ్లాదేశ్ స్కోరు 109/7 వద్దే ఆగిపోయింది. భారత్ బౌలింగ్‌లో ఎన్ శర్మ రెండు ఓవర్లు వేసి కేవలం 10 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టింది. బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌లో వికెట్లు వరుసగా పడటంతో చివరి ఓవర్లలో భారీ పరుగులు సాధించే అవకాశం లేకుండా పోయింది. 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 109/7తో నిలిచింది. బంగ్లాదేశ్‌పై 40 పరుగుల విజయంతో భారత్ ఆదివారం సెప్టెంబర్ 13న జరిగే టైటిల్ పోరుకు బెర్త్ ఖరారు చేసుకుంది. మరోవైపు బంగ్లాదేశ్ 109/7తో ఇన్నింగ్స్ ముగించడంతో భారత జట్టు విజయాన్ని నమోదు చేసింది. 149/6 – 109/7 స్కోర్ల మధ్య వచ్చిన 40 పరుగుల తేడా మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించింది.



## హైదరాబాద్ ఆస్పత్రిలో జార్ఖండ్ సిఎం తల్లి

### సోరెన్‌ను పరామర్శించిన డిప్యూటీసిఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్,సెప్టెంబరు10,ప్రభాతవార్త:** అనారోగ్య సమస్యలతో హైదరాబాద్‌లోని ఎఐజి ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ తల్లి రూపిసొరేన్‌ను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం పరామర్శించారు. రూపి సొరేన్ మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని డాక్టర్లను మంత్రులు కోరడమే కాకుండా ఆమె ఆరోగ్య అంశాలపై వాకబు చేశారు. రూపి సొరెన్ ఆరోగ్య పరిస్థితిని హేమంత్ సొరేన్‌ను అడిగి తెలుకొన్నారు.

**మున్సిపాలిటీల్లో కోఆప్షన్ మెంబర్స్‌గా ట్రాన్స్‌జెండర్ల నియామకం**

**మున్సిపల్ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్‌బాబు**


మున్సిపాలిటీల చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్‌బాబు శాసనసభలో ప్రవేశపెట్టారు. మున్సిపాలిటీల్లో కో ఆప్షన్ మెంబర్‌గా ట్రాన్స్‌జెండర్‌ను నియమించేలా ప్రభుత్వం చట్టసవరణ చేసింది.

## వాక్కుల కోసం పోరాటమే ఐలమ్మకు నిజమైన నివాళి: మంత్రి పొన్నం

### పోరాటస్ఫూర్తిని యువత పుణికిపుచ్చుకోవాలి : మంత్రి వాకిటి శ్రీహరి

### ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ప్రముఖుల ఘననివాళులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, బహుజనుల హక్కుల కోసం నిరంతరం ధైర్యసాహసాలతో ఎదురొడ్డి పోరాడిన ధీరవనిత, మహనీయురాలు చాకలి ఐలమ్మ అన్న తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణాశాఖను మంత్రి పొన్నం ప్రభాకర్ అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడి న్యాయం చేయడమే ఐలమ్మకు మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పొన్నం ప్రభాకర్ మరో ముఖ్యఅతిథి మంత్రి వాకిటి శ్రీహరి, విశిష్ట అతిథులు ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు వి.హనుమంతరావు, బిసి కమిషన్ ఛైర్మన్ నిరంజన్, ఎమ్మెల్యే వి.శంకర్, డి.అజయ్‌కుమార్, బంగారి బాబు తదితరులతో కలిసి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించి ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతిదిశగా ముందుకు తీసుకువెళుతుందన్నారు. సామాజిక న్యాయం, బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఐలమ్మ సేవలను, పోరాట స్ఫూర్తిని గౌరవిస్తూ మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరుపెట్టామని గుర్తుచేశారు. ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. కేంద్రప్రభుత్వం చేపట్టిన జనగణనలో బిసిల జనాభా లెక్కలను తేల్చాల్సిన అవసరముందని పొన్నం అన్నారు.




ప్రసంగిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, వేదికపై మంత్రి వాకిటి శ్రీహరి, హనుమంతరావు తదితరులు

బిసిలకు జనాభా దామాషా ప్రకారం న్యాయం జరగాలంటే ఖచ్చితమైన గణాంకాలు అవసరమని స్పష్టం చేశారు. చాకలి ఐలమ్మవంటి మహనీయురాలి ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ప్రజాప్రభుత్వం ముందుకుపోతోందని మంత్రి పొన్నం తెలిపారు.

చాకలి ఐలమ్మ పోరాటస్ఫూర్తిని యువత పుణికిపుచ్చుకోవాలని మరో ముఖ్యఅతిథి మంత్రి వాకిటి శ్రీహరి హితవుపలికారు. చాకలి ఐలమ్మ బహుజనుల కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటం చేసిన గొప్ప నాయకురాలని కొనియాడారు. సామాజిక అన్యాయాన్ని, దోపిడీని, పెత్తందారీ వ్యవస్థను ఎదురించి పేదలు, బలహీనవర్గాల పక్షాన నిలిచి పోరాడిన ధీరవనిత ఐలమ్మన్నారు.

ఆమె చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, పోరాటపటిమను ఆదర్శంగా తీసుకుని సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతీఒక్కరూ కంకణం కట్టుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శంకర్, శ్రీనివాస్, శ్రీలక్ష్మి, అనిత, వెంకటప్పయ్య, మురళి, ఆంజనేయులు, గోపి, సంతోష్, అశోక్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ బందోబస్తు విధుల్లోని మహిళా కానిస్టేబుళ్లతో స్పీకర్ సమావేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** ఈనెల 7న అసెంబ్లీ బందోబస్తు విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుళ్లతో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో సమావేశం అయ్యారు. బీఆర్ఎస్ ఆందోళనలో మహిళా కానిస్టేబుళ్లు ఎదుర్కొన్న ఇబ్బందులపై ఆరా తీశారు. ఉద్యోగులు తమ విధులను సమర్థమంతంగా నిర్వహించారని స్పీకర్ ప్రశంసించారు. మహిళా సిబ్బంది మనోధైర్యం కోల్పోవద్దని సూచించారు.

## ఓటర్ల నమోదు పట్ల యువత ఉదాసీనతపై కాంగ్రెస్ ఆందోళన

### సర్ ప్రక్రియలో పార్టీ శ్రేణులు, యువజన విభాగాలు భాగస్వాములు కావాలి

### పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పరిశీలన ప్రక్రియలో ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో నూతన ఓటర్ల నమోదు శాతం ఆశించిన స్థాయిలో లేకపోవడం, నోటీసులకు ఓటర్ల స్పందన తక్కువగా ఉండటం పట్ల టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో ఎన్ఎస్‌యుఐ యువజన కాంగ్రెస్ నాయకులు ఓటు ప్రాధన్యతపై యువతను చైతన్య పరుచాలని హితవు చెఅప్పరు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు నూతన ఓటర్లుగా నమోదు చేసుకోవడంలో వెనుకబడి ఉండటమే కాకుండా, జాబితా పరిశీలనలో అధికారులు జారీ చేసిన నోటీసులకు సమయానికి స్పందించకపోవడం వల్ల వేలాది మంది అర్హులైన పౌరులు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించి, ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాలు మరియు శ్రేణులు యుద్ధ ప్రాతిపదికన ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తక్షణమే ఫారం6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలనీ ఆరుఎన్నికల కమిషన్ జారీ చేసిన సర్ నోటీసులపై తగిన ఆధారాలతో స్పందించి మీ ఓటును భద్రపరుచుకోవాలి. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకుండా చైతన్యవంతంగా వ్యవహరించాలి. ఎన్ఎస్‌యుఐ నాయకులు నాయకులు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల్లోని అన్ని కళాశాలలు, విశ్వ విద్యాలయాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి, విద్యార్థులను నూతన ఓటర్లుగా నమోదు చేయించాలనీ కోరారు.

## రాష్ట్రంలో కొత్త వ్యవసాయ కళాశాలలు

### ప్రమాణాలు పాటించని 6 కాలేజీల రద్దు

### స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలుగా పాలిటెక్నిక్‌లు

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** వ్యవసాయ విద్యకు పెరుగుతున్న అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో కొత్తగా కాలేజీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. శాసనసభలో గురువారం వ్యవసాయ కళాశాలపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ ఈ ఏడాది రాష్ట్రంలోని హుజూర్‌నగర్, డిచ్‌పల్లితో పాటు, వికారాబాద్ జిల్లాల్లో వ్యవసాయ కళాశాలలకు అనుమతులు మంజూరు చేసినట్లు చెప్పారు. గతంలో వ్యవసాయ విద్యలో సుమారు 1,100 సీట్ల సామర్థ్యం ఉండగా, ప్రస్తుతం దాన్ని 2 వేల సీట్లకు పెంచామని తెలిపారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మానవ వనరులను తయారు చేయడమే లక్ష్యంగా వ్యవసాయ కళాశాలలను ఆధునీకరిస్తామని వెల్లడించారు. వ్యవసాయ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు, ప్రయోగశాలలు, ప్రయోగాత్మక పొలాలు, బోధనా సిబ్బంది, పరిశోధనా సదుపాయాలను బలోపేతం చేస్తామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న కళాశాలలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, వాటికి అనుగుణంగా సిబ్బందిని నియమించి నాణ్యమైన, ఆధునిక వ్యవసాయ విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.



వ్యవసాయ విద్యలో నాణ్యతను పెంచేందుకు కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలోని 11 ప్రైవేట్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలను తనిఖీ చేయగా, ప్రమాణాలు పాటించని 6 కళాశాలల అనుబంధాన్ని రద్దు చేసినట్లు తెలిపారు.

మిగిలిన నాలుగు కళాశాలలను కూడా మానిటరింగ్ కమిటీ పర్యవేక్షిస్తోందన్నారు. మౌలిక వసతులు, ప్రయోగాత్మక పొలాలు, ప్రయోగశాలలు, బోధన సదుపాయాలు, అధ్యాపకులు, విద్యార్థుల వసతి తదితర అంశాల్లో నిర్దేశిత ప్రమాణాలను పాటించేలా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇంటర్నల్ మానిటరింగ్ కమిటీ, టెక్నికల్ ఇన్‌స్పెక్షన్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సులకు ప్రస్తుతం తగిన విద్యార్థుల డిమాండ్ లేదని వివరించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కళాశాలల్లో అధ్యాపకులు, మౌలిక వసతులు కల్పించాల్సి ఉన్నందున, ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించేలా కళాశాలలను పునర్వ్యవస్థీకరిస్తామన్నారు. ప్రభుత్వ ఆధీనంలోని నాలుగు పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలుగా ఆధునీకరించి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. ఆధునిక వ్యవసాయం కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయానికి కొత్త దిమారుతున్న వాతావరణ పరిస్థితులు, డిజిటల్ అగ్రికల్చర్, సాంకేతిక ఆవిష్కరణలకు అనుగుణంగా వ్యవసాయ విద్య, పరిశోధనను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని మొదటి ర్యాంకుకు తీసుకురావడమే లక్ష్యమన్నారు.

# 'బ్రిక్స్' సమ్మిట్‌కు అగ్రరాజ్యాల అధినేతలు




## రేపు, ఎల్లుండి అంతర్జాతీయ సదస్సు
## ఢిల్లీలో భారీగా భద్రతా ఏర్పాట్లు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 10:** దేశరాజధాని ఢిల్లీ నగరం బ్రిక్స్ సదస్సుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. 18వ బ్రిక్స్ సదస్సు ఢిల్లీలో సెప్టెంబరు 12, 13వ తేదీల్లో జరగనుంది. 11వ తేదీ నుంచే అతిథులు రానున్నారు. అక్కడి భారత్ మండపంలో జరగనున్న ఈ అంతర్జాతీయ సదస్సుకు రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ వంటి నేతలు హాజరవుతున్నారు. అందుకే భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. సదస్సు జరిగే ప్రాంతాలతోపాటు, అతిథులు బస చేసే హోటళ్ల వద్ద కనీవిని ఎరుగని భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 500 సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేశారు. తుగ్లక్‌రోడ్ పోలీస్ స్టేషన్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. 7,000 మంది భద్రతా సిబ్బందిని నియమించారు. వీరిలో ఢిల్లీ పోలీసులతోపాటు పారామిలిటరీ దళాలు, ఎన్ఎస్‌జీ, ఐబీ, ఇతర విభాగాలకు చెందిన సిబ్బంది పని చేస్తున్నారు. మరోవైపు అంతర్జాతీయ అతిథులు వస్తున్నందున ఢిల్లీ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సుందరీకరణ బాధ్యతలు చేపట్టారు. 15,000కుపైగా పూల మొక్కల్ని ఏర్పాటు చేశారు. బ్రిక్స్ సదస్సుకు ప్రధాని మోడీ నేతృత్వం వహిస్తారు. పుతిన్, జిన్‌పింగ్, పెజెష్కియాన్‌తోపాటు దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామ్‌ఫోసా వంటి నేతలు హాజరవుతున్నారు. బ్రెజిల్, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేసియా, ఇరాన్, సౌదీ అరేబియా, యుఎఇ వంటి 11 దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ఈ సదస్సులో బ్రిక్స్ సభ్య దేశాల మధ్య వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, భద్రత, సహకారం, రవాణా, సరఫరా, టెక్నాలజీ వంటి అంశాలపై చర్చలు, ఒప్పందాలు ఉంటాయి. ఇండియా ఈ సదస్సు నిర్వహిస్తుండటం ఇది నాలుగోసారి. గతంలో 2012, 2016, 2021లో బ్రిక్స్ సదస్సు నిర్వహించింది.

**బ్రిక్స్ సందర్భంగా మోడీ జిన్‌పింగ్ ద్వైపాక్షిక భేటీ**

ఐదేళ్లుగా దూరంగా ఉన్న భారత్‌చైనా సంబంధాల్లో కీలక పరిణామం చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరగనున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరిగే అవకాశముంది. అదే జరిగితే 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత ఇద్దరు నేతలు ముఖాముఖి చర్చలు జరపడం ఇదే తొలిసారి అవుతుంది. జిన్‌పింగ్ శనివారం భారత్‌కు రానున్నట్లు సమాచారం. ఏడేళ్ల తర్వాత ఆయన భారత్‌లో అడుగుపెట్టనున్నారు. ఇటీవల కిర్గిస్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో మోడీ, జిన్‌పింగ్ ఒకే వేదికపై కనిపించి కరచాలనం చేసుకున్నారు. అయితే అప్పుడు ద్వైపాక్షిక చర్చలు జరగలేదు. ఇప్పుడు బ్రిక్స్ వేదికగా భేటీజరిగితే ఇరుదేశాల సంబంధాలపై దానిప్రభావం కీలకంగాఉండొచ్చు. సరిహద్దు నుంచి వాణిజ్యం వరకు జిన్‌పింగ్ పర్యటనకు ముందు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చైనాలో ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. సరిహద్దు వ్యవహారాలపై డబ్ల్యూఎంసిసి సమావేశం తర్వాత ఇరుదేశాల ప్రత్యేక ప్రతినిధుల చర్చలు కూడా జరిగాయి. తాజా భేటీలో సరిహద్దు సమస్య, వాణిజ్యం, పెట్టుబడులు, భద్రత, ఎల్ఎసి వద్ద ఉద్రిక్తతలు మళ్లీ తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు చర్చకువచ్చే అవకాశంఉంది. లడఖ్‌లో ఉద్రిక్తతలు తగ్గినా సరిహద్దు వివాదం మాత్రం పరిష్కారం కాలేదు. ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్‌పై చైనా చేస్తున్న వాదనలను భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అరుణాచల్‌ప్రదేశ్ తమ భూభాగమని చైనా చెబుతుండగా భారత్ దాన్ని పూర్తిగా తిరస్కరిస్తోంది. ఇటీవల అప్పర్ సుబన్‌సిరి ప్రాంతంలో చైనా సైనిక కదలికలపై వచ్చిన నివేదికలు కూడా ఆందోళన పెంచాయి. ఇలాంటి పరిస్థితుల్లో మోడ, జిన్‌పింగ్ భేటీ జరిగితే సరిహద్దులో శాంతి, స్థిరత్వంపై భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసే అవకాశం ఉంది. అమెరికా సుంకాలు, పశ్చిమాసియాలో అస్థిరత నేపథ్యంలో ఇరుదేశాల మధ్య ఆర్థిక, దౌత్య సంబంధాలను ఎలా ముందుకు తీసుకెళ్లాలన్నది చర్చకు రావచ్చు.



# అమెరికన్లకు 'ట్రంప్ డివిడెండ్'

## 5వేల డాలర్ల చొప్పున ఇస్తామంటూ అమెరికా అధ్యక్షుని హామీ

**వాషింగ్టన్, సెప్టెంబరు 10:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచనల హామీ ఇచ్చారు. రిపబ్లికన్ పార్టీని గెలిపిస్తే ప్రతి వయోజన అమెరికన్‌కు 5000 డాలర్లు ఇస్తామని ప్రకటించారు. నవంబరులో జరిగే మధ్యంతర ఎన్నికల్లో.. రిపబ్లికన్ పార్టీ ప్రతినిధుల సభ, సెనేట్‌లో పూర్తి పట్టు సాధిస్తే ఈ పథకం అమలు చేస్తామని ట్రంప్ స్పష్టం చేశారు. డాలస్‌లో జరిగిన పార్టీ సమావేశంలో ట్రంప్ ఈ కీలక ప్రకటన చేశారు. ఈ మొత్తాన్ని 'ట్రంప్ డివిడెండ్'గా అభివర్ణించారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని.. దేశం సాధించిన విజయాల్లో ప్రజలకు వాటా కల్పించడమే ఈ పథకం ఉద్దేశమని చెప్పారు. అయితే ఈ నగదును అమెరికాలోనే ఖర్చు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఈ హామీ అమలుపై మాత్రం ఆయన పూర్తి వివరాలు వెల్లడించలేదు. డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది? ఎప్పుడు చెల్లిస్తారు? ఎవరు అర్హులు? అనే అంశాలపై స్పష్టం ఇవ్వలేదు. అమెరికాలో దాదాపు 24 నుంచి 27 కోట్ల మంది వయోజనులు ఉన్నట్లు అంచనా. అందరికీ 5000 డాలర్లు చెల్లిస్తే ప్రభుత్వ లోటు, ద్రవ్యోల్బణంపై ప్రభావం ఎలా ఉంటుందనే చర్చ మొదలైంది. ఎన్నికలకు ముందు ట్రంప్ ఇచ్చిన ఈ హామీపై అమెరికాలో రాజకీయంగా ఆసక్తి నెలకొంది. ఇంత భారీ మొత్తం ఇవ్వడంపై ఆర్థిక నిపుణులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. మధ్యంతర ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించేందుకే ట్రంప్ ఈ హామీ ఇచ్చినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# మధ్యంతర ఎన్నికల తర్వాతే ఇరాన్ యుద్ధానికి తెర!

**వాషింగ్టన్, సెప్టెంబరు 10:** అమెరికాలో మధ్యంతర ఎన్నికలు పూర్తయిన తర్వాతే ఇరాన్‌తో యుద్ధం ముగుస్తుందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. 100 డాలర్లకు చేరిన చమురు ధరలు కూడా అప్పుడే తగ్గుతాయని అంచనా వేశారు. హార్ముజ్ జలసంధిలో అమెరికా బలగాలు తమ పోరాటాన్ని ఉధృతం చేయడంతో.. టెహ్రాన్ ఇక ఎక్కువకాలం దాడులను తట్టుకోలేదని వ్యాఖ్యానించారు. తమ మధ్యంతర ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. హార్ముజ్ జలసంధిలో ఇరాన్ సరికొత్త నిబంధనలను ప్రకటించింది. అమెరికా మద్దతుతో జలసంధిలో అసురక్షిత మార్గంలో ప్రయాణిస్తోన్న నౌకలను ఆంక్షల జాబితాలో చేరుస్తామని వెల్లడించింది. ఈ క్రమంలోనే ఇటీవల యుఎస్ నౌకలు, 8 ట్యాంకర్లపైన ఐఆర్‌జిసి దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ట్రంప్ స్పందిస్తూ.. ఇరాన్‌పై విమర్శలు గుప్పించారు. మరోవైపు, అమెరికా కూడా టెహ్రాన్ నౌకలను లక్ష్యంగా చేసుకుంటోంది. దాంతో జోర్డాన్‌లోని యుఎస్ స్థావరంపై ఇరాన్ ప్రతిదాడులు చేసింది. ఈ ఘటనలతో హార్ముజ్‌లో నౌకల రవాణా మరోసారి ప్రమాదంలో పడింది. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు బ్యారెల్ ధర 100 డాలర్లు దాటింది. కాగా.. తాము ఇరాన్‌తో చర్చలు కోరుకోవడం లేదని, అయితే ఒప్పందం కుదుర్చుకునే అంశాన్ని మాత్రం పక్కనపెట్టలేదని ట్రంప్ వ్యాఖ్యానించడం గమనార్హం.

## హఠాత్తుగా తెరుచుకున్న ఎయిర్‌ఫోర్స్ వన్ స్లైడ్

### డొనాల్డ్ ట్రంప్ ప్రయాణించే విమానంలో సమస్య



**వాషింగ్టన్, సెప్టెంబరు 10:** ఖతార్ బహుమతిగా ఇచ్చిన కొత్త ఎయిర్‌ఫోర్స్‌వన్‌లో ఎమర్జెన్సీ స్లైడ్ అకస్మాత్తుగా తెరుచుకోవడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయాణం కాసేపు ఆలస్యమైంది. డలాస్‌లో జరగనున్న రిపబ్లికన్ పార్టీ మిడ్‌టర్మ్ సమావేశానికి హాజరయ్యేందుకు ట్రంప్ వైట్‌హౌస్ నుంచి 'మెరైన్ వన్' హెలికాప్టర్‌లో జాయింట్ బేస్ ఆండ్రూస్‌కు చేరుకున్నారు. ఆయన అక్కడ హెలికాప్టర్ దిగి ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం ఎక్కడానికి కొన్ని నిమిషాల ముందు.. విమానం ముందు భాగంలోని ఎమర్జెన్సీ స్లైడ్ హఠాత్తుగా తెరుచుకుంది. దీంతో ట్రంప్ సుమారు 15 నిమిషాల పాటు మెరైన్ వన్ హెలికాప్టర్‌లోనే వేచి ఉండాల్సి వచ్చింది. ఈ ఘటన ప్రమాదవశాత్తూ జరిగిందని సమాచారం. అనంతరం ఆయన అదే విమానంలో డలాస్ నగరానికి బయలుదేరి, అక్కడ సురక్షితంగా ల్యాండ్ అయ్యారు.




## ముఖగుర్తింపు ప్రక్రియ సులభతరంచేస్తున్న ఆధార్

**ముంబయి, సెప్టెంబరు 10:** ఆధార్ ఫేస్ అథెంటికేషన్ ప్రక్రియను మరింత సరళతరం చేసే దిశగా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ కీలక ముందడుగు వేసింది. ముంబైలో నిర్వహిస్తున్న గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026 వేదికగా "ఆధార్ ఫేస్ అథెంటికేషన్ ఎస్డీకే", "ఆధార్ ఫేస్ అథెంటికేషన్ శాండ్‌బాక్స్"లను అధికారికంగా ప్రారంభించింది. దీని ద్వారా వినియోగదారులు ఇతర అప్లికేషన్లలోకి మారాల్సిన అవసరం లేకుండానే, తాము వాడుతున్న యాప్‌లోనే నేరుగా ఫేస్ అథెంటికేషన్‌ను పూర్తి చేసే వెసులుబాటు కలుగుతుంది. ఈ నూతన సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కిట్ సాయంతో ప్రభుత్వవిభాగాలు, బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు తమ ఆండ్రాయిడ్, ఐఓఎస్ యాప్‌లలో నేరుగా యూఐడీఏఐ ఫేస్ అథెంటికేషన్ టెక్నాలజీని అనుసంధానించుకోవచ్చు. దీని ఫలితంగా గతంలోమాదిరిగా ఫేస్‌ఆర్‌డీ అనే ప్రత్యేక యాప్‌పై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. ఏఐ/ఎంఎల్ ఆధారిత లైవ్‌నెస్ డిటెక్షన్, యాంటీ స్పూఫింగ్ వంటి అత్యాధునిక భద్రతా ఫీచర్లు ఇందులో అంతర్భాగంగా ఉన్నాయి.

## ఉక్రెయిన్ అధ్యక్షుడికి తృటిలో తప్పిన 'డ్రోన్ ముప్పు'

**మాల్డోవా, సెప్టెంబరు 10:** ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్స్కీ ప్రయాణిస్తున్న విమానానికి పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. మాల్డోవా నుంచి ఆయన బయల్దేరడానికి సిద్ధమవుతున్న సమయంలో రష్యాకు చెందిన డ్రోన్ ఒకటి విమానాన్ని దాదాపు ఢీకొట్టినంత పనిచేసిందని నార్వే ప్రధాని జోనాస్ గహర్ స్టోర్ సంచలన విషయం వెల్లడించారు. ఈ ఘటనతో అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేగింది. నార్వే రాజు హెరాల్డ్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు జెలెన్స్కీ మంగళవారం మాల్డోవా నుంచి ఓస్లోకు బయలుదేరారు. అదేసమయంలో రెండు రష్యన్ డ్రోన్లు మాల్డోవా గగనతలంలోకి ప్రవేశించడంతో అధికారులు అప్రమత్తమ య్యారు. భద్రతా కారణాల దృష్ట్యా చిసినావు అంతర్జాతీయ విమానా శ్రయాన్ని తాత్కాలికంగా మూసివేసి, విమానాల రాకపోకలను నిలిపివేశారు. దీంతో జెలెన్స్కీ ప్రయాణం ఆలస్యమైంది. అయితే, జెలెన్స్కీ విమానానికి డ్రోన్ ఎంత సమీపంలోకి వచ్చిందనే దానిపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. విమానానికి డ్రోన్ దాదాపు తగిలిందని నార్వే ప్రధాని చెప్పగా, ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయానికి చెందిన మరో అధికారి మాత్రం ఈ ప్రచారంలో కొంత అతిశయోక్తి ఉందని వార్తా సంస్థకు తెలిపారు.

# ఎర్రకోట కాదు.. అసలు లక్ష్యం జైనమందిరం!

## ఎర్రకోట పేలుళ్ల కేసులో ఎన్ఐఎ ఛార్జిషీటు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 10:** దేశ రాజధాని ఢిల్లీని గత యేడాదిలో కుదిపేసిన ఎర్రకోట సమీపంలోని బాంబు పేలుడు ఘటనలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) సంచలన విషయాలను వెల్లడించింది. ఆ దాడిలో ఎర్రకోట అసలు లక్ష్యం కాదని, తీవ్రవాదులు మరొక ప్రదేశాన్ని టార్గెట్ చేశారని తన చార్జిషీట్‌లో పేర్కొంది. కేవలం ట్రాఫిక్ రద్దీ, కట్టుదిట్టమైన భద్రత కారణంగానే ఉగ్రవా దులు తమ ప్రణాళికను చివరి నిమిషంలో మార్చుకున్నారని తెలిపింది. 2025 నవంబర్ 10న జరిగిన ఈ ఘటనపై లోతైన దర్యాప్తు జరిపిన ఎన్ఐఎ, కీలక ఆధారాలను కోర్టుకు సమర్పించింది. దాని ప్రకారం, ఉగ్రవాదుల అసలులక్ష్యం చాందినీ చౌక్‌లోని ప్రసిద్ధ లాల్ మందిర్. పేలుడు పదార్థాలతో నింపిన వాహనాన్ని మొదట అక్కడికే తీసుకెళ్లారు. సాయంత్రం 6:37 గంటల సమయంలో వాహనం డ్రైవర్ లాల్ మందిర్ సమీపంలో వాహనాన్ని నిలిపేందుకు ప్రయత్నించినట్లు సిసి టివి ఫుటేజీలో స్పష్టంగారికార్డయింది. ఆసమయంలో ఆ ప్రాంతంలో విపరీతమైన రద్దీ ఉండటం, పోలీసుల భద్రత ఎక్కువగా ఉండటంతో వారి ప్లాన్ అమలు కాలేదు. అసలు లక్ష్యం వద్ద దాడి సాధ్యపడకపోవడంతో డ్రైవర్ వాహనాన్ని చారిత్రక ఎర్రకోట వైపు మళ్లించాడు. సుమారు 13 నిమిషాల తర్వాత సాయంత్రం 6:50 గంటలకు, ఎర్రకోట లోని గేట్ నంబర్ 4 సమీపంలో వాహనాన్ని పేల్చివేశాడు. ఈ భయానక ఆత్మాహుతి దాడిలో 11 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోగా, మరో 29 మంది తీవ్రంగా గాయపడ్డారు.

**డిఎన్ఎ ఆధారాలతో గుర్తింపు**

ఘటనాస్థలంలో లభించిన ఫోరెన్సిక్, డిఎన్ఎ ఆధారాలు ఈ కేసు దర్యాప్తులో కీలకంగామారాయి. ఈఆధారాలను విశ్లేషించడం ద్వారా వాహనంలో ఉన్న ఆత్మాహుతి దళ సభ్యుడిని గుర్తించినట్లు ఎన్ఐఎ తన చార్జిషీట్‌లో పొందుపరిచింది.

సిసి టివి ఫుటేజీ, శాస్త్రీయ ఆధారాలు ఈ ఉగ్రకుట్రను ఛేదించడంలో దర్యాప్తు సంస్థకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఈ చార్జిషీట్ ప్రస్తుతం కొనసాగు తున్న విస్తృత దర్యాప్తులో ఒక భాగం మాత్రమేనని, దాడి వెనుక ఉన్న పెద్ద కుట్రను ఛేదించేపనిలో ఉన్నామని అధికారులు తెలిపారు. ఈ ఘటన అనంతరం ఢిల్లీతోపాటు దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో భద్రతను గణనీయంగా కట్టుదిట్టం చేశారు.

# హద్దులు ఉండాల్సిందే!

## మైనర్ల సోషల్ మీడియా ఖాతాల నిర్వహణపై సుప్రీం వ్యాఖ్యలు

### కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు... విచారణ వాయిదా

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10:** మైనర్లు సోషల్ మీడియా ఖాతాలను నిర్వహించకుండా నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కేంద్రం స్పందనను సుప్రీంకోర్టు కోరింది. దీనికి పటిష్టమైన రక్షణ చర్యల ఆవశ్యకతను స్పష్టం చేసింది. మైనర్లు చట్టబద్ధంగా ఒప్పందాలు చేసుకోలేరు కాబట్టి, సోషల్ మీడియా ఖాతాలను సృష్టించడానికి అవసరమైన ఆన్‌లైన్ వినియోగదారు ఒప్పందాలను అంగీకరించడానికి వారిని అనుమతించకూడదని 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్' అనే ఎన్జీవో దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో వాదించారు. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, న్యాయ, కార్మిక మంత్రిత్వ శాఖలకు నోటీసులు జారీ చేసింది.

విచారణ సందర్భంగా, జస్టిస్ జయమల్య బాగ్చీ, జస్టిస్ వి మోహనలతో కూడిన ధర్మాసనం ముందు పిటిషనర్ తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది హెచ్.ఎస్. ఫుల్కా, అమెరికాలో 13 యేళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను ఉపయోగించకుండా నిషేధించారని తెలిపారు. ఈ వాదనలతో ఏకీభవించిన జస్టిస్ సూర్యకాంత్, "భారత్‌లోనూ ఇటువంటి రక్షణ చర్యలు అవసరం ఉంది" అని వ్యాఖ్యానించారు. ధర్మాసనంలోని మరో న్యాయమూర్తి జస్టిస్ బాగ్చి స్పందిస్తూ నియంత్రణ కోసం పటిష్ఠమైన 'ఫైర్‌వాల్స్' ఉండాలని అభిప్రాయపడ్డారు. మైనర్లు సోషల్ మీడియా ఖాతాలను ప్రారంభించడం వల్ల ఆన్‌లైన్ గ్రూమింగ్, లైంగిక వేధింపులు, సైబర్ బుల్లీయింగ్, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం వంటి ముప్పులను ఎదుర్కొంటున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. సోషల్ మీడియా సంస్థలు వయసు నిర్ధారణ కోసం పటిష్ఠమైన యంత్రాంగాన్ని అనుసరించేలా, మైనర్లు సొంతంగా ఖాతాలు తెరవకుండా నిరోధించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కాగా, తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఉండే ఖాతాల ద్వారా విద్యా సంబంధిత కంటెంట్‌ను వీక్షించేందుకు అనుమతించాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

# సంక్షిప్త వార్తలు

## జోర్డాన్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు



**అమ్మన్, సెప్టెంబరు 10:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. జోర్డాన్‌లోని అమెరికా వైమానిక స్థావరంపై బుధవారం రాత్రి ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడిలో పలు అమెరికా యుద్ధ విమానాలు ధ్వంసమైనట్లు సమాచారం. ఈ దాడిలో ఒక ఏ10 థండర్‌బోల్ట్ యుద్ధ విమానం ఎడమ రెక్క పూర్తిగా ధ్వంసమైందని, మరో ఎనిమిది ఎఫ్15 ఫైటర్ జెట్‌లు పాక్షికంగా దెబ్బతిన్నాయని సోషల్‌మీడియాలో ప్రచారంలోకి వచ్చింది.

## ఫిలిప్పీన్స్ పడవలో ఘోర అగ్నిప్రమాదం, ఐదుగురు మృతి

**మనీలా, సెప్టెంబరు 10:** ఫిలిప్పీన్స్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పలవాన్ ప్రావిన్స్‌లోని పర్యాటక కేంద్రం సమీపంలో 134 మందితో ప్రయాణిస్తున్న ఓ ప్యాసింజర్ ఫెర్రీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు మరణించగా, 87 మంది ఆచూకీ తెలియకుండా పోయిందని స్థానిక అధికారులు తెలిపారు. ఈ ఘటనలో 42 మందిని రక్షించినట్లు వివరించారు. వారిలో 38 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారని చెప్పారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

## బిజెపి కంచుకోటలో డికెఎస్ కేబినెట్ సమావేశం

**మంగళూరు, సెప్టెంబరు 10:** కర్ణాటక రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ముఖ్యమంత్రి డికె శివకుమార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, బిజెపికి కంచుకోటగా భావించే మంగళూరులో సెప్టెంబర్ 18న కేబినెట్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. దక్షిణ కన్నడ జిల్లాలో రాష్ట్ర మంత్రివర్గం సమావేశంకావడం చరిత్రలో ఇదే తొలిసారి. పరిపాలనాపరంగా కనిపిస్తున్న ఈ నిర్ణయం వెనుక, 2028 అసెంబ్లీ ఎన్నికలనుదృష్టిలో పెట్టుకుని బలమైనరాజకీయవ్యూహం దాగిఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## భారత్‌వద్ద 190 అణ్వాయుధాలు: అమెరికా సైంటిస్ట్స్ సమాఖ్య

**వాషింగ్టన్, సెప్టెంబరు 10:** భారత్ వద్ద సుమారు 190 అణ్వాయుధాలు ఉన్నట్లు అమెరికాకు చెందిన ఫెడరేషన్ ఆఫ్ అమెరికన్ సైంటిస్ట్స్ తన రిపోర్టులో పేర్కొన్నది. దీంట్లో అదనంగా కొత్త క్షిపణుల కోసం 30 వార్‌హెడ్స్ ఉన్నట్లు తెలిపింది. ప్రభుత్వ డేటా, కమర్షియల్ శాటిలైట్ ఇమేజ్‌లు, ఓపెన్ సోర్స్‌ల ద్వారా ఆ అంచనా వేసినట్లు ఎఫ్ఏఎస్ వెల్లడించింది. భారత్ వద్ద ఉన్న అణ్వస్త్ర సామర్థం, వ్యూహం ప్రకారం ఆ దేశం ఇప్పటికే 190 న్యూక్లియర్ వార్‌హెడ్స్ ఉత్పత్తి చేసినట్లు అంచనా వేస్తున్నామని ఎఫ్ఎఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హన్స్ క్రిస్టెన్‌సన్ తెలిపారు.

## ప్రపంచ ఆరోగ్యసంస్థ దక్షిణాసియా ప్రాంతీయ డైరెక్టర్ రాజీనామా



**ఢాకా, సెప్టెంబరు 10:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కుమార్తె, ప్రపంచ ఆరోగ్య సంస్థ దక్షిణాసియా ప్రాంతీయ డైరెక్టర్ సైమా వాజెద్ తన పదవికి రాజీనామా చేశారు. బుధవారం ఆమె తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. మోసం, అవకతవకలకు సంబంధించిన ఆరోపణలపై డబ్ల్యుహెచ్ఓ, బంగ్లాదేశ్ అధికారులు దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో వాజెద్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## అబూ సలేం పిటిషన్ కొట్టేసిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 10**: 1993 ముంబై వరుస పేలుళ్ల కేసులో యావజ్జీవ కారాగార శిక్ష పడిన గ్యాంగ్‌స్టర్ అబూ సలేం, ముందస్తు విడుదల కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. పోర్చుగల్‌కు భారతదేశం ఇచ్చిన అప్పగింత హామీల ప్రకారం విధించే 25యేళ్ల కారాగార శిక్ష పరిమితికి, విచారణ ఖైదీగాగడిపిన కాలాన్నికూడా పరిగణనలోకి తీసుకోవాలనివాదిస్తూ సలేం కోర్టును ఆశ్రయించారు. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పును వెలువరించింది.

# సిఎం విజయ్ 'బాడీలాంగ్వేజ్' వివాదం

## స్టాలిన్‌ను ఎద్దేవా చేశారంటూ మండిపడిన డిఎంకె

**చెన్నై, సెప్టెంబరు 10:** అసెంబ్లీలో సిఎం విజయ్ తన దవడను చేతితో పట్టుకున్న తీరు ఇప్పుడు తీవ్ర రాజకీయ వివాదానికి కారణమైంది. అది డిఎంకె అధినేత ఎంకే స్టాలిన్‌ను ఉద్దేశించి చేసిన ఎద్దేవా అంటూ ఆ పార్టీ నేతలు మండిపడ్డారు. విజయ్ మాత్రం తన బాడీ లాంగ్వేజ్ అనుకోకుండా అలా వచ్చిందని, ఎవరినీ వ్యక్తిగతంగా బాధపెట్టాలన్న ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. కానీ ఈ వివాదం వెనుక దాదాపు 50 యేళ్ల నాటి గాయం ఉంది. 1976లో అత్యవసర పరిస్థితి సమయంలో స్టాలిన్‌కు ఎదురైన ఘటన. ఈనెల 7న తమిళనాడు అసెంబ్లీలో విజయ్ డిఎంకేప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తూ తీవ్ర విమర్శలు చేశారు. పోలీసు శాఖకు సంబంధించిన గ్రాంట్లపై జరిగిన చర్చకు సమాధానమిస్తున్న సమయంలో ఆయన పలుమార్లు రాజకీయంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో తన దవడను ఒక చేత్తో పట్టుకుని పైకి లేపుతున్నట్లుగా ఓ హావభావం కనిపించింది. ఈ సైగ స్టాలిన్ దవడకు తగిలిన గాయాన్ని ఎద్దేవా చేసేలా ఉందని డిఎంకె నేతలు ఆరోపించారు. ఆ వెంటనే వివాదం ముదిరింది. విమర్శలు పెరగడంతో విజయ్ వివరణ ఇచ్చారు. అసెంబ్లీలో తన బాడీ లాంగ్వేజ్ అనుకోకుండా వచ్చిందని చెప్పారు. అది ఉద్దేశపూర్వకంగా చేసిన హావభావం కాదని స్పష్టం చేశారు. తన చర్యను ఎవరి వ్యక్తిగత భావాలను దెబ్బతీసే ప్రయత్నంగా చూడొద్దని కోరారు. అయితే అప్పటికే రాజకీయంగా నష్టం జరిగిపోయింది. డిఎంకెతో పాటు వామపక్ష నేతలు కూడా ఈ చర్యను తప్పుబట్టారు. 1975లో దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై తీవ్ర ఆంక్షలు విధించింది. 1976లో తమిళనాడులో కరుణానిధి నేతృత్వంలోని డిఎంకె ప్రభుత్వం రద్దయింది. అదే సమయంలో యువ డిఎంకే నాయకుడిగా ఉన్న స్టాలిన్‌ను అరెస్టు చేశారు. ఆయనను మీసా చట్టం కింద అదుపులోకి తీసుకుని మద్రాస్ జైలులో నిర్బంధించారు. మీసా అంటే మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్ట్. విచారణ లేకుండానే వ్యక్తులను నిర్బంధించే విస్తృత అధికారాలను ఈ చట్టం ప్రభుత్వానికి ఇచ్చింది. అత్యవసర పరిస్థితి సమయంలో రాజకీయ ప్రత్యర్థులపై దీన్ని విస్తృతంగా ఉపయోగించారు. స్టాలిన్ తన ఆత్మకథ ఉంగళిల్ ఒరువన్‌లో ఆ సమయం గురించి వివరించారు. జైలు పరిస్థితులు, అక్కడ జరిగిన హింసను ప్రస్తావించారు. స్టాలిన్ కూడా ఈ వివాదంపై నేరుగా స్పందించారు. విజయ్‌ను ఉద్దేశించి తమ్ముడు విజయ్ నువ్వు చేసిన సైగ నిజమే. పోలీసుల దాడిలో నా దవడ ఎముకలు విరిగాయి. ఆ దాడి గాయాల మచ్చలు ఇప్పటికీ నా శరీరంపై ఉన్నాయి. మీ స్థాయి ఏంటో గుర్తించి అందుకు తగ్గట్టుగా వ్యవహరించాలి. మీరు ప్రభుత్వాన్ని సినిమా షూటింగ్‌లా నడుపుతున్నారు. అసెంబ్లీని రీల్స్ చేసే ప్రదేశంగా మార్చారు. మేం నిర్మించిన వంతెనను కూడా ఫోటోషూట్‌కు ఉపయోగించుకున్నారు" అంటూ స్టాలిన్ తీవ్రంగా విమర్శించారు.

### విజయ్ సైగలపై స్పందించిన స్టాలిన్

**చెన్నై, సెప్టెంబరు 10:** తమిళనాడు శాసనసభ వేదికగా ఎమర్జెన్సీ కాలం నాటి మీసా చట్టం, తన అరెస్టుపై ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ చేసిన వ్యాఖ్యలు, ఆయన శారీరక అభినయంపై డిఎంకె అధినేత, మాజీ సిఎం ఎంకే స్టాలిన్ తీవ్రంగా స్పందించారు. శాసనసభను రీల్స్ చేసే స్థలంగా మార్చవద్దని, అనవసరమైన వివాదాలు రేపకుండా ముఖ్యమంత్రి పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడాలని ఆయన హితవు పలికారు. సభలో విజయ్ తన దవడపై చెయ్యి వేసి చూపించిన సైగపై స్పందిస్తూ జైలులో పోలీసులు జరిపిన దాడిలో తన దవడ ఎముక విరిగిపోవడం నిజమేనని, ఆ గాయాల మచ్చలు నేటికీ తన శరీరంపై ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 1976 జనవరి 31న నాటి కరుణానిధి ప్రభుత్వాన్ని కేంద్రం రద్దుచేసిన మరుక్షణమే, గోపాలాపురం ఇంట్లో ఉన్న తనను అరెస్టు చేసేందుకు పోలీసులు వచ్చారని స్టాలిన్ గుర్తుచేశారు. ఆ సమయంలో తాను ప్రచారంలో ఉండటంతో, "మా అబ్బాయి రేపు రాగానే నేనేస్వయంగా ఫోన్‌చేసి పిలుస్తానని కరుణానిధి పోలీసులకు చెప్పి, మరుసటి రోజు తనను జైలుకు పంపా రని తెలిపారు. రాజకీయాన్ని డైవర్ట్ చేయడానికి విజయ్ చరిత్రను తవ్వే ప్రయత్నం చేస్తున్నారని స్టాలిన్ విమర్శించారు. మీసా నిర్బంధంలో తనతో పాటు ఉన్న ఎంపీ చిట్టిబాబుజైలులోనే ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. ఈ త్యాగాలు డిఎంకె రక్తం, భావజాలంలో భాగమని, వాటిని ఎవరూ చెరిపివేయలేరని అన్నారు.

# వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

## - రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి
## - సంబంధిత అధికారులను ఆదేశించిన సిఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** 2026-27 వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 2026-27 వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 57.7 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, సుమారు 119.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు సీఎస్ తెలిపారు. ఇందులో సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు.

2026-27 వానాకాల ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సీఎస్ సంజయ్ జాజు గురువారం డా. బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. గత వానాకాలం సీజన్‌లో సుమారు 70 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి, 154.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సీఎస్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,283 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సీఎస్ వెల్లడించారు. ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పిఏసిఎస్), ఇతర కొనుగోలు ఏజెన్సీల సమన్వయంతో కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

అక్టోబర్ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం ప్రారంభమవుతుందని, నవంబర్‌లో పెద్దఎత్తున ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ధాన్యం రవాణా, హమాలీల ఏర్పాటు, గోదాములు, నిల్వ సామర్థం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించాలని సీఎస్ సూచించారు. రైతుల ఆధార్ వివరాలను చెల్లింపుల కోసం ఉపయోగించే బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేసే ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు, రవాణా, నిల్వ, చెల్లింపుల ప్రక్రియలో ఎక్కడా జాప్యం లేకుండా శాఖల మధ్య సమన్వయం ఉండాలని, రైతులకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డీ.ఎస్. చౌహాన్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



రామంతాపూర్ పాలిటెక్నిక్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థినిలను వారిస్తున్న ఎసిపి వెంకట్‌రెడ్డి, తదితరులు

# జిఒ నెం.97ను రద్దు చేయాలని పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా

## రోడ్డుపైకి వచ్చేందుకు యత్నం : అడ్డుకున్న పోలీసులు

**ఉప్పల్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 97ను రద్దు చేయడంతోపాటు పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి పరిధిలోకి తీసుకుని రావద్దని డిమాండ్ చేస్తూ రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక ఆందోళన గురువారం ఉద్రిక్తతకు దారి తీసింది. గత 20 రోజులకుపైగా తరగతులను బహిష్కరించి కళాశాల వద్ద నిరసన కొనసాగిస్తున్న విద్యార్థులు గురువారం తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతూ రోడ్లపైకి వచ్చేందుకు ప్రయత్నించారు. ఆందోళన తీవ్రతరం కావడంతో కళాశాల వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులు కళాశాల నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. ఎసిపి వెంకట్‌రెడ్డి, సిఐ వై.రామలింగారెడ్డి తదితరులు విద్యార్థులను అడ్డుకున్నారు. జీవో 97 ద్వారా పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి పరిధిలోకి తీసుకురావడాన్ని విద్యార్థులు వ్యతిరేకిస్తున్నారు. దీనివల్ల తమ విద్యా భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. శక్తి పరిధిలోకి వచ్చిన తర్వాత పాలిటెక్నిక్ విద్యా విధానంలో మార్పులు జరిగే అవకాశం ఉందని అభ్యంతరం తెలిపారు. స్కిల్ యూనివర్సిటీలో ప్రతిపాదించిన పీపీపీ విధానం వల్ల పాలిటెక్నిక్ కళాశాలల భూములను ప్రైవేటు అవసరాలకు వినియోగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే 42ఏ నిబంధనతో కరికులమ్లో మార్పులు చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ విద్యను ప్రస్తుత సాంకేతిక విద్యా విధానంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున ఈ సమావేశాల్లోనే ప్రభుత్వం జీవో 97పై స్పష్టత ఇవ్వాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. జీవో 97ను రద్దు చేసి, పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి పరిధిలోకి తీసుకురావద్దని అసెంబ్లీ వేదికగా స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ప్రభుత్వం జీవో 97ను రద్దు చేసే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని విద్యార్థులు స్పష్టం చేశారు. స్పందన లేకపోతే నిరసనలను మరింత ఉధృతం చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## అల్ప్రాజోలం, హైడ్రోక్లోరైడ్ అమ్మకాలతో భారీగా ఆస్తుల సంపాదన

### నిందితుల అరెస్టు దరిమిలా రూ.3.02 కోట్ల ఆస్తులు జప్తు చేసిన ఈగల్

**హైదరాబాద్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో డ్రగ్స్‌ను సమూలంగా నాశనం చేసేందుకు ఏర్పాటైన ఈగల్ విభాగం ఓవైపు మాదక ద్రవ్యాల స్మగ్లర్ల భరతం పడుతూనే కల్తీ కల్లు తయారీదారులు, ఇందుకు అవసరమైన అల్ప్రాజోలం, హైడ్రోక్లోరైడ్ స్మగ్లింగ్‌పై వరుస దాడులు చేస్తోంది. ఈ క్రమంలో అల్ప్రాజోలం, హైడ్రోక్లోరైడ్ అమ్మకాలు చేస్తున్న పలువురిని అరెస్టు చేయడంతో పాటు అక్రమంగా సంపాదించిన కోట్లా ది రూపాయల ఆస్తులను జప్తు చేసింది. తాజాగా మరో 3.02 కోట్ల రూపాయల ఆస్తులను జప్తు చేసింది. నిజామాబాద్‌కు చెందిన శ్రీనివాస్ గౌడ్ అనే వ్యక్తి ఏళ్ల తరబడి కల్తీ కల్లు వ్యాపారం చేస్తున్నాడు. ఇందుకోసం ఇతను రాజస్తాన్, మహారాష్ట్రల నుంచి అల్ప్రాజోలం, హైడ్రోక్లోరైడ్ ను కొంటూ వాటిని తెలంగాణలో కల్తీ కల్లు తయారీకి వాడుతున్నాడు. దీంతో పాటు ఉమ్మడి నిజామాబాద్, మహబూబ్‌నగర్ సహ పలు జి ల్లాలలో కల్తీ కల్లు వ్యాపారులకు అల్ప్రాజోలం, హైడ్రోక్లోరైడ్‌ను అమ్మేవాడు. ఇతనిపై నిఘా వుంచిన పోలీసులు పలుమార్లు అరెస్టు చేసి జైలు కు పంపారు. ఇతని అనుచరులు, బంధువులు కూడా అరెస్టయ్యారు. దీనికి సంబంధించిన కేసులు ఆయా కోర్టులో సాగుతున్నాయి. అనంతరం శ్రీనివాస్ గౌడ్ గోల్‌మాల్ వ్యవహారాలను రట్టు చేసేందుకు ఈగల్ పోలీసులు రంగంలో దిగి అక్రమాస్తులను వెలికితీశారు. ఇందులో 4.20 ఎ కరాల వ్యవసాయ భూమి, 667.15 చదరపు గజాల ప్లాట్, ఒక ఇల్లు, నాలుగు వాహనాలు వున్నాయి. ఈ ఆస్తులు శ్రీనివాస్ గౌడ్‌తో పాటు అతని బంధువుల పేరిట వున్నాయి. వీటిని ఈగల్ పోలీసులు తాజాగా జప్తు చేశారు. దీంతో పాటు రాజస్తాన్‌కు చెందిన బడా స్మగ్లర్ రతన్ సి ంగ్‌తో ఇతనికివున్న నెట్‌వర్క్‌ను ఛేదించారు. దీనిపై చెన్నైలోని ఎన్‌సిబి అధికారులకు సమాచారం అందించారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల స్మ గ్లర్ల ఆస్తులు జప్తు చేయడం ఇటీవల కాలంలో పెరగడం గమనార్హం. రాష్ట్రంలో డ్రగ్స్‌తో పాటు కల్తీ కల్లు తయారీదారుల గురించి సమాచారం వుంటే వెంటనే 1908 లేదా 87126 71111కు ఫిర్యాదు చేయాలని ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా కోరారు.

# నూనెగింజల ఉత్పాదకత పెంచే చర్యలు

## - జాతీయ కన్సల్టెన్సీ అండ్ ఇండస్ట్రీ ఇంటర్‌ఫేస్ మీట్



**అత్తాపూర్ సెప్టెంబరు10 ప్రభాతవార్త :** నూనెగింజల పంటల ఉత్పాదకతను పెంచేందుకు అభివృద్ధి చేసిన ఆధునిక సాంకేతికతల బదలాయింపు, వాణిజ్యీకరణను వేగవంతం చేయడంతో పాటు పరిశోధనా సంస్థలు-పరిశ్రమల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా గురువారం రాజేంద్రనగర్‌లో జాతీయ కన్సల్టెన్సీ అండ్ ఇండస్ట్రీ ఇంటర్‌ఫేస్ మీట్ నిర్వహించారు. ఐసిఏఆర్-భారతీయ నూనెగింజల పరిశోధనా సంస్థ (ఐఐఓఆర్) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సంస్థ డైరెక్టర్ డా. ఆర్.కె. మాథుర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ప్రముఖ విత్తన సంస్థలు, బయోలాజికల్స్, బయోఫర్టిలైజర్ కంపెనీలు, వ్యవసాయ రంగ సంస్థల ప్రతినిధులతో పాటు ఎఫ్‌పీవోలు, ఎఫ్‌పీసీలు, స్టార్టప్‌లు, రైతు సంస్థలు, అనుబంధ రంగాల ప్రతినిధులు కలిపి సుమారు 150 మంది పాల్గొన్నారు. పరిశోధకులు-పరిశ్రమలు-రైతు సంస్థల మధ్య పరస్పర చర్చలకు ఈ సమావేశం వేదికగా నిలిచింది. కార్యక్రమానికి ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గౌరవ ఉపకులపతి డా. పి.వి. సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహా సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా. దిలీప్ స్వామి, ఐఏఎస్ ప్రత్యేక అతిథిగా పాల్గొని తన అనుభవాలను పంచుకున్నారు. డా. ఎస్.కె. రావు, డా. ప్రవీణ్ మాలిక్, డా. ధీరేంద్ర కుమార్ రాయ్, డా. వై. సతీష్, డా. ఎ. కిరణ్ కుమార్, డా. జాన్ పీటర్, డా. జి.ఎన్.వి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఐఓఆర్ అభివృద్ధి చేసిన వివిధ నూనెగింజల పంటల రకాలు, హైబ్రిడ్లు, ఉత్పాదకత పెంపు సాంకేతికతలను పరిశ్రమ ప్రతినిధులకు పరిచయం చేశారు. ముఖ్యంగా బయోపాలిమర్ల ఆధారంగా అభివృద్ధి చేసిన స్మార్ట్ సీడ్ ఎన్‌హాన్స్‌మెంట్ టెక్నాలజీపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సాంకేతికత విత్తన నాణ్యతను మెరుగుపరచడంతో పాటు పంటల పనితీరు, దిగుబడిని పెంచే సామర్థ్యం కలిగి ఉందని వివరించారు. నూనెగింజల ఉత్పత్తి, ఆవిష్కరణలకు విశేషంగా కృషి చేస్తున్న రైతులు, ఎఫ్‌పీవోలు, ఎఫ్‌పీసీలు, వివిధ సంస్థల ప్రతినిధులను ఈ సందర్భంగా సన్మానించారు. అలాగే పరిశ్రమ భాగస్వాములతో బిటి-1 సాంకేతికత, కుసుమ రకం ఐఎస్ఎఫ్-764 విత్తనోత్పత్తికి సంబంధించిన లైసెన్సింగ్ ప్రక్రియను చేపట్టారు.

నూనె ప్రాసెసింగ్, బ్లెండింగ్, బయో ఆధారిత పంట సంరక్షణ సాంకేతికతలపై భవిష్యత్ ఇంక్యుబేషన్ భాగస్వామ్యాల కోసం పలు సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ఐఐఓఆర్లో అభివృద్ధి చేసిన నూతన సాంకేతికతలు, ఉత్పత్తులతో పాటు సంస్థలో ఇంక్యుబేట్ అయిన స్టార్టప్‌లు రూపొందించిన ఉత్పత్తులతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. పరిశ్రమ ప్రతినిధులు వాటి వాణిజ్య అవకాశాలను పరిశీలించారు.

# ఆర్టీఐ అమలులో ఏకరూపత అవసరం

## గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



సదస్సులో మాట్లాడుతున్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 10, ప్రభాతవార్త:** సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) అమలులో దేశవ్యాప్తంగా మరింత ఏకరూపత, పారదర్శకత, సామర్థం తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల అన్నారు. హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఏఎస్‌సీఐ)లో ఆర్టీఐ అమలు విధానాల్లో ఏకరూపత-సవాళ్లు, పరిష్కారాలు అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. తెలంగాణ సమాచార కమిషన్ ఆధ్వర్యంలో, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్స్ ఇన్ ఇండియా సహకారంతో ఈ సదస్సు జరుగుతోంది. సుమారు 20 రాష్ట్రాల సమాచార కమిషనర్లు ఇందులో పాల్గొన్నారు. ఆర్టీఐ దరఖాస్తులు, అప్పీళ్లు, ఫిర్యాదుల పరిష్కారంలో ఉత్తమ విధానాలను అనుసరించడం, పెండింగ్ కేసులను తగ్గించడం, విచారణను వేగవంతం చేయడం వంటి అంశాలపై సదస్సులో చర్చించారు. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం ప్రభుత్వ శాఖలు సమాచారాన్ని ముందస్తుగా ప్రజలకు అందుబాటులో ఉంచే విధానాన్ని మరింత బలోపేతం చేయాలని గవర్నర్ సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని, పౌరులకు సమాచారాన్ని సులభంగా అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం, సుపరిపాలనను బలోపేతం చేయడంలో ఆర్టీఐ కీలకమన్నారు. అన్ని దరఖాస్తులు, అప్పీళ్లు, ఫిర్యాదులను ఒకే విధానంలో యాంత్రికంగా పరిష్కరించకుండా వాటి ప్రత్యేక పరిస్థితులు, వాస్తవాలు, చట్టపరమైన నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరంపైనా సదస్సులో చర్చించారు. పీఐఓలు, ప్రథమ అప్పీలేట్ అధికారులకు శిక్షణ, సామర్థ్య పెంపు, సమాచార కమిషన్ల స్వతంత్రత, సమర్థతను పెంచడం వంటి అంశాలపైనా నిపుణులు అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సమాచార కమిషన్ న్యూస్‌లెటర్ తెలంగాణ ట్రాన్స్‌పరెంట్ టైమ్స్-సమాచార దర్పణంను గవర్నర్ ఆవిష్కరించారు.

# మిల్లర్లపై భారం రైతుల పాలిట శాపం

## ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ కుమార్ - నిబంధనల సవరణకే మహా ధర్నా - నిబంధనలు క్షేత్రస్థాయి వాస్తవాలకు అనుగుణంగా ఉండాలని వినతులు

**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాతవార్త సెప్టెంబర్ 10:** ప్రభుత్వ నిబంధనల భారాన్ని మిల్లర్లపై మోపి, చివరకు దాని ప్రభావాన్ని రైతుపై పడేలా చేయొద్దని ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ కుమార్ అన్నారు. మిల్లింగ్ రికవరీ, తరుగుదల, నాన్ ఎఫ్ఏక్యూ ధాన్యం, సీఎంఆర్ బియ్యం స్వీకరణలో జాప్యం వంటి అంశాలపై క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ములుగు జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రైతు నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు చేరిన తర్వాత మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి సీఎంఆర్ బియ్యం అందించే ప్రక్రియలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం రైతు ప్రయోజనాలను కాపాడేలా నిర్ణయాలు తీసుకోవడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, అయితే క్షేత్రస్థాయిలో సాధ్యంకాని నిబంధనలను అమలు చేయడం వల్ల మిల్లర్లు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతోందని చెప్పారు.

**రికవరీపై వాస్తవాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి**

ధాన్యం రకం, తేమ శాతం, నాణ్యత, విరిగిన గింజలు, మలినాలు తదితర అంశాలు మిల్లింగ్ రికవరీపై ప్రభావం చూపుతాయని తెలిపారు. వీటిని పరిగణనలోకి తీసుకోకుండా నిర్దిష్ట శాతంలో బియ్యం ఇవ్వాలని నిబంధనలు విధిస్తే లోటును మిల్లరే భరించాల్సి వస్తుందని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన రికవరీ, మిల్లులకు వాస్తవంగా లభించే రికవరీ మధ్య వ్యత్యాసంపై శాస్త్రీయ అధ్యయనం చేయాలని కోరారు. 15-20 శాతం తరుగుదల విషయంలోనూ క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలన్నారు. "కాగితంపై ఉన్న లెక్కలతో మిల్లింగ్ జరగదు.. మిల్లులో ఉన్న ధాన్యంతోనే మిల్లింగ్ జరుగుతుంది" అని వ్యాఖ్యానించారు.

**నాన్‌ఎఫ్ఏక్యూ ధాన్యంతోనే మిల్లర్లకు అదనపు ఆర్థిక భారం**

నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు సరిపోని నాన్ ఎఫ్ఏక్యూ ధాన్యం మిల్లులకు వచ్చినప్పుడు అదనపు నష్టం వస్తోందని ప్రవీణ్ కుమార్ తెలిపారు. తమ సంఘం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన లెక్కల ప్రకారం క్వింటాలుకు సుమారు రూ.750 నుంచి రూ.1,000 వరకు ఆర్థిక భారం పడుతున్న పరిస్థితి ఉందన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలోనే నాణ్యతను నిర్ధారించాలని, కొనుగోలు దశలో నాణ్యత పరిశీలించకుండా మిల్లుకు వచ్చిన తర్వాత మొత్తం బాధ్యతను మిల్లర్‌పై వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేని ధాన్యాన్ని రాజకీయ ఒత్తిళ్లతో కొనుగోలు చేయాల్సి వస్తే దాని భారం మిల్లర్‌పై పడకూడదన్నారు.

**సిఎంఆర్ స్వీకరణలో జాప్యంతో నష్టాల ముంగిట మిల్లర్లు**

మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సీఎంఆర్ బియ్యాన్ని సిద్ధం చేసినా, అధికారులు సకాలంలో స్వీకరించకపోతే అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు.

మిల్లుల్లో నిల్వ స్థలం ఆక్రమించడంతో పాటు కూలీలు, విద్యుత్, నిర్వహణ, వడ్డీ ఖర్చులు పెరుగుతున్నాయని తెలిపారు. కొత్త సీజన్ ధాన్యం మిల్లులకు వస్తున్న సమయంలో పాత సీఎంఆర్ బియ్యం మిల్లుల్లోనే ఉంటే కొత్త ధాన్యాన్ని ఎక్కడ నిల్వ చేయాలన్నది సమస్యగా మారుతోందన్నారు. మిల్లర్ తన బాధ్యతను పూర్తి చేసి బియ్యం సిద్ధం చేసినట్లే, సంబంధిత ప్రభుత్వ విభాగాలు కూడా తమ బాధ్యతను సకాలంలో పూర్తి చేయాలని కోరారు.

# మూసీ నదిని కాంక్రీట్ కారిడార్‌గా మార్చొద్దు

## మూసీ జన ఆందోళనలో వక్తల డిమాండ్ - కరపత్రాలను ఆవిష్కరించిన నేతలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

**ముషీరాబాద్, సెప్టెంబర్ 10, ప్రభాత వార్త:** మూసీ నదిని కాంక్రీట్ కారిడార్ గా మార్చవద్దని, స్వేచ్ఛగా ప్రవహించే కాలుష్యరహితమైన సజీవ నదిగా మార్చాలని పలువురు సామాజిక వేత్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో మూసీ జన ఆందోళన పేరుతో మూసీ పునరుజ్జీవం పేరిట విధ్వంసమా? అంటూ నదిని కాపాడుకుందాం- ప్రజా హక్కులను రక్షించుకుందాం అనే అంశంపై కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్, సామాజిక వేత్త సజయ, హెచ్‌ఆర్ఎఫ్ జీవన్, పీఓడబ్ల్యూ సంధ్య, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సీనియర్ ఎడిటర్ కే.శ్రీనివాస్ తదితరులు పాల్గొని మూసీ ప్రక్షాళన గురించి ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాలుష్యంతో నిండిపోయిన మూసీ నదిని సమూలంగా శుభ్రం చేయటానికి తల పెట్టిన మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు, మూసీ పునరుద్ధరణకు కాకుండా మూసీ విధ్వంసకర ప్రాజెక్టుగా గోచరిస్తోందని ఆరోపించారు. మూసీ నదిని శుభ్రం చేయకుండా, దానిలోకి వచ్చే కాలుష్యాన్ని ఆపకుండా, నదికి ఇరువైపులా కాంక్రీటు రోడ్ల నిర్మాణాలు, పార్కులు, ఉల్లాసం కలిగించే నిర్మాణాలు చేసి, 19 కిలో మీటర్ల నదీ తీరాన్ని కాంక్రీటుమయం చేయబోతున్నారని, దీనివల్ల 1200 మంది కుటుంబాలు తమ ఇళ్లను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ నదిని ప్రయోజన కరంగా శుద్ధి చేయాలని, పరిశ్రమల విష వ్యర్థాలు నదిలో కలవకుండా ఈటీపీలను కఠినంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. 1997 నుంచి మూసీ పునర్ధరణ పేరుతో ఖర్చు చేసిన వేల కోట్ల ప్రజా ధనంపై పారదర్శక ప్రజా ఆడిట్ జరపాలని విజ్ఞప్తి చేశారు.





# ఎన్నికలకు సిద్ధం అవుతున్న అఖిలేష్, రాహుల్

**లక్నో, సెప్టెంబరు 10:** ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు మరికొన్ని నెలలు మాత్రమే సమయం ఉన్న నేపథ్యంలో పార్టీలు తమ రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఇదిలా ఉంటే, సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకంపై పంచాయతీ నెలకొంది. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో కలిసి పోటీ చేసిన ఈ రెండు పార్టీలు, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కలిపి పోటీ చేసేందుకు సిద్ధమయ్యాయి. సీట్ల సంఖ్య ప్రతిష్టంభన నెలకొంది. ఇదే కాకుండా రాయ్ బరేలీ, అమేథీ ప్రాంతాల్లో ఎవరు ఎన్ని స్థానాలు పంచుకోవాలనే దానిపై సస్పెన్స్ నెలకొంది. ఎస్పీ కాంగ్రెస్‌కు 86 అసెంబ్లీ స్థానాలు ఇవ్వాలని భావిస్తోంది. 2024లో కాంగ్రెస్ గెలిచిన 6 లోక్‌సభ నియోజకవర్గాలను ఆధారంగా చేసుకుని, అసెంబ్లీ స్థానాలను కేటాయించాలని ఎస్పీ భావిస్తోంది. మరోవైపు, కాంగ్రెస్ మాత్రం తమకు 105-115 సీట్ల మధ్య కావాలని కోరుతోంది. కొన్ని నివేదికల ప్రకారం, కాంగ్రెస్ ఏకంగా 120 సీట్ల వరకు డిమాండ్ చేస్తుందని తెలుస్తోంది. 2017 ఎస్పీ, కాంగ్రెస్ మధ్య కుదిరిన పొత్తులో 105 సీట్లు దక్కాయి. రెండు పార్టీల డిమాండ్ల మధ్య 20 30 సీట్ల వ్యత్యాసం కనిపిస్తోంది. రెండు పార్టీల మధ్య రాయ్‌బరేలీ, అమేథీ ప్రాంతాలు సమస్యకు కారణమవుతున్నాయి. ఈ ప్రాంతాలను తమ కంచుకోటలుగా కాంగ్రెస్ భావిస్తోంది. మరోవైపు, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ జిల్లాల్లోని ఎమ్మెల్యే స్థానాలను గెలిచిన ఎస్పీ, ఆ ప్రాంతాలను వదులు కోవడానికి సిద్ధంగా లేదని సమాచారం. రాయ్‌బరేలీ జిల్లాలో గౌరిగంజ్, అమేథీ అసెంబ్లీ స్థానాలు తమకు దక్కాలని ఎస్పీ భావిస్తోంది.

# సిఎం, మంత్రుల మీదే కేసు పెట్టాలి

## ఈ పరిణామాలు అన్నింటికి రేవంత్ రెడ్డి కారణం - మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**జడ్చర్ల, సెప్టెంబరు 10, ప్రభాతవార్త :** గత రెండు మూడు రోజులుగా అసెంబ్లీ వద్ద బిఆర్ఎస్ నేతలపై పోలీసుల తీరు, తదుపరి జరుగు తున్న పరిణామాలు అన్నిటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కారణం అని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ధ్వజమెత్తారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో శ్వేతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత క్యాన్సర్ చికిత్స శిబిరం వద్ద మీడియాతో ఆయన మాటా ్లడారు. కేటీఆర్ హరీష్ రావులపై లైంగిక వేధింపుల కేసు అంశంపై ఆయన తీవ్రంగా స్పందించి మండిపడ్డారు. అసెంబ్లీ వద్ద రాష్ట్ర ప్రభుత్వం దురుద్దేశంతోనే కావాలనే మహిళ ప్రజా ప్రతినిధుల వద్ద మగ పోలీసులను, మగ ప్రజా ప్రతినిధుల వద్ద ఆడ పోలీసులను ఉంచి ఈ రచ్చ జరగడానికి కారణం అయ్యారని పేర్కొన్నారు. అసెంబ్లీలో పలానా డ్రెస్సు వేసుకొని రావాలని ఎక్కడా లేదని, కాంగ్రెస్ యువ నేత రాహుల్ గాంధీ పార్లమెంట్లో నల్ల చొక్కాలు ధరించి నిరసన తెలిపితే తప్పులేదు కానీ తెలంగాణ అసెంబ్లీలో బిఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపేందుకు వెళితే అరెస్టులు చేస్తారా అంటూ ప్రశ్నించారు. మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసుల తీరు అత్యంత బాధాకరం అన్నారు.

# ఐఆర్‌సిటిసి కేసులో లాలూకు షాక్

## మనీలాండరింగ్ అభియోగాలు రౌస్ అవెన్యూ కోర్టుల ప్రత్యేక న్యాయమూర్తి ఉత్తర్వులు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 10:** లారా ప్రాజెక్ట్స్ మనీలాండరింగ్ కేసులో రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జెడి) అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్, ఆయన భార్య రబ్రీదేవి, కుమారుడు తేజస్వి యాదవ్, పలువురిపై మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద ఢిల్లీ కోర్టు అభియోగాలు మోపింది. రౌస్ అవెన్యూ కోర్టుల ప్రత్యేక న్యాయమూర్తి (పిసి యాక్ట్) విశాల్ గోగ్నే ఈ ఉత్తర్వును జారీ చేశారు. లారా ప్రాజెక్ట్స్, సరళా గుప్తా, ప్రేమ్ చంద్ గుప్తా, సుజాత హోటల్స్, వినయ్ కొచ్చర్, విజయ్ కొచ్చర్‌లపై కూడా కోర్టు మనీలాండరింగ్ అభియోగాలు మోపింది. న్యాయమూర్తి గోగ్నే, రాహుల్ యాదవ్ (లాలూ యాదవ్ అల్లుడు), గౌరవ్ గుప్తా, నాథ్ మల్ కంకర్నియా, విజయ్ త్రిపాఠి, డిఎన్ తులశ్యాన్, రాజీవ్ రెలాన్, అభిషేక్ ఫైనాన్స్‌లను నిర్దోషులుగా విడుదల చేశారు. 2025 అక్టోబర్ 13న, లాలూ యాదవ్‌పై అవినీతి, నేరపూరిత కుట్ర, మోసం వంటి నేరారోపణలను కోర్టు నమోదు చేసింది. తేజస్వి యాదవ్, రబ్రీ దేవిలపై కుట్ర, మోసంతో సహా పలు నేరారోపణలు ఉన్నాయి. మాజీ రైల్వే మంత్రి లాలూ యాదవ్ రైల్వేకు అధిపతిగా ఉన్నప్పుడు,

ఒక ప్రైవేట్ సంస్థకు కాంట్రాక్టులు ఇప్పించడానికి ఆయన, ఆయన కుటుంబం లంచంగా విలువైన భూములు, షేర్లను స్వీకరించారని సిబిఐ ఆరోపించింది.

# ఇద్దరి ప్రాణాలు తీసిన కుటుంబ కలహాలు

## భార్య ఆత్మహత్యతో రైలుకింద పడి మరణించిన భర్త

**తార్నాక, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :** కుటుంభ కలహాల కారణంగా గృహిణి అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడగా ఆమె మృతిని జీర్ణించుకోలేని భర్త రైలు పట్టాలపై పడుకొని బలవర్మణానానికి పాల్పడిన విషాదకర సంఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్పెక్టర్ రవికిరణ్, ఎస్సై విజయ్ కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా అఫ్జల్‌పూర్ వాసి అయిన శరణప్ప (28) గత ఏడాదిన్న క్రితం ఉపాది కోసం తన భార్య లక్ష్మి (24)తో కలిసి ఉపాది కోసం తార్నాకకు వచ్చి విజయపురి కాలనీలో ఉంటున్నారు. శరనప్ప నాచారంలో టీస్టాల్లో టీ చేస్తూ ఉపాది పొందుతున్నాడు. శరణప్ప మధ్య సేవిస్తూ నిత్యం భార్యతో గొడవకుపాల్పడుతుండే వాడు. ఇద్దరి మధ్య మాటా మాట పెరిగి గొడవ పెద్దదిగా మారింది. అర్ధరాత్రి దిటిన తరువాత నిద్ర నుంచి లేచి చూసిన శరణప్పకు భార్య మృతి చెంది కనిపించింది. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన ఆయన లాలాపేట్ రైలు పట్టాల వద్దకు చేరుకొని పట్టాలపై పడుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# దళితుల్ని ఓటుబ్యాంకుగా వాడుకుంటున్న కాంగ్రెస్, బిఆర్ఎస్

## బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్

**హైదరాబాద్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. తమ సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం దళిత సమాజ మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నారని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు దళితులను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితం చేస్తూ, వారి ఆత్మగౌరవాన్ని, నాయకులను పదే పదే అవహేళన చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నాయని మండిపడ్డారు. ఈ మీడియా సమావేశంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి అభిషేక్ జిగిని, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు రామస్వామి, శ్రవణ్, అరవింద్, రామ్మోహన్ తదితర నాయకులు పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేస్తున్నామంటూ రాజ్యాంగబద్ధమైన శాసనసభ సభాపతి స్థానంలో ఉన్న దళిత వర్గానికి చెందిన వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, దుర్భాషలాడటం వారి దళిత వ్యతిరేక మనస్తత్వానికి నిదర్శనమని అన్నారు. అలాగే, దళిత వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఫామ్‌హౌస్ ఎదుట దళిత సంఘాలు డప్పుకొట్టి నిరసన వ్యక్తం చేస్తే.. వారు వెళ్లిన తర్వాత ఆ ప్రదేశంలో శుద్ధి పేరుతో పసుపు నీళ్లు చల్లడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. వందేళ్ల క్రితం మూతికి ముంత, నడుముకు చీపురు కట్టుకుని తిరిగేలా అంటరానితనం నెరిపిన నాటి వివక్షాపూరిత ఆలోచనలనే నేడు బిఆర్ఎస్ నేతలు గుర్తుచేస్తున్నారని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్ల ఆత్మగౌరవంతో బతుకుతున్న దళిత సమాజాన్ని ఈ రకంగా అవమానించడం క్షమించరాని నేరమని స్పష్టం చేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి చెందిన యువజన విభాగం బిజెపి రాష్ట్ర కార్యాలయంపై విచక్షణారహితంగా దాడికి పాల్పడటమే కాకుండా, కార్యాలయంలో ఉన్న పూజ్య సంత్ రవిదాస్ మహారాజ్ 650వ జయంతి ఉత్సవాల పోస్టర్లపై నల్లరంగు పూసి తీవ్రంగా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. మహనీయుడు సంత్ రవిదాస్ చిత్రపటాలపై నల్లరంగు రుద్దినవారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, ప్రభుత్వం చేతుల్లో కీలుబొమ్మగా మారిన పోలీసు యంత్రాంగం ఇప్పటివరకు దోషులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.

## చాంగ్వాన్ వరల్డ్స్‌లో మోనాకు రజతం, అవనికి కాంస్యం

**చాంగ్వాన్:** ప్రపంచ షూటింగ్ పారా స్పోర్ట్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ డబుల్ పోడియంను కైవసం చేసుకుంది. చాంగ్వాన్‌లో గురువారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్1 ఈవెంట్‌లో మోనా అగర్వాల్ రజతం గెలుచుకోగా, రెండుసార్లు పారాలింపిక్ ఛాంపియన్ అయిన అవని లేఖర



కాంస్యం కైవసం చేసుకుంది. పారిస్ 2024 పారాలింపిక్స్‌లో కాంస్యం గెలుచుకున్న మోనా, రెండవ స్థానంలో నిలవడం ద్వారా లాస్ ఏంజిల్స్ 2028 పారాలింపిక్స్‌కు భారతదేశానికి కోటా స్థానాన్ని దక్కించుకుంది. 22 ఏళ్ల సెర్బియా క్రీడాకారిణి క్రిస్టినా ట్రిఫునోవిక్ 250.2 స్కోరుతో స్వర్ణంగెలుచుకోగా, 250.0 స్కోరుతో నిలిచిన మోనాను ఆమె స్వల్పతేడాతో అధిగమించింది. అవని 229.4 స్కోరుతో కాంస్యం గెలుచుకుంది. అలాగే నాలుగేళ్ల విరామం తర్వాత ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లకు తిరిగి వచ్చిన అవానికి కాంస్యం లభించింది. రైఫిల్ ఈవెంట్లలో రెండుసార్లు పారాలింపిక్ ఛాంపియన్‌గా, మూడుసార్లు పారాలింపిక్ పతక విజేతగా నిలిచిన అవని, పారాలింపిక్స్‌లో వరుసగా ఆర్2 స్వర్ణ పతకాలను గెలుచుకోవడంతో పాటు, ఆర్2 మరియు ఆర్8 విభాగాలలో తన తొలి ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిళ్లను కూడా కైవసం చేసుకుంది. ఆమె చాంగ్వాన్ రేంజ్‌తో సుపరిచితురాలు, ఎందుకంటే అక్కడ జరిగిన మూడు ప్రపంచ కప్‌లలో పోటీపడి, 2022లో స్వర్ణం గెలుచుకుంది.

## మహిళల హాకీ ఆసియా కప్‌లో పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం

**చైనా:** మహిళల జూనియర్ ఆసియా కప్-2026, క్వార్టర్ ఫైనల్స్‌లో భారత్ పాకిస్థాన్‌ను 19-0 తేడాతో చిత్తుగా ఓడించి, టోర్నమెంట్‌లోని సెమీఫైనల్స్‌లో చోటు దక్కించుకుంది. చైనాలో గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఏడవ నిమిషంలో పాకిస్థాన్‌పై భారత్ తరఫున పూజా సాహు తొలి గోల్ చేయగా, డిఫెండింగ్ ఛాంపియన్ అయిన భారత్ క్రమం తప్పకుండా గోల్స్ చేస్తూనే ఉండటంతో ప్రత్యర్థి పూర్తిగా నిస్సహాయంగా కనిపించింది. సానికా మానే రెండు



గోల్స్ చేయగా, అర్ధభాగం ముగిసేసరికి భారత్ ప్రత్యుత్తరం లేకుండా 10 గోల్స్ చేసింది. ఆట తిరిగి ప్రారంభమైనప్పుడు భారత్‌కు మరో తొమ్మిది గోల్స్ నమోదయ్యాయి. వీటిలో పూకా మాలిక్ హ్యాట్రిక్ సాధించగా, సుప్రియ, పూర్ణిమా యాదవ్ చెరో రెండు గోల్స్ చేశారు భారత్ యొక్క నిరంతర దాడులకు పాకిస్థాన్ తేరుకోలేకపోయింది. భారత్ ఒత్తిళ్లకు పాకిస్థాన్ తిరిగి పుంజుకోవడంలో విఫలమై ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. ఈ మ్యాచ్‌లో ఆసియా కప్‌లో జపాన్, మలేషియా, దక్షిణ కొరియాలను ఓడించి తన గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచిన భారత్, ఇప్పుడు ఫైనల్ పోరులో స్థానం కోసం దక్షిణ కొరియామలేషియా మ్యాచ్ విజేతతో తలపడనుంది. 2023, 2024లో మహిళల జూనియర్ ఆసియా కప్ టైటిల్‌ను గెలుచుకున్న భారత్, వరుసగా మూడోసారి టైటిల్ గెలుచుకోవాలని చూస్తోంది.




## హారిత విజయం

**న్యూఢిల్లీ:** ఇండియన్ అథ్లెటిక్స్ సిరీస్ ఫైనల్‌లో 100 మీటర్ల ఫైనల్‌లో విజయం సాధించి స్ప్రింటర్ హారిత భద్ర, అత్యంత వేగవంతమైన రెండవ భారతీయ మహిళగా నిలిచింది. గత ఆగస్టులో భువనేశ్వర్‌లో జరిగిన వరల్డ్ అథ్లెటిక్స్ సిల్వర్ లెవెల్ కాంటినెంటల్ టూర్ మీట్‌లో 11.46 సెకన్ల వ్యక్తిగత ఉత్తమ సమయాన్ని నమోదు చేసిన మహారాష్ట్రకు చెందిన 23 ఏళ్ల స్ప్రింటర్ హారిత గురువారం న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్లో 6వ లేన్‌లో పరుగెత్తుతూ 11.22 సెకన్ల సమయాన్ని నమోదు చేసింది. దీంతో 2021 నాటి ద్యూతీ చంద్ జాతీయ రికార్డును కేవలం ఐదు వందల సెకన్ల తేడాతో కోల్పోయింది. మొదట్లో, ఐచి-నగోయాలో జరగబోయే ఆసియా క్రీడల కోసం ప్రకటించిన భారత బృందంలో హారితకు చోటు దక్కలేదు. కానీ తర్వాత చేర్చారు. ఆమె జపాన్‌లో జరిగే 200 మీటర్ల ఈవెంట్‌లో పోటీపడనుంది. ఇక తమిళనాడుకు చెందిన అభినయరాజరాజన్ (11.31 సెకన్లు, రెండవ స్థానం) మరియు గిరిధరణి రవికుమార్ (11.35 సెకన్లు, మూడవ స్థానం), అలాగే కర్ణాటకకు చెందిన ఉన్నతి బొల్లాండ (11.37 సెకన్లు, నాలుగవ స్థానం), స్నేహ ఎస్ఎస్ (11.41 సెకన్లు, ఐదవ స్థానం) కూడా తమ వ్యక్తిగత ఉత్తమ సమయాలను మెరుగుపరుచుకున్నారు. హారితతో పాటు, ఉన్నతి కూడా ఈ ఖండాంతర ఈవెంట్‌లో మహిళల 200 మీటర్ల పోటీలో పాల్గొననుంది. మహిళల 4+100 మీటర్ల రిలే ఈవెంట్ కోసం అభినయ మరియు స్నేహ ఎంపికయ్యారు.

## ఆసియా క్రీడల్లో గోల్డ్ మెడల్ లక్ష్యం

### భారత్ ప్రధాన జట్టుకే బాధ్యత

### వెస్టిండీస్ వన్డేకు టీమిండియా బి

**న్యూఢిల్లీ:** ఈ నెల 28 నుండి ప్రారంభం కాబోతున్న ఆసియా క్రీడలు 2026లో క్రికెట్ ఈవెంట్ కోసం భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) ఒక కీలక నిర్ణయాన్ని ప్రకటించింది. గోల్డ్ మెడల్ సాధించడం ప్రధాన లక్ష్యంగా ఆసియా క్రీడకు భారత్ తన ప్రధాన జట్టునే పంపేందుకు సిద్ధమవుతోంది. ఈమేరకు బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా అధికారికంగా ఈ విషయాన్ని ధృవీకరించారు. వాస్తవానికి ఆసియా క్రీడలకు భారత్ బి టీమ్‌ను పంపాలని ఆలోచన చేసిన బీసీసీఐ చివరకు ఆ ఉద్దేశ్యాన్ని మార్పుకుంది. జపాన్‌లోని ఐచినగోయాలో జరిగే ఈ క్రీడలలో బస చేయడానికి సరైన వసతులు లేవని, పిచ్ పరిస్థితులు కూడా అనుకూలంగా ఉండవని, దీనివల్ల ఆటగాళ్లకు గాయాలయ్యే ప్రమాదం ఉందనే ఉద్దేశ్యంతో ఆసియా క్రీలకు బి టీమ్‌ను పంపాలని అనుకున్నా, ఈ సమస్యలను పక్కన పెట్టి, దేశం కోసం పతకాన్ని గెలుచుకోవాలనే సంకల్పంతో బలమైన జట్లను పంపాలని నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 22న జపాన్‌తో జరగనున్న మ్యాచ్ కోసం కూడా ప్రధాన జట్టునే పంపుతామని బీసీసీఐ హామీ ఇచ్చింది. అయితే, ఈ కీలక నిర్ణయం షెడ్యూల్ వివాదానికి దారి తీస్తోంది. ఆసియా క్రీడలు ఈ నెల 28 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనుండగా, వెస్టిండీస్‌తో స్వదేశంలో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఇదే నెల 27 నుంచి అక్టోబర్ 3 వరకు షెడ్యూల్ ఫిక్స్ అయింది. ఆసియా క్రీడల క్రికెట్ ఫైనల్ మ్యాచ్, వెస్టిండీస్‌తో జరిగే మూడవ వన్డే మ్యాచ్ సరిగ్గా ఒకే రోజు అక్టోబర్ 3 జరగనున్నాయి. దీంతో ఈ అసాధ్యమైన షెడ్యూల్‌ను ఎలా నిర్వహించాలనేది చర్చనీయాంశంగా మారింది. ఈ పరిస్థితి వల్ల భారత జట్టును రెండుగా విభజించాల్సిన అవసరం ఏర్పడుతుంది. శ్రేయాస్ అయ్యర్ వంటి స్టార్ ఆటగాళ్లు ఆసియా క్రీడల కంటెంజెంట్‌కు నాయకత్వం వహించడానికి జపాన్‌కు వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. ఫలితంగా



వెస్టిండీస్‌తో జరిగే వన్డే సిరీస్‌కు ప్రధాన జట్టులోని కొంతమంది కీలక ఆటగాళ్లు అందుబాటులో ఉండరు. ఇది రుతురాజ్ గైక్వాడ్, రజత్ పాటిదార్ వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లకు భారత వన్డే జట్టులో స్థానం దక్కించుకోవడానికి ఒక సువర్ణావకాశంగా మారనుంది. రిషబ్ పంత్ కు కూడా ఇది వన్డే క్రికెట్‌లోకి తిరిగి రావడానికి సరైన వేదికగా ఉంటుందా అనేది చూడాలి. ఈ సంక్లిష్టమైన పరిస్థితిని ఎలా నిర్వహిస్తుంది, ఏ ఆటగాళ్లను ఏ సిరీస్‌కు ఎంపిక చేస్తుంది, వన్డే సిరీస్‌కు ఎవరు నాయకత్వం వహిస్తారు అనే విషయాలపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.


### 13 యేళ్ల నిరీక్షణ తర్వాత..

## దులీప్ ట్రోఫీ ఛాంపియన్‌గా ఈస్ట్ జోన్

**చెన్నై:** ఇషాన్ కిషన్ నేతృత్వంలోని ఈస్ట్ జోన్ జట్టు ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీ టైటిల్‌ను కైవసం చేసుకుని ఛాంపియన్‌గా నిలిచింది. చెన్నైలో గురువారం జరిగిన ఫైనల్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా సౌత్ జోన్‌ను ఓడించి, ఈస్ట్ జోన్ 13 ఏళ్ల నిరీక్షణకు తెరదించింది. ఈ విజయంతో ఈస్ట్ జోన్ మూడవ దులీప్ ట్రోఫీ టైటిల్‌ను దక్కించుకుంది. ఈ మ్యాచ్‌లో తమ రెండవ ఇన్నింగ్స్‌ను తిరిగి ప్రారంభించిన ఈస్ట్ జోన్ మహ్మద్ కౌనైన్ ఖురైషీ సెంచరీతో (116) నాటౌట్‌గా నిలవగా, అనుకుల్ రాయ్ నిలకడగా అర్ధ సెంచరీ (64) సాధించాడు. దీంతో ఈస్ట్ జోన్ 99.2 ఓవర్లలో 388/7 వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో కెప్టెన్ కిషన్ 270, కుమార్ కుశాగ్ర 101 పరుగులు చేయడంతో, 708 పరుగులు సాధించి ఈస్ట్ జోన్ ఫైనల్‌పై పట్టు సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో కిషన్ మరో 80 పరుగులు జోడించి మ్యాచ్‌లో మొత్తం 350 పరుగులతో ముగించాడు. కుశాగ్ర శతకంతో పాటు, శిఖర్ మోహన్ తన దులీప్ ట్రోఫీ అరంగేట్రంలోనే అద్భుతమైన 85 పరుగులు చేశాడు. ఖురైషీ, రాయ్‌లు తమ ఏడవ వికెట్ భాగస్వామ్యాన్ని 150 పరుగులకు విస్తరించడంతో, ఈస్ట్ జోన్ మొత్తం ఆధిక్యం 700 పరుగులకు పైగా చేరింది. తర్వాతి ఓవర్‌లో స్పిన్నర్ త్రిపురాణ



విజయ్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్సర్లు కొట్టాడు. రాయ్ ఎం.డి. నిధీష్ బౌలింగ్‌లో స్లిప్‌లో ఉన్న దేవదత్ పడిక్కల్ చేతికి చిక్కడంతో 64 పరుగుల వద్ద అతని ఇన్నింగ్స్ ముగిసింది. 100వ ఓవర్ రెండో బంతికి ఖురైషీ మిలింద్ బౌలింగ్‌లో క్యాచ్ ఇవ్వడంతో, కిషన్ పెవిలియన్ నుంచి డిక్లరేషన్‌కు సంకేతం ఇచ్చాడు. అనంతరం అంపైర్లు బెయిల్స్‌ను తొలగించడంతో, ఫైనల్ అధికారికంగా ముగిసి, ఈస్ట్ జోన్ ఛాంపియన్‌గా ఖరారైంది. ఫలితం ఖరారైనప్పటికీ సౌత్ జోన్ పేసర్ మహమ్మద్ సిరాజ్ తొమ్మిది ఓవర్ల పాటు తీవ్రంగా బౌలింగ్ చేశాడు.




## పసిడి ఇటిఎఫ్‌లలోకి పెట్టుబడుల వెల్లువ!

**ముంబయి, సెప్టెంబరు 10:** దేశీయంగా బంగారం ధరలు పరుగులు పెడుతుండటంతో పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడిగా భావించే పసిడి వైపు భారీగా మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా గత ఆగస్టు నెలలో గోల్డ్ ఎక్స్ఛేంజ్‌ట్రేడెడ్ ఫండ్లలోకి పెట్టుబడులు వెల్లువెత్తాయి. జులైతో పోలిస్తే ఆగస్టులో ఏకంగా 67 శాతం వృద్ధితో రూ. 2,596.70 కోట్ల నికర పెట్టుబడులు వచ్చినట్లు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) డేటా విడుదల చేసింది. జులై నెలలో గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి రూ. 1,559 కోట్ల పెట్టుబడులు రాగా, ఆగస్టులో మరింత పెరిగింది. ఆగస్టు నెలలో మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఎంసీఎక్స్‌లో బంగారం ధర సుమారు 7.7 శాతం పెరగడమే ఈ పెట్టుబడుల పెరుగుదలకు ప్రధాన కారణం. వరుసగా మూడో నెల కూడా గోల్డ్ ఈటీఎఫ్‌లు సానుకూల వృద్ధిని నమోదు చేయడం, బంగారం ఆధారిత పెట్టుబడి సాధనాలపై ఇన్వెస్టర్లకు పెరుగుతున్న ఆసక్తిని సూచిస్తోంది. వెండి ఈటీఎఫ్‌లు కూడా ఆగస్టులో రూ. 1, 270.63 కోట్ల నికర పెట్టుబడులను ఆకర్షించాయి. ఒకవైపు బంగారంపై పెట్టుబడులు పెరుగుతున్నప్పటికీ, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి కూడా నిధుల ప్రవాహం బలంగా కొనసాగింది. మార్కెట్ ఒడుదొడుకులు ఉన్నప్పటికీ, యాక్టివ్‌గా నిర్వహించే ఈక్విటీ పథకాలలోకి ఆగస్టులో నికరంగా రూ. 29,328.62 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. జులైలో వచ్చిన రూ. 24,697.39 కోట్లతో పోలిస్తే ఇది దాదాపు 19 శాతం అధికం. ఆగస్టులో సిప్ ద్వారా వచ్చిన పెట్టుబడులు రూ. 32,297కోట్లకుచేరాయి. జులైలో ఈ మొత్తం రూ. 31,961 కోట్లుగా ఉంది. సిప్ పెట్టుబడులు నిలకడగా పెరగడం మ్యూచువల్ ఫండ్లపై చిన్న మదుపర్ల విశ్వాసానికి అద్దం పడుతోంది. గోల్డ్, ఈక్విటీ ఫండ్లలోకి పెట్టుబడులు పెరిగినప్పటికీ, మొత్తం మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలోకి వచ్చిన నికర పెట్టుబడులు ఆగస్టులో గణనీయంగా తగ్గాయి.

**వాణిజ్యం**

## సమ్మెలోకి బ్యాంకుల సిబ్బంది

### దేశవ్యాప్తంగా బ్యాంకులకు వరుసగా 4 రోజులు సెలవులు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 10:** దేశవ్యాప్తంగా బ్యాంకు ఖాతాదారులకు ముఖ్యమైన సమాచారం. సెప్టెంబర్ 11 నుంచి వరుసగా నాలుగు రోజుల పాటు బ్యాంకు సేవలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉంది. బ్యాంకు ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునివ్వడం, దానికి వరుస సెలవులు జత కలవడమే ఇందుకు కారణం. దీంతో ముఖ్యమైన ఆర్థిక లావాదేవీలు ఉన్నవారు ముందుగానే తమ పనులను పూర్తి చేసుకోవాలని బ్యాంకులు సూచిస్తున్నాయి. తమ ప్రధాన డిమాండ్ల సాధన కోసం యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ సమ్మెకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా శుక్రవారం దేశవ్యాప్తంగా ఒకరోజు సమ్మె చేపట్టనుంది. ఆ తర్వాత రోజు 12 రెండో శనివారం, సెప్టెంబర్ 13 ఆదివారం సాధారణ సెలవులు. ఇక 14వ తేదీ సోమవారం వినాయక చవితి పండుగ సందర్భంగా పలు రాష్ట్రాల్లో బ్యాంకులకు సెలవు ప్రకటించారు. దీంతో శుక్రవారం నుంచి సోమవారం వరకు వరుసగా నాలుగు రోజులు బ్యాంకులు మూతపడనున్నాయి. వారానికి 5 రోజుల పనిదినాలను అమలు చేయాలన్నది బ్యాంకు ఉద్యోగ సంఘాల ప్రధాన డిమాండ్‌గా ఉంది. దీనిపై 2024లోనే సూత్రప్రాయ అంగీకారం కుదిరినప్పటికీ, అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని యూనియన్లు ఆరోపిస్తున్నాయి. దీంతో పాటు, సవరించిన పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల పథకాన్ని సమీక్షించాలని, పెన్షన్ సంబంధిత సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాయి. ఈ విషయమై ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్, బ్యాంకర్లతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో సమ్మెను వాయిదా వేయాలని అధికారులు కోరినా, స్పష్టమైన హామీ లభించకపోవడంతో యూనియన్లు అందుకు నిరాకరించాయి. డిమాండ్లు నెరవేరని పక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని యూఎఫ్ బీయూ హెచ్చరించింది. సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు, అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని స్పష్టం చేసింది. ఈ సమ్మె ప్రభావం ముఖ్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులపై అధికంగా ఉండనుంది. ప్రైవేట్ బ్యాంకులపై ప్రభావం తక్కువగా ఉండొచ్చు. ఈ నేపథ్యంలో, ఖాతాదారులు నగదు డిపాజిట్లు, విత్‌డ్రాలు, చెక్కుల క్లియరెన్స్, రుణ సంబంధిత పనులు వంటివి 11వ తేదీ లోపే పూర్తి చేసుకోవడం మంచిది. ఏటీఎంలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ వంటి డిజిటల్ సేవలు యథావిధిగా పనిచేస్తాయని బ్యాంకులు తెలిపాయి. యూఎఫ్‌బీయూ సమ్మె నోటీసు ప్రకారం బ్యాంకు ఉద్యోగులుఈనెల 11వ తేదీతో పాటు మరికొన్ని రోజుల్లోనూ సమ్మె చేస్తామని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. ఇందులో సెప్టెంబర్ 28, 29, 30 తేదీలు సైతం ఉన్నాయి. అప్పటికి సైతం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.



## కాగ్నిజెంట్‌పై అమెరికా కార్మికశాఖ వేటు!

**వాషింగ్టన్, సెప్టెంబరు 10:** భారత మూలాలున్న ప్రముఖ టెక్ దిగ్గజం, అమెరికాలో లిస్ట్ అయిన కాగ్నిజెంట్‌కు అక్కడ భారీ ఎదురుదెబ్బ తగిలింది. వీసా మోసం ఆరోపణలపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగా, కొత్తగా గ్రీన్ కార్డ్ స్పాన్సర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేయకుండా కంపెనీపై యునైటెడ్ స్టేట్స్ కార్మిక శాఖ నిషేధం విధించింది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆంథోనీ డిఖిఎస్పోసిటో అధికారికంగా ప్రకటించారు. ఈ నిర్ణయం ప్రకారం కాగ్నిజెంట్ కొత్తగా పీఈఆర్ఎం (ప్రోగ్రామ్ ఎలక్ట్రానిక్ రివ్యూ మేనేజ్‌మెంట్) ఫైలింగ్స్ చేసేందుకు వీలుండదు. విదేశీ ఉద్యోగులకు శాశ్వత నివాసం (గ్రీన్ కార్డ్) కోసం స్పాన్సర్ చేయాలనుకునే కంపెనీలు తప్పనిసరిగా కార్మిక శాఖ నుంచి ఈ లేబర్ సర్టిఫికేషన్‌ను పొందాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియపైనే ఇప్పుడు సస్పెన్షన్ విధించడం గమనార్హం. ఈ పరిణామం కాగ్నిజెంట్‌పై ఆధారపడిన వేలాది మంది భారతీయ టెక్ నిపుణుల్లో ఆందోళన కలిగిస్తోంది. 1994లో చెన్నైలో ప్రారంభమై, ప్రస్తుతం అమెరికాలో ప్రధాన కార్యాలయం కలిగిన కాగ్నిజెంట్, హెచ్1బీ వీసాలను అత్యధికంగా వినియోగించుకునే సంస్థల్లో ఒకటి. 2026 ఆర్థిక సంవత్సరానికి గానూ ఈ కంపెనీకి 3,510 హెచ్1బీ వీసా పిటిషన్లు ఆమోదం పొందాయి. అమెజాన్, టీసీఎస్, ఇన్ఫోసిస్, యాపిల్, మైక్రోసాఫ్ట్ తర్వాత ఆరో స్థానంలో కాగ్నిజెంట్ ఉంది.



## స్టాక్ మార్కెట్లకు ఊరట..

### మూడు రోజుల నష్టాలకు బ్రేక్

**ముంబయి,సెప్టెంబరు 10:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు గురువారం స్వల్ప లాభాలతో ముగిశాయి. చివరి దశలో కొనుగోళ్లు ఊపందుకోవడంతో నిఫ్టీ, సెన్సెక్స్‌లు మూడు రోజుల వరుస నష్టాలకు తెరదించాయి. సాధారణ ట్రేడింగ్ సమయంలో నష్టాల్లో ఉన్న సూచీలుముగింపు వేలంలో జరిగిన కొనుగోళ్లతో కోలుకున్నాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత పెరగడంతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లకు పైగా కొనసాగడం మార్కెట్‌పై ప్రభావం చూపింది. బీఎస్ఈ సెన్సెక్స్ 138.36 పాయింట్లు పెరిగి 74,902.59 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 46.30 పాయింట్లు లాభపడి 23,477.80 వద్ద స్థిరపడింది. అంతకుముందు వరుసగా మూడు సెషన్లలో సెన్సెక్స్ 2.29 శాతం, నిఫ్టీ 1.95 శాతం చొప్పున నష్టపోయాయి. సెన్సెక్స్‌లో భారతి ఎయిర్‌టెల్ 1.34 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.98 శాతం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 0.92 శాతం చొప్పున లాభపడ్డాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.40 శాతం పడిపోగా, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.01 శాతం స్వల్పంగా పెరిగింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.